17 (5)

ఆగస్టు, 1936. విడిప్రతి 2 అణాలు

# ఆంధ్రభూమి

సంపుటము : ౫. ధాతు, శ్రావణము. సంచిక ౧.

[library stamp]

## ఈ సంచికలో

విజ్ఞానము :

రబ్బరుగొట్టంధరించి స్త్రీసంభోగంచెయ్యడం మంచిదా?
—డా. వెంకటరావు బి. ఏ

చతురంగక్రీడను కనుగొన్నది స్త్రీయా?
— కె. సత్యనారాయణ, బి. ఏ., బి. ఎల్.

పాముబుసకొట్టడం మేకపోతుగాంభీర్యం లాంటిది.
—ఆంధ్ర గంగారావు, యల్. ఐ. యమ్.

హాస్యము

సత్యంఅనేది మానవుల్ని చెరచడానికి పుట్టింది—
—అసత్యంఅనేది చేసే సంఘసేవ వర్ణనాతీతం.
—మొదలి వెంకటరామయ్య.

కథలు :

లోకసత్యాలు.
—భావరాజు నరసింహారావు.

రాధ శ్రీకృష్ణుని మేనత్తయా?

చరితము :

ఆస్ట్రియాకు కాబోయేరాజు ఆటో రాజకుమారుడు.
—ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.

రాజకీయము :

జర్మనీయుద్ధపు నష్టపరిహారములు.
—వేగుల రామచంద్రశాస్త్రి, బి.ఏ. (ఆనర్సు)

ఆరోగ్యము

— — నీవు పాలతిల్లి పై వుంటే. . . . .
అనుభవవైద్యుని అమృతసూక్తులు.

ఆంధ్రభూమి ముద్రణాలయము—వేపేరి, మదరాసు.

# సువర్ణసుందరరసము
## సర్వసవామేహములకు
## సంజీవివంటిది

ఎటువంటి సవామేహములనైన కుదుర్చును. ఇంజక్షనులు అవసరములేదు. అనేకులు వాడి మెచ్చి యున్నారు. 60 ఏండ్లు వైద్యమున అనుభవము గల కీ. శే. వేటూరి సుందరశాస్త్రి గారిచే కనిపెట్టబడినది. వాడువిధము మందుతో పంపబడును.

వెల : 50 మాత్రలు: రు. 5-0-0.

# ఆర్యరసాయనశాల, ముక్త్యాల

## అభ్రకభస్మము.

—: అమృతమువంటిది :—

బహుమూత్రమును, క్షయను,
దగ్గును పోగొట్టి వీర్యవృద్ధిని గలిగించును.
మూత్రమునందుండు చక్కెరను మాయముచేయును.
ప్రశస్తమైన రసాయనము. వెల: తులము 1-కి: రు. 5-0-0.

కన్సల్టింగు ఫిజీషియన్:—

ఆయుర్వేదభూషణ వేటూరి శంకరశాస్త్రి గారు, ఎ.ఎం.ఎ,సి.

బెజవాడ కృష్ణా పుష్కర స్వదేశీ ఎగ్జిబిషనులో మాకుమాత్రమే సువర్ణపతకము
సరుకుమంచికిగాను బహుమానముగా యివ్వబడినది.



50 సంవత్సరములనుండి
భారతదేశమునందంతటను ఉపయోగింపబడి
ప్రసిద్ధిగాంచిన మేలురకపు

## రోలు కృష్ణమార్కు
## యింగువ.

ప్రస్తుతము రోలు కృష్ణమార్కు యింగువ సీమఫేన్సీ డబ్బాలలో
పేకింగు చేయబడిన ... 1 శేరు డబ్బా వెల రూ. 1-1-0.

త్వరలో మీఆర్డర్లను పంపుడు.

### లాల్ జీ గోధు అండు కంపెని

నెంబరు, 8, పెరుమాళ్ మొదలి వీధి, సౌకారుపేట, మదరాసు.
హెడ్ ఆఫీసు :—బొంబాయి, 3.



OFFICE OF THE REGISTRAR OF BOOKS
15 DEC 193
MADRAS



## ఆంధ్రభూమి

సచిత్రాంధ్రమాసపత్రిక.

ప్రతిమాసమున ౨౧-వ తేదిని ప్రచురింపబడును.

చందావివరము.

| | |
|---|---|
| సంవత్సరమునకు | రు. 3-౦-౦. |
| అర్ధసంవత్సరమునకు | రు. ౧-౮-౦. |
| నాలుగు మాసములకు | రు. ౧-౦-౦. |
| విడిసంచిక | రు. ౦-౪-౦. |



ఆంధ్రకీర్తిగ్రంథమాల: ౧:

## ఆంధ్రరమణీమణులు

(మొదటిభాగము.)

ఇందు రుద్రమ్మ, గణపమ్మ, నాగమ్మ, మాంచాల, రాగమ్మ, మహాలక్ష్మమ్మ, సీతమ్మ, మల్లమ్మ, రమణమ్మ అను తొమ్మండుగురు తెనుగుతెఱవల జీవితములు తేటతెనుగున శైలి కలవును, స్త్రీలకును ఉపయుక్తముగ నుండునట్లు వ్రాయబడినవి. స్త్రీవిద్యాభిమానులాదరింపదగిన గ్రంథము. గ్లేజుకాగితములు, క్రౌను సైజు. 96 పుటలు. చక్కని అచ్చు. ప్రతి ఒక్కంటికి 0—9—0 అణాలు.

చిరునామా:—
ఆంధ్రభూమి కార్యాలయం: వేపేరి, మదరాసు.


'ఆంధ్రభూమి' ప్రకటనలు

## సువర్ణసుందరరసము

—: సర్వ సవామేహములకు సంజీవివంటిది :—

ఎటువంటి సవామేహములనైన కుదుర్చును. ఇంజక్షనులు అవసరములేదు. అనేకులు వాడి మెచ్చియున్నారు. 60 ఏండ్లు వైద్యమున అనుభవముగల కీ. శే. వేటూరి సుందరశాస్త్రి గారిచే కనిపెట్టబడినది. వాడువిధము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రలు: రు. 5-0-0.

# ఆర్యరసాయనశాల, ముక్త్యాల

## అభ్రక భస్మము

—: అమృతమువంటిది :—

బహుమూత్రమును, క్షయను, దగ్గును పోగొట్టి వీర్యవృద్ధిని గలిగించును. మూత్రమునందుండు చక్కెరను మాయముచేయును. ప్రశస్తమైన రసాయనము.

వెల: తులము 1 కి: రు. 5-0-0.



# నిద్రాహీనత

మనుజునకు నిద్రాహీనత దేహమనో దౌర్బల్యమువల్లను సంభవించును. మనుజునకు సహజముగ నుండవలసిననిద్ర లేకపోయినచో మలబద్ధము, అజీర్తి, తలనొప్పి, ఆకలి మందము, మెదడుక్షీణత యేర్పడి కండ్లు గుంటలు పడి బహునిస్సత్తువగ నుండును.

. జీవామృతము వీర్యవృద్ధిని, కండపుష్టిని, జవసత్వములను పెంపొందించుటకేర్పడి మనుజదేహములకు అమూల్యమైనది. దీని సేవనము వల్లను దౌర్బల్యహేతువగు సమస్తవిధజాడ్యములును అరికట్టబడి సంపూర్ణ ఆరోగ్యస్థితి లభించును. స్త్రీ పురుషులెల్లరు సేవింపతగిన ఉత్తమ బలవర్ధకౌషధము.

## జీవామృతము

**(పూర్ణారోగ్యప్రదాయిని)**

పెద్దసీసా రు. 3-4-0. చిన్నసీసా రు. 1-12-0.
ఎల్ల ఔషధవిక్రేతలయొద్దను దొరకును, లేక

**ఆయుర్వేదాశ్రమము.**

151, గోవిందప్పనాయకవీధి, తపాలుపెట్టె 287,
మదరాసు.

---

ఉత్తరజిల్లాలకు,
నిజాంరాజ్యమునకు డిస్ట్రిబ్యూటరు :—
ఇవటూరి కామేశ్వరరావుగారు, బెజవాడ.

ఆంధ్రభూమి

# యేజెంట్లు

బెజవాడ:
పురాణం కుమారరాఘవశాస్త్రిగారు, బి. ఏ.

తెనాలి: బాపట్ల:
కొమ్మూరి కాశీవిశ్వనాథముగారు.
(సోల్ రిప్రజెంటేటివ్ ఆఫ్ న్యూస్)

నిడదవోలు:
నడింపల్లి సూర్యనారాయణగారు.

మచిలీపట్టణము:
వి. జగన్నాథముగారు.

గుంటూరు:
చల్లా రామనాథశాస్త్రిగారు.

విశాఖపట్టణము:
ఆర్. రామచంద్రుడుగారు.

రంగూను:
వి. భగవతిశాస్త్రిగారు.

కాకినాడ:
సున్న బాలకృష్ణారావుగారు.

రాజమండ్రి:
టి. శేషగిరిరావుగారు.

ఏలూరు:
గరికపాటి మల్లావధానులుగారు.

మదరాసు:
ఆకుండి వెంకటశాస్త్రిగారు.

యడ్లపల్లి:
యస్. పి. చౌదరిగారు.


పార్వతీపురము:
కె. జె. మోహనరావుగారు.

## ఏజంట్లు కావలెను

ఇతరప్రదేశములందు ఏజెంట్లు కావలెను. పని చేయ కుతూహలముగలవారు మాతో ఉత్తర ప్రత్యుత్తరములు జరుప కోరెదము.

ఇట్లు, మేనేజరు
ఆంధ్రభూమి కార్యాలయము
వేపేరి, మదరాసు.

# Tri-Colour Process Blocks




**M C A**ppaswamy Chetty & Co.

PROCESS ENGRAVERS

64 Savarimuthu St Mannady MADRAS



# రామప్రియ

గ్రంథకర్త—'కోటీశుతనయ'ను వ్రాసిన

**తాత కృష్ణమూర్తి, బి.ఏ;యల్.టి.**

ఇది సులభశైలిని వ్యవహారికభాషలో వ్రాయబడిన స్వతంత్ర కల్పనాకథల పుస్తకము. డాక్టర్ బుర్రా శేషగిరిరావు (ఎం.ఏ; పి. హెచ్.డి.) గారి పీఠిక కలదు. క్రౌన్ సైజు, వెల 12 అణాలు.

ఈ మనోహరగ్రంథము భాషాసతి కొక మండనమనుట నిక్కువము. —గృహలక్ష్మి

హాస్యరసగర్భితము —వినోదిని.


కథలు మిక్కిలి ముచ్చట లూరుచున్నవి. —భారతి.

కథలలోన హద్దుమీరని స్వేచ్ఛయొక్క ఛాయలు చిత్రింపబడినవి. —ఆనందబోధిని.

చిరునామా:

**తాత కృష్ణమూర్తి, భద్రాచలం.**





వర్తకులారా!

ప్రకటనకర్తలారా!

లైనుబ్లాకులు;
హాఫ్‌టోను బ్లాకులు;
డెమ్మీ, రాయలు
సైజులలో పోస్టరు
బ్లాకులు;
చవకగాను
అందముగాను
త్వరగాను
చేసిఈయబడును.

దిక్లిక్ అండ్ కో.

230, చైనాబజారు
రోడ్, మదరాసు.

ఆంధ్రభూమియందు

ప్రప్రథమమున స్థాపింపబడిన

# ఆంధ్ర ఇన్స్యూరెన్సు కంపెనీ

(లిమిటెడ్)

లోనే ఎల్లరును భీమాచేయండి.

కొలది సంవత్సరములలోనే అత్యద్భుతమగు అభివృద్ధిగాంచి ఆంధ్రుల వ్యాపార నైపుణ్యమును చాటుచున్న సంస్థ.

**1929 సంవత్సరాంతమున జరిగిన మొదటి వాల్యుయేషనులో వేయింటికి సంవత్సరమునకు రూ. 10 లు బోనసు పంచిపెట్టబడెను.**

సాలీనా ఆదాయము సుమారు 3 లక్షలు.

| | |
|---|---|
| భీమానిధి | 5 లక్షలు మించినది. |
| పెట్టుబడులు | 6 లక్షలు ,, |
| జారీకాబడిన పట్టాలు | 6 వేలు |
| ఖర్చులు నూటికి | 30 మాత్రమే |

అన్నిచోట్లను మంచికమీషనుపై పలుకుబడిగల ఏజెంట్లు కావలెను.

ఛీఫ్ ఏజెన్సీలు :

బొంబాయి—పాండ్యా గాంధి
హాసెం బిల్డింగు చర్చిగేటువీధి.

లాహోరు—మెహాతా మెహాతా కంపెనీ
రామ్‌గలి, రైల్వేరోడ్డు.

కలకత్తా—రాయ్‌అండు కంపెనీ
14 హేయరువీధి.

హైదరాబాదు—గాడేపల్లి జగన్నాథం
425 డి స్క్వేయరు.

హెడ్డాఫీసు : బందరు.

ఎఱ్ఱమిల్లి మంగయ్య, బి.ఎ, బి.ఎల్.,
కార్యదర్శి.

'ఆంధ్రభూమి' ప్రకటనలు

# ఆంధ్రభూమి

## అక్టోబరు సంచికకు ప్రశంసలు

౧

అక్టోబరుపత్రిక అత్యద్భుతమైన అభివృద్ధిచూపించుచున్నది. ఈవిధంగా పత్రికను నడపిన ఆంధ్రభూమి త్వరలోనే ఒక గౌరవస్థానము ఆక్రమించగలదని నా అభిప్రాయం. పద్యవ్యాసములే కొంతమంది పెద్దలవి పడవలసిఉన్నవి. అంతటితో పత్రిక సర్వాంగసౌందర్యం కలిగి ఉంటుంది.

—యం. వి. యస్. శర్మ.

౨

'ఆంధ్రభూమి'లో అడగియుండిన ఆంధ్రప్రతిభ యుద్వృత్తగ వెల్లివిరియుచున్నది. తెనుగువారి లోపములు తెనుగువారికిఁ దెల్పి సన్మార్గమును జూపించుచున్నది. మీలోని యుత్కృష్టాంధ్రవ్యక్తిత్వమే మీ పత్రికాపుత్రికయందు గాన నగుచున్నది.

—ఓలేటి సీతారామమూర్తి.


౩

గతసంచికలకంటె అక్టోబరుసంచిక మతింత బాగున్నది. శెట్టిపల్లి వెంకటరత్నంచౌదరి, శ్రీగిరిరాజు రామారావుగార్లచే వ్రాయబడిన 'రైతుపాట' ఎంతయు సర్వజనాకర్షణీయముగా నున్నది. రైతు కుఱ్ఱవాళ్ళను ఉత్సాహగించుచున్నది. ...కరాత్రి చంద్రశేఖరముగారి 'భిక్షుకబాలుడు'లో ఎంతయినా ఆదర్శముంది. ఆబాలుని అమాయకత్వములోని బ్రహ్మస్వరూపము, ఆగృహిణి వాత్సల్యముచూస్తే ముచ్చటగా ఉంది. ప్రపంచాన్ని అంతా చీకాకుపరచే హెచ్చుతగ్గుల కులవైషమ్యము ఆ బాలుని అమాయకత్వములో ఏమీలేదు. ఆబాలుని మధ్య గృహిణిమధ్యవున్న ప్రేమను పెంపొందించటానికే నేటి మహానుభావులు పాటుపడుతున్నారు. నేడు బీదలపై భాగ్యవంతులు జూపెడు కాఠిన్యమును చక్కగా చిత్రించినారు కథకులు.

—వ. రాజగోపాలరావు, బి.ఏ.

౪

తునిలో జరిగిన గోదావరిమండల మహిళామహాసభకు పోయియుంటిని. ఆహ్వాన సంఘాధ్యక్షురాలు తన స్వాగతోపన్యాసమున "ఆంధ్రనారీమణులకై పాటుపడుచున్న 'గృహలక్ష్మి' సంపాదకులకును, మహిళామండలినిగూర్చి కొన్ని పుటలను ప్రత్యేకించుచున్న 'భారతి', 'ఆంధ్రభూమి' పత్రికాసంపాదకులకును, ఈ జిల్లాలలో సేవచేయుచున్న 'హిందూసుందరి' సంపాదకురాండ్రకును మనకృతజ్ఞతాపూర్వకవందనము లర్పించుచు పైపత్రికలను విశేషప్రచారములోనికి తెచ్చుట మనకర్తవ్యమని విన్నవించుచున్నాను" అని చెప్పువఱకును నేను మీ ఆంధ్రభూమినిగూర్చి వినియుండలేదు. విశాఖపట్టణము చేరుటతోడనే వాకబుపై ఇచటి మీ ఏజెంటుదగ్గరనుండి అక్టోబరు 'ఆంధ్రభూమిని' కొని చదివితిని. స్త్రీసమస్యల విషయమై మీరు కొన్ని పుటలు ప్రత్యేకించుచున్నందులకు కృతజ్ఞురాలను. ఈ సంచికలోని 'సుశీల' అను కథావ్యాసము నన్ను ఎక్కువగ ఆకర్షించినది. 'నేను చాల చిన్నదానను,—తల్లి



**మలబద్ధకము హరించి విరేచనమగును**

పత్రికాపాఠకులకు: మా శ్రీదత్తాత్రేయ అజీర్ణమాత్రల ఫార్మశీ హెడ్డాఫీసును మంగళగిరి నుండి మదరాసునకు మార్చినాము. కాబట్టి తమరు యిదివరకువలెనే సీసా కావలసిన నాలుగు అణాల స్టాంపులను మదరాసు పోస్టుబాక్సు నెంబరు 462 వేపరీ అని పంపగోరుచున్నాము.

వెల స్వల్పము. గుణమధికము. ప్రతివారును యొక సీసాను కొనియుంచుకొనిన అవుసరము వచ్చినప్పుడేగాక, ప్రతిదినము యుపయోగించిన అజీర్ణమును పోగొట్టి ఆకలిని పుట్టించును. పథ్యం లేదు. ముఖ్యముగా అజీర్ణమువలననే సర్వవ్యాధులు కలుగుచున్నవి. అట్టి అజీర్ణమును మా దత్తాత్రేయ అజీర్ణమాత్రలు నాశనమును చేయును. వాడి గుణమును గుర్తెరుంగుడు. వెల రు 0-4-0.

శ్రీదత్తాత్రేయ అజీర్ణమాత్రల ఫార్మశీ, పోస్టుబాక్సు నెం. 462. వేపేరి, మద్రాసు.

## శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను బోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిబొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కోరింతదగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు క్రూరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సం॥ ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా. అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కు-పిల్సు), హిమసారతైలము (బేదింగ్ అండ్ హైరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

వలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్‌స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు.

భారతభైషజ్యనిలయము, వేపేరి, మదరాసు, అనిప్రాయవలెను.

## స్వర్ణమాలిని

ఇయ్యది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను బోగొట్టి మిక్కిలి సుగుణమిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారముర్రోజులమందు. రు 4-0-0.

### బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును. ఉన్మాదఅపస్మారములను పోగొట్టును.

6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసి.

320, తంబుశెట్టి వీథి, మదరాసు.

## గంధర్వకల్ప

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకుబిగి కలిగించు తయ్యారి లేహ్యము. అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పు పొందినది.

పౌను రు. 3—0—0.

గంధర్వ ఫార్మసీ, రాజమండ్రి.

యగుశ్చెట్లో నాకు తెలియదు. కూతురువలె మీవద్ద నుండెదను' అని సుశీల సవతిబిడ్డలతోనను వాక్యములు చదువుచుండగా నా కన్నులనుండి అప్రయత్నముగా కన్నీటి చుక్కలుపడినవి. పత్రిక శ్రీకాకుళము చిరునామాకు వి. పీ. చేయుడు.

—చి. వెంకటరమణమ్మ.

౫

......కొడవటిగంటి కుటుంబరావుగారి కథలు తెనుగులో అపూర్వములైనవిగా ఉంటున్నవి. అక్టోబరు సంచికలోని 'పెళ్ళినాడిచ్చినకట్నం' వెనుక వారు వ్రాసిన 'పతిభక్తి' అంత బాగోకపోయినా నాయకుడు మనసులో పొందిన అనవసరవేదనను చక్కగా ప్రస్ఫుటము చేస్తున్నది. నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని ఒక మైలులో ఉన్న స్టేషనుకుపోయి అచ్చట ఒకగంట నడుంవాల్చి బేడాటిక్కట్టుతో మామగారి ఊరికి రెండు కోసులదూరంలో దిగడమే-ఎక్కవలసిన గుమ్మములోఎక్కి దిగవలసిన గుమ్మంలోదిగువీలుగల రెండెడ్లబండి ప్రయాణముకంటె - ఉనులైన ప్రయాణమనుకొనే ఈ అల్లుడు మనసులో వృధాగా తికమకపడ్డం సహజంగానేఉంది. పాత్రగుణపోషణలో కుటుంబరావుగారు నిశితప్రతిభను చూపుతున్నారు...

—జోస్యుల వెంకటనారాయణ.

౬

లక్నోలో ఉన్న నాకు మీ 'ఆంధ్రభూమి' స్వదేశాన్ని సన్నిధిచేస్తూన్నట్టుగా ఉంది. అక్టోబరు సంచికలో 'నోబల్ వాఙ్మయ బహుమానములు' అను వ్యాసము చదివి చాలా ఆనందించాను. నోబెల్ గారి పట్టణమగు స్టాక్‌హోములో ఇపుడు వారి జన్మదిన శతాబ్ది ఉత్సవము బ్రహ్మాండముగా జరుపబడుతున్నది. అదీగాక ఈఏటి నోబెల్ బహుమానముల ఫలితములు ప్రచురింపబడే రోజులివి. ఇట్టి సమయంలో మీరు నోబెల్ గారినిగూర్చిన వ్యాసం ప్రచురించడం ఎంతో సమయోచితంగా ఉందని మనవి.

—జి. రామశాస్త్రి, బి. ఏ.


## ది యునైటెడ్ ఇండియా లైఫ్ అస్యూరెన్సు కంపెని

హెడ్ ఆఫీసు : మదరాసు. (లిమిటెడ్) 1906 లో స్థాపింపబడినది.

ట్రస్టీ : మద్రాసుయొక్క అఫీషియల్ ట్రస్టీ.

| | | |
|---|---|---|
| అమలునందున్న పాలసీలు | రెండుకోట్ల రూపాయలను | మించినవి. |
| మొత్తపుఆస్తులు | ఏబదియైదులక్షల రూపాయలను | మించినవి. |
| సంవత్సరాదాయము | పంద్రెండులక్షల రూపాయలను | మించినది. |

పెట్టుబడులలో పూర్తియైన, నికరమైన రక్షణ; క్లెయిముల సత్వరమును, న్యాయసమ్మతమునగు పరిష్కారము; కార్యనిర్వహణమున పోడిమి; మంచిబోనస్సుతో కూడియుండు తగుమైన ప్రీమియములు; పోలసీహోల్డరులకు ఫలకరమును, సహాయకరమును, సత్వరమును అగు సేవ,

ఈ కంపెనీకి ఘనత కలుగజేయుచున్న ప్రత్యేక లక్షణములు.

మనదేశమునందు వివిధతావులయందు గల ఈకంపెనీ ప్రతినిధులకుగాని, హెడ్ఆఫీసునకుగాని వ్రాయుచో పూర్తివివరములు వెంటనే పంపబడును.

"యునైటెడ్ ఇండియాలైఫ్ అస్యూరెన్సు బిల్డింగులు."
సెంబుదాస్ వీథి, మద్రాసు.

యం. కె. శ్రీనివాసన్.
మేనేజింగు డైరెక్టరు.

# సంక్రాంతి

పైమాసపు 'ఆంధ్రభూమి' సంక్రాంతి సంచికగ వెలువడును. సంక్రాంతి దృశ్యముల బొమ్మలు మొదలగునవి విస్తరించియుండును. శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారి 'తల్లిచాటు పిల్లవాడు'; శ్రీ పురాణం కుమార రాఘవశాస్త్రిగారి 'గళ్ళ చీర' అను రెండు మనోహర కథావ్యాసములు సచిత్రముగ ప్రచురింపబడును. కూటికి లేని పేదవాడైయుండియు తేయాకువర్తకముచేసి కోటీశ్వరుడైన 'థోమసులిప్టన్' విచిత్రచరిత్ర ఆసంచికయందలి ప్రధాన వ్యాసములలో నొకటి.

---

## మేనేజరు విన్నపము.

పరమేశ్వరుని కృపవలన ఆంధ్రభూమికి ఆరుమాసములు గడచినవి. మేము అనుకొనినదానికంటె హెచ్చు ఆదరణనే ఆంధ్రమహాజనులు ఆంధ్రభూమి యెడ చూపియుండిరని చెప్పగలుగుటకు ఆనందమగుచున్నది. నెలకు దాదాపు ఐదువందల కాపీలవఱకు విడిసంచికలు అమ్మి యేజెంట్లు ఆంధ్రభూమికి తోడుపడుచున్నారు. ఏమాసపు సంచిక ఆమాసము 25-వ తేదీని వెలువడి అమ్మకమునకు ఏజెంట్లకడకు పోవుసరికి దాదాపు ఆమాసము గతించి క్రొత్తమాసము ప్రారంభమగుచుండుటచే పత్రికను కొనువారు ఆసంచిక గతమాసపుది అని భ్రాంతిపడుచున్నారనియు, జరుగుచున్నమాసపు సంచికగా ప్రకటింపబడుచో ఇంకను హెచ్చు అమ్మకమునకు వీలుకలదనియు ఏజెంట్లు తెలుపుటచేత ఈసంచిక ప్రచురణమాసమును ముందున కెట్టితిమి. సంచికల సంఖ్యామాత్రము యథాప్రకారముగనే యుండునని గ్రహింపవలసినదిగ మా చందాదారులను ప్రార్థించుచున్నాము.

---


# రత్నపురుష

శుక్లనష్టమును
నూటిగ
కుదుర్చు
తియ్యని మందు.

## మేహరోగులపాలిటివరప్రసాదము.

పలుచబడిన వీర్యమును గట్టిపఱచి అమితముగా వీర్యవృద్ధి కలిగించు మూలికలకు రాజు అనదగిన 'రత్నపురుష' ప్రధానద్రవ్యముగా చేయబడిన ఈ లేహ్యమును క్రమముగా సేవించువారు కాయపుష్టి, కండపుష్టి నొంది బలారోగ్యములను పొందుదురు. డబ్బీ రూ. 3-0-0.

చరకనిలయము, ఆయుర్వేదౌషధశాల, రాజమండ్రి.


---

## గతమాసపు పోటీపరీక్ష సమాధానము

"ఆంధ్రభూమికి తోడ్పడి చందాదార్లుగచేరి ఆంధ్రోద్యమమును వృద్ధిపరచెదరని మనవి."

## బహుమానము పొందినవారు

పలువురు సరియైన సమాధానమునే పంపిరి. లాటరీలో ఈక్రిందివారు బహుమానములను బడసిరి:

1. వెణుతురుపల్లి లక్ష్మీనరసింహ్వాంగారు
లలితాకోలనీ, వాల్తేరు ఆర్. యస్.

2. అంగా సత్యనారాయణవర్మ
నగలవర్తకులు, నెం. 141 మొగల్ స్ట్రీటు, రంగూన్

# పోటీబహుమానము

## 'లు' పజిల్

ఈ క్రింది కూపనులో "లు" అను అక్షరము ప్రతిపదమునకును మధ్యనుండును. తక్కిన రెండక్షరములును పూర్తిచేయుటకు ఆధారము సూచింపబడినది. ఉదాహరణము: 7. ఎలుక. ఇట్లే తక్కిన పదములను పూర్తిచేసి, డిసెంబరు, 20-వ తేదీలోపున రెండుఅణాల పోస్టుబిళ్ళలతో ఆంధ్రభూమికి పంపవలెను. సరియైన సమాధానములు సంపాదకునివద్ద ఒక సీలుకవరులో ఉంచబడినవి. పైమాసపు సంచికలో అవి ప్రచురింపబడును. వాటితో సరిపోవునట్లు తప్పులులేకుండ పంపినవారికి ఐదురూపాయిల నగదు బహుమానము ఈయబడును. ఆంధ్రభూమి చందాదారులకు ప్రవేశరుసుము లేదు. వారు పంపు సమాధానములతోబాటు తాము చందాదారులైయున్న సంగతి స్పష్టముగా వ్రాయవలెను.

షరా:—సమాధానములు యీ అచ్చుకూపన్లమీదనే వ్రాయవలెను. దిద్దుబాట్లు, కొట్టివేతలు పనికిరావు. ఒక్కొక్కరు ఎన్ని కూపనులయినను పంపవచ్చును. అయితే అదనపు కూపనులు వ్రాతవి పంపవచ్చును. ఒక్కొక్కదానికి రెండేసిఅణాల బిళ్ళలు పంపవలెను.

### కూపను

1. — లు — దేవుడు
2. — లు — గ్రుడ్డివానికి తెలియదు
3. — లు — ఇంటి భాగము
4. — లు — పక్షికి పర్యాయపదము
5 — లు — ధరించునది
6. — లు — శరీరమును శుభ్రపరచును
7. — లు — జంతువు
8. — లు — మిక్కిలి చిన్నది
9. — లు — పాటకు అవసరము
10. — లు — సువాసనగలది
11. — లు — నివాసము
12 — లు — రంగు
13. — లు — కొందరికి రాదు
14. — లు — కొన్ని పండ్లు ఉండువిధము
15. — లు — రోగులకు సహజము
16. — లు — జూదరి

సంపాదకుని నిర్ణయము అంగీకరింతును.

పేరు.......................................

చిరునామా.......................................

OFFICE OF THE REGISTRAR OF BOOKS
15 DEC 1934
MADRAS

# విషయసూచిక

౧. తెనుఁగుగేస్తురాలా ! ... ౧౧౫
—శ్రీమతి నిత్యకల్యాణమ్మ
—శ్రీ సీతారామమూర్తి
౨. దేశభక్త సన్‌యాట్‌సేన్ ... ౧౧౬
—శరణు రామస్వామి చౌదరి
౩. రురుడు ... ౧౧౮
—స్థానాపతి సత్యనారాయణ శాస్త్రి
౪. ఆమె యేడుపు ... ౧౧౯
—వఝ్ఝుల వేంకటేశ్వరకవి బి. ఏ.
౫. విధి నిర్వహణం ... ౧౨౦
—మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ బి.ఏ.
౬. జానకి ... ౧౨౫
—అధికార్ల సూర్యనారాయణరావు బి.ఎల్.
౭. జోన్ ఆఫ్ ఆర్క్ ... ౧౨౬
—పురాణం కుమారరాఘవశాస్త్రి బి. ఏ.
౮. మేకపాలు ... ౧౨౮
—ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.
౯. ప్రవాసి ... ౧౩౨
—ఊటుకూరు సత్యనారాయణరావు బహద్దరు
౧౦. టిరనీ ... ౧౩౩
—కొడవటిగంటి కుటుంబరావు
౧౧. కార్తికస్నాత ... ౧౩౮
—కొండపల్లి గోపాలరావు,
—హరి రామలింగశాస్త్రి
౧౨. అధ్యక్షుడు పటేలు ... [illegible]
౧౩. హస్తసాముద్రికము ... ౧౪౦
౧౪. కోర్టులో కాంతం ... ౧౪౨
—మునిమాణిక్యం నరసింహారావు బి. ఏ.
౧౫. నోబెల్ వాఙ్మయ బహుమానములు ౧౪౭
—మరుపూరు కోదండరామరెడ్డి.
౧౬. గ్రంథాలయోద్యమము ... ౧౫౩
౧౭. నేటి అమెరికను స్త్రీలు ... ౧౫౫
—గద్దె లింగయ్యా చౌదరి
౧౮. విడ్డూరములు ... ౧౫౮
౧౯. ఆరోగ్యవిజ్ఞానము ... ౧౬౦
౨౦. 'ఆంధ్రభూమి' పుస్తకపీఠము ... ౧౬౨
౨౧. క్రొత్త పత్రికలు ... ౧౬౫
౨౨. రాజపాళెయమండలి ఆంధ్రక్షత్రియులు. ౧౬౬
౨౩. ఆర్థికవిధానము : ఇన్సూరెన్సు ... ౧౬౮
—ఆలూరు రామచంద్రయ్య బి. ఏ.
౨౪. మణిమాల ... ౧౭౧
౨౫. సంపాదకీయసమాలోచన ... ౧౭౪
౨౬. ఆంధ్రుని డైరి ... ౧౭౮

ఈ సంచికయందు ప్రచురింపబడిన 'కొమాళ్ళకన్న తల్లి ! ఊపవె ఉయ్యాల.' అను చిత్రము శ్రీ శ్రీపాద దుర్గారావుగారు రచియించినది; 'నాగస్వరసాధన' అను చిత్రము శ్రీ పి.వి. రామారావుగారు చిత్రించినది.



పి. కోదండరాం పిళ్లే
(లేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లెవారి కుమారులు)
1854-వ సంవత్సరమున స్థాపితము.
ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు
(పి యస్. పొన్నుసామిపిళ్లె భవనములు)
మీ భవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయముగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.
కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాతో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.
39-44, ఎస్ప్లనేడ్ వెస్టు; బెత్తాలంగడి వీధి, మద్రాసు.

*

*　　*

సిద్ధార్థుని విరక్తచిత్తతను బాపుటకై ఆతనితండ్రి శుద్ధోదనుడు చేసిన ప్రయత్నములకు లెక్కలేదు. వైరాగ్యవిముఖతకు వనితా బంధమును మించిన సాధనము మఱియొకటి కానరాదని ఆరాజ చంద్రుడు నిశ్చయించి ఒకనాటిరాత్రి సిద్ధార్థుడు నాట్యాంగనలచే పరివేష్టితుడగునటుల గావించెను.

సీ. ఆసిద్ధార్థుఁడు తండ్రియానతిని శాంతాకార మేపార పే
లా సింహాసనమందు సౌరలర నధ్యాసీనుఁడై యాడు క
న్యాసంఘంబులవంకఁ గన్గొనక యే.........

— తిరుపతివేంకటకవులు.

యుండెను. రాజాజ్ఞనుబట్టి ఆనాట్యాంగనలు పాడిరి, ఆడిరి. కాని రాకుమారుని చిత్రము వజ్రపంజరనిభమై యుండెను. రాత్రి అతిక్రమింపగా నిద్రాదేవత వారిని వశముగొనెను. ఆస్థితియందు సిద్ధార్థుడు కనులువిప్పి చూచునుగదా ఎక్కడివారక్కడ చెదరిన కురులతో, చెదరిన మడుగులతో, తొలగిన సౌందర్యముతో. తెఱచిననోళ్లతో అడ్డదిడ్డముగ పరుండియుండిరి. జాగ్రదవస్థయందుండి ఆనాట్యాంగనలు హావభావవిలాసములకు వశముగాకుండిన సిద్ధార్థుడు ఈవికృతరూపములయందు వారిని గాంచి మఱింత విరక్తచిత్తుడయ్యెను. తనకుమారుని చిత్తమును ప్రపంచప్రవృత్తమునకు ఆయత్తము చేయదలచిన శుద్ధోదనుని ప్రయత్నము కుంపటియందు తామర మొలపించు యత్నము వంటిదయ్యెను.

*　　*

*

# తెనుఁగుగేస్తురాలా!

✠

ప్రాణవిభుదృక్ప్రవృత్తిలో హాసనమొందు
సమ్మదపునీతభావసంచయము తెల్లఁ
బ్రీతిమై గ్రహియించి వర్తించు శక్తి
తెనుఁగుగేస్తురాలా! వరించినది నిన్ను.

ప్రబలభవసంభవార్తినిర్ఘాతచలిత
పురుషహృద్వల్లిఁ బ్రేమసంఫుల్లకుతిని
ప్రాపు నొసఁగుచు జీవితప్రథితమోద
మాంధ్రగృహలక్ష్మి! సృష్టింతువమ్మ! నీవు.

కప్పురము తావిఁబోలె, రాగార్ద్రహాస
మంగళశ్రీని జీరుకాఱంగఁ జేసి
దయితు చొక్కంపుజీవితధామ మందు
నవ్యకళలీని సొగయుచున్నావు సాధ్వి!

ప్రణయతత్త్వరహస్యసూత్రప్రబోధ
మధువు బురలించు గేహినీమణులఁగాంచి
ఎలమిఁ బ్రేమైకమండలమేనటంచు
తెనుఁగుసీమ గర్వించి వర్ధిల్లఁగలదు!

—శ్రీమతి నిత్యకల్యాణమ్మ,
—శ్రీ సీతారామమూర్తి.

✠



# దేశభక్త సన్ యట్ సేన్

## (చీనా స్వాతంత్ర్యోద్యమనాయకుని చరిత్ర)

చీనాదేశము 19-వ శతాబ్దియందు మంచూరియా రాజకుటుంబముచే పాలింపబడుచుండెను. ప్రజలకు స్వాతంత్ర్యములేదు. విద్యావ్యాప్తి సున్న.. నాగరికత నెఱుగరు. మూఢాచారములకు దాసులై పశుతుల్యులుగ ప్రవర్తించుచుండిరి. రాజేమిచెప్పిననదియే వారికి శాసనము. రాజులో ప్రజాక్షేమమునకు పాటుబడరు. భోగలాలసులై దేశక్షేమమునే మఱచిరి, ఆతరుణమున దేశభావిభాగ్యవిధాత, త్యాగమూర్తి, నిష్కళంక దేశాభిమానియగు సన్ యట్ సేన్ 1866-వ సంవత్సరమున, కాంటన్ నగరసమీపమున కుగ్రామమున నొక కృషీవలుని కుటీరమునందు జన్మించెను. తల్లిదండ్రులు కడుగారాబమున తనుముద్దులపట్టిని పెంచి, పెద్దవానినిజేసి విద్యాభ్యాసమునకై విద్యాలయమున కంపిరి. సామాన్యబీదకుటుంబమున జన్మించిన ఈబాలుడు తన మాతృదేశదుస్థితిని గాంచి, పిరికిపందవలె పరితాపపడక, వీరునివలె దేశదాస్యశృంఖలముల ద్రెంప నడుముకట్టి చరితార్థుడాయెను. రాజులు దేశమును నిరంకుశముగ పాలించుచుండిరి. ప్రజలు వివేకహీనులై తమహక్కులను గమనింపక సర్వవిధముల పతితులై బానిసలుగ మెలంగుచుండిరి. అంధకారమున మునిగియున్నవీరిని మేల్కొల్పి, తమధర్మముల నెఱుంగజేసి, పారతంత్ర్యమును పారద్రోలి, చీనాదేశమును స్వతంత్రముగజేసిన సన్ యట్ సేన్ సామాన్య ప్రజ్ఞాధురీణుడా? ఆతేజోమూర్తి చీనాయందు బయలుదేరదీసిన స్వాతంత్ర్యోద్యమము అజ్ఞాననిద్రాముద్రితమైన ఆసియాఖండమును మేల్కొల్పినది. సన్ యట్ సేన్ మహాశయుని పవిత్రనామమును ఆసియావాసులెల్లరు జపించుచున్నారు.

ఈయన బాల్యమునుండియు చుఱుకుతనముగలవాడు. బాలక్రీడలలోసహితము తనసహచరులలో మిన్న. విద్యాభ్యాసమున తనతరగతిలో ప్రథముడు. ఎన్నడును ఏవిషయమునను వెనుకంజ నెఱుగడు. తన 21-వ సంవత్సరమున వైద్యపరీక్షయందు తీర్ణుడై డిగ్రీని పొందెను. కాంటన్ నగరమున వైద్యవృత్తి నవలంబించి, సమర్థుడనిపించుకొని ప్రసిద్ధిజెందిన డాక్టరాయెను. తన వృత్తిలోను, ధనసంపాదనలోనుమాత్రము తృప్తినొందక దేశహితైకకార్యములందు పాల్గొనుచుండెను. చీనాయువజనసంఘమును స్థాపించి దేశమంతయు విసుగువిరామములేక సంచారముచేసి, దేశాభిమానపూరితములగు నుపన్యాసముల నొసగి వేలకొలది యువకులను దేశసేవానిరతులుగ జేసెను. వీరు దేశమున స్వాతంత్ర్యకాంక్ష ప్రబలజేసిరి స్వాతంత్ర్యోద్యమము దినదినాభివృద్ధిగాంచుచుండెను. ఇంతలో 1894-95 సంవత్సరములలో చీనా-జపాను దేశములకు యుద్ధము పొసగెను ఈసమయమున మనకథానాయకుడు వైస్రాయియగు లీహాంగుచంగుతో ప్రజలకు స్వాతంత్ర్యమొసగ వాగ్దానముచేసిన తనయువజనసంఘము యుద్ధమున పాల్గొనునని చెప్పెను. కాని యీయనకోరికను వైస్రాయి తిరస్కరించెను. దీనికి ప్రజలు ఖిన్నులైరి. కర్తవ్యమేమని తమనాయకుని ప్రశ్నించిరి. అపుడా

యోధుడు "మనము కృతనిశ్చయులమైనచో స్వాతంత్ర్యము పొందుట కష్టముగాదు. మనస్వాతంత్ర్యము మనచేతిలోనున్నది. స్వాతంత్ర్యముఁబొంద నిచ్ఛగల వారు మానప్రాణములు పోయినను సంగ్రామమునుండి వెనుకంజవేయమని శపథముచేయుడని తనసహచరుల హెచ్చరించెను. వెంటనే వేలకొలదివీరులు స్వాతంత్ర్య దేవిపదకమలములకడ తమప్రాణము లర్పింప దీక్షగైకొనిరి. తనదేశజుల ఆత్మశక్తి, దృఢవిశ్వాసము, అకుంఠిత దేశభక్తి గాంచి సన్ యట్ సేన్ సంతసించెను. అప్పటినుండియు అధికోత్సాహముతో ఆమహానుభావుడు తనయుద్యమవ్యాప్తికొఱకు దేశమునంగల పట్టణములు, పల్లెలు విరామములేక సంచారముచేసెను. పలుమారులు ఆహారపానీయములుకూడ లభింపలేదు. దేశవిముక్తికై అష్టకష్టములుపడెను. నిర్మలప్రేమతో నిరీక్షించు ప్రియపత్నివదనారవిందము గాంచ నుత్సహించడు. తనరాకకు చిందులుద్రొక్కు పసిపాపల నొకపరి ముద్దాడ నభిలషింపడు. అత్యాగమూర్తి దేశాభిమాన మగణ్యముగదా! ఆధీరుని నిరంతరకృషివలన దేశమున వేలకొలది స్వాతంత్ర్యయోధులు సమకూడిరి. వారికి సైనికశిక్ష నొసగి మాతృదేశపుపిలుపురాగనే రణరంగమున కుఱుక సిద్ధముచేసెను. మారుమూలలలో నున్న కుగ్రామములలో సైతము స్వాతంత్ర్యకాంక్ష ప్రబలెను. ఫిరంగులను, తుపాకులను, ఆహారసామగ్రిని సిద్ధముచేసెను. దక్షిణచీనాదేశమును ముట్టడించుటకు కృతనిశ్చయులైరి. అన్నిప్రాంతములలో సైన్యాధ్యక్షుల నేర్పఱచి రాత్రియనక, పగలనక మనకథానాయకుడు సంచారము చేయుచుండెను. కాంటన్ నగరము స్వాధీనముగానున్నది. ఇట్టి యమూల్యసమయమున నొక దేశద్రోహి రాజునకు లోబడి వీరిభావికార్యక్రమమును తెలియజేసెను. వీరియాశయములు భగ్నములాయెను. ప్రభుత్వమువారు పలువురబంధించిరి. కొందఱిని కొరడాలతో గొట్టిరి. మరికొందఱిని పలురీతుల బాధించిరి. ప్రధాననాయకులను ఉరిదీసిరి. కాని చీనాదేశభాగ్యవశమున మనకథానాయకుడు తప్పించుకొనెను. అయనను పట్టుకొనుటకుగాను అనేకగూఢచారులు వెంబడించిరి. గ్రామములలోను, కుటీరములలోను, నావలలోను, కొండలలోను, కాననములలోను తలదాచుకొనుచు నాతడు వీరికి దొరకలేదు. ఆయోధుడెట్టకేలకు తప్పించుకొని పరదేశములకేగెను. ప్రభుత్వమువారు భగీరథప్రయత్నములుచేసియు పట్టుకొనలేక పోయిరి.

ఈ యోధుడింతటితో తన మనోనిశ్చయమునకు తిలాంజలి నొసగలేదు. విదేశములలోనున్న చీనావారి యందు దేశాభిమానమును రగుల్కొల్పెను. వారినందఱికి స్వదేశమువైపు దృష్టిమరలజేసెను. వారందఱు నొకచో సమావేశమై తమదేశబంధవిముక్తికై పాటుపడ సంకల్పించుకొనిరి. దానికివలయు సర్వసన్నాహములు చేయుచుండిరి. చీనాయందును స్వాతంత్ర్యోద్యమము నానాటి కానాడు పెంపొందుచుండెను. బాలురు, బాలికలు, స్త్రీలు, పురుషులు, వీరువారననేల దేశమునంగల ప్రజలందరు ఉద్యమమునజేరిరి. దేశమునవ్యాపించుచున్న స్వాతంత్ర్యోద్యమమును చూచి మంచూరియా రాజులు గజగజలాడుచుండిరి. జీవచ్ఛవములవలెనున్న ప్రజలు జీవముగలవారైరి. దేశమునందెచ్చట గాంచినను స్వాతంత్ర్యసంరంభమే. ఉద్యమనాయకుడగు సన్ యట్ సేనుని పట్టించువారికి లక్షలకొలది ధనమొసగుదుమని ప్రభుత్వమువారు ప్రకటించిరి. గూఢచారులు, ధనలోభులగుప్రజలు పట్టుకొనుటకు ప్రయత్నించి విఫలులైరి. వందలకొలది గూఢచారులు వెంబడించుచున్నను బిచ్చగానివలె, కూలివానివలె, కూరలమ్ము వానివలె, పిచ్చివానివలె మారువేసములు ధరించి వారి కనులలో దుమ్ముగొట్టి అతిరహస్యముగ సన్ యట్ సేన్ ప్రచారముచేయుచుండెను. శ్మశానములలోను, పాడుబడిన కోటలలోను అర్ధరాత్రివేళ సభలుచేయుచుండెను. ఈధీశాలి నిరంతరకృషి వర్ణనాతీతము.

సన్ యట్ సేన్ 1896-వ సంవత్సరమున అమెరికా దేశమునుండి లండనుపట్టణమునకువచ్చెను. అచటిచీనా గూఢచారి మనదేశభక్తునితో కపటస్నేహముచేసి మంచి మాటలతో తనదేశపురాయబారివద్దకు తీసికొనిపోయెను. ఆయన వెంటనే మనకథానాయకుని నొక చీకటి

కొట్టునందు బంధించెను ఈ నిర్బంధవార్త నతిరహస్యముగనుంచిరి. ఈయనను గూఢముగ చీనాదేశము పంప ప్రయత్నించుచుండిరి. ఇదిగమనించి సన్ యట్ సేన్ నగరముననున్న తన యాంగ్లోపాధ్యాయునికి నొకలేఖ వ్రాసి తనస్థితిని దెల్పెను. ఈలేఖను అధికారులు చూచి ఆయనను మరింత బాధింపగడంగిరి. కాని ధీరుడగు మన దేశభక్తుడు చలించలేదు. తనదగ్గఱనున్న ధనముతో కావలివారిని లోబరచుకొని మఱియొక లేఖ తనగురువునకందజేసెను. ప్రాజ్ఞుఁడగు ఆగురూత్తముడు ఆంగ్లేయుడైనను, తనశిష్యునిమీదనున్న వాత్సల్యముతో రాయబారి యక్రమవర్తనమును పత్రికలలో ప్రకటన జేసియు, ప్రభుత్వమువారి కెఱింగించియు, రాయబారిని మందలింపజేసియు దేశభక్తాగ్రమణిని బంధవిముక్తునిగ జేసి చీనాదేశవాసుల ప్రశంసలకు పాత్రుడాయెను.

సన్ యట్ సేన్ విదేశములలోనున్నను సూర్యాస్తమయమైనపిదప తనజన్మభూమికి జేరుచు ప్రధానానుచరులకు సలహాలొసంగుచు తెల్లవారునప్పటికి విదేశముల కేగుచుండెను. స్వాతంత్ర్యోద్యమము దినదినాభివృద్ధిగాంచుచుండెను. తటస్థులుగనున్నవారుసైతము స్వాతంత్ర్యోద్యమమున జేరుచుండిరి. దేశమునంగల ఆబాలగోపాలము ఏకాభిప్రాయులై దేశస్వాతంత్ర్యోద్యమమున నడుములుకట్టి తదేకదీక్షతో పోరాడిరి. రణరంగమున పలువురు వీరస్వర్గమున కరిగిరి. ఎందఱో కన్నెరుగని లలనామణులు సహితము సంగ్రామరంగమున కుఱికి కాళికాదేవిమూర్తులై శత్రుసైన్యనివహముల చీల్చి చెండాడిరి.

కడరానిపాట్లుపడినపిదప తుదకు 1911-వ సంవత్సరమున జయముగలిగెను. రాజులు ప్రజాధీనులైరి. స్వాతంత్ర్యజయధ్వనులు మిన్నుముట్టెను. ప్రజలలో చెప్పనలవికాని యుత్తేజము, ఉత్సాహము పొంగి స్వాతంత్ర్యదేవికి హారతులొసంగిరి. ఈశుభవార్త లండనులోనున్న సన్ యట్ సేన్ విని ఆనందసాగరమున నోలలాడెను. ప్రజానాయకులు లండనులోనున్న తమ నాయకమణిని తీసికొనివచ్చిరి. ఈత్యాగమూర్తి దేశమున కాలిడినతోడనే ప్రజ లాయనమీద పుష్పవృష్టి కురిపించిరి. కర్పూరహారతులొసగిరి భక్తితో ప్రణమిల్లిరి. 1912-వ సంవత్సరము జనవరి 1-వ తేదీన ఈ నిర్మలదేశభక్తుని స్వతంత్రచీనాదేశ ప్రథమాధ్యక్షునిగ నేకగ్రీవముగ నెన్నుకొని సింహాసనమెక్కించిరి. దేశమునందంతట నతివైభవముగ స్వాతంత్ర్యోత్సవము జరిపిరి.

సన్ యట్ సేనువంటి స్థిరసంకల్పుల, కార్యదీక్షాపరుల, నిరంతరకృషివలననే దేశములకు కల్యాణము గలుగును. వారిత్యాగమే ప్రపంచమునకు మార్గదర్శి. 1917-వ సంవత్సరమున జ్వరపీడితుడై యీదేశసేవాదురంధరుడు స్వర్గమునకరిగెను. ఆమహాపురుషుని పవిత్రనామము ప్రపంచచారిత్రమున సువర్ణాక్షరములతో లిఖింపబడినది.

—శరణు రామస్వామి చౌదరి.

# రురుడు

నామనోహర్మ్యతలమున నాట్యమాడు
ప్రణయినీగాఢపరిరంభరతుడనయ్యు
క్రూరశతకోటినినదసంక్షుభితభయద
ప్రళయజీమూతపటలమార్గాల కెగసి
చలితశంపాలతాదీప్తి కులికి యులికి
ప్రతివినీలవలాహకాతతుల నరసి
అరసి కనలేక దైవోపహతి దురంత
మీ మహాధ్వాంత సంవృతారామవాటి
నిమిష నిమిషమ్ము కనుల బాష్పములుగ్రమ్మ
ప్రకృతి సర్వమ్ము నస్పష్ట వికృతిదోప
పక్షములె రాలిపోయిన పక్షివోలె
తరులతామూలముల బడి దైన్యవృత్తి
వెదకుచున్నాడ నేలొకో వెర్రినగుచు.

—స్థానాపతి సత్యనారాయణశాస్త్రి

# ఆమె యేడుపు

నిలుపుకొనంగలేక తరుణీ! హృదయంబునఁ బొంగివచ్చు న
గ్గలపు దుఃఖమెట్టిటులొ కంఠములో దిగమ్రింగికొంచుఁ గ
న్గొలుకులనుండి యశ్రువులు గాఢముగా స్రవియింపఁ జేయుచున్
మలిన మొనర్చె దేమిటికి మాటికి స్నిగ్ధకపోలసీమలన్ ?

నా యెదపై శిరస్సునిచి నామెడచుట్టు లతామనోజ్ఞబా
హాయుగళంబు సేర్చి చెలియా! నునుఁ గెంజిగురాకువాతెఱల్
పాయని వేడియూర్పులకు వాడఁగ నీకనుదోయినుండి యే
లా యిటు లశ్రువాఃకణములన్ వెడలించెద వేకధారగా ?

ఒక్కటె ధారగా వెడలుచుండిన నీ నయనాశ్రుమాలకున్
జిక్కిన నాయురమ్ము, శయనస్థలమున్, మసృణంబులైన నీ
చెక్కులుఁ, జెల్వముం దొఱఁగి సిక్తములైనవి ; యేమికారణం
బక్కట యీ నిశాంతరరహస్యవిషణ్ణతకున్ మనోహరీ ?

నీ హృదయంబునం దెపుడొ నీ చిననాఁట స్మరించుకొన్న యే
యూహలొ నేఁటికిన్ ఫలమునొందక భగ్నము లయ్యెనో, ప్రియ
స్నేహము లెల్ల నిర్దయత నీయెడఁ బూనెనొ, దుఃఖబాష్పసం
దోహములన్ వెలార్చెదు కనుంగవనుండి యిదేమి నెచ్చెలీ ?

గాటపుఁ జీఁకటిన్ జగతి గన్నులు మూసిన యీ విభావరీ
వాటికలో రహస్యమగు వైఖరిఁ గాల్వలు గట్టు నీదుక
న్నీటికి సర్థమున్ దెలియనేరని నా హృదయాంతరంబు ని
ట్లేటికి రాయిడించెదు చెలీ! తుదిఁగానని తీవ్రవేదనన్ ?

బిగిసినవంతలో, గళము వీడని దట్టపుటేడ్పులోఁ, గనుల్
మొగుడుపుఁ జెందఁగా, నొడ లెఱుంగని స్వాప్నికవృత్తిలో, భుజా
యుగళమునన్ మదీయతను వూని కవుంగిట రాపువెట్టి నా
లుగు పెదవుల్ చెలీ! క్షణములో నొకటన్ గదియించె దేటికిన్ ?

ప్రోవులువడ్డ యశ్రువులలోఁ బ్రతిబింబితమైనయట్టి యీ
నీవలవంతలోఁ బ్రణయినీ! వలపే పులకించునో, తలం
పే విలపించునో హృదయమే పలవించునొ, భగ్నవాంఛలన్
జీవితమే కుమారిలునొ చెప్పఁగఁజాలనిరీతి నక్కటా !

—వఝ్ఝల వేంకటేశ్వరకవి.



# విధినిర్వహణం

[పాదుషా హిందువులను చాలా వేధిస్తున్నాడు. హిందువులు ఏమతసంబంధమైన పనిచేసినా ఓర్చేవాడుకాడు. పరవడిరోజుల్లోనూ, పుణ్యదినములందూ హిందువులు దేవాలయములలోకి వెళ్లడం అతనికి కంటగింపు.]

రంగము 1.

(రాచమంటపముమీద పరివేష్ఠితై పాదుషా ఆయన ఆంతరంగికమంత్రి మహమ్మద్‌ఖాన్ వజీరు ప్రవేశం.)

పాదుషా

మహమ్మద్‌ఖాన్! విశేషాలేమిటి?

మహమ్మద్‌ఖాన్

సామ్రాట్! నేడు కాఫరులకు చాలాగొప్పపుణ్య దినము.

పాదుషా

ఏం విశేషంగా చెబుతున్నావు? నాకాసంగతిది వరకే తెలుసు.

మహమ్మద్‌ఖాన్

జహాఁపనాహ్! కాఫరుల పండుగరోజులన్నీ ఏలిన వారికి కంఠస్తంగదా!

పాదుషా

అందులకు నన్ను నీవు పొగడవలసిన పనిలేదు. హిందువులు మతకార్యాలు చేస్తున్నారంటే నాశరీరం దహించుకుపోతూంటుంది. ప్రవక్తమతాన్ని గురించి వాళ్ళకింతవరకు తెలియకపోయినందుకు నాకు వాళ్ళను చూస్తే అసహ్యం.

మహమ్మద్‌ఖాన్

జహాఁపనాహ్! వారికి అభిమానగర్వాలుగూడా ఎక్కువ. వాళ్లు........

పాదుషా

ప్రస్తుతం మనకది అనవసరం. నేటికిగాను క్రొత్త పన్నాగమేమయిన పన్నావా?

మహమ్మద్‌ఖాన్

చిత్తం. దిలేరుఖానుణ్ణి తగిన సైన్యంతోబోయి మల్లికార్జునస్వామి ఆలయాన్ని చుట్టవేయమని, మనిషి పురుగును లోనికి రానీయవలదని ఆజ్ఞాపించాను.

పాదుషా

మంచిపనిచేశావు. ఎన్నిచేసినాకాని ఈపరమ మూర్ఖులు మనవశం కావడంలేదు. సామభేదోపాయాలు పూర్తిగా వర్జించి దండోపాయం అవలంబించాలి.

మహమ్మద్‌ఖాన్

చిత్తం. ఆలాగని తమ ఈ సేవకుడు ప్రభువారితో ఇదివరలోనే అనేకమార్లు మనవిచేసుకున్నాడు.

పాదుషా

అవును. అవసరంవచ్చినప్పుడు నీచేతనే ఆఉపాయం అవలంబింపచేస్తాను. ఆదెబ్బతో హిందూకీటకం నారాజ్యంలో ఉండకూడదు. అల్లా ఆరోజు ఎప్పటికి ప్రసాదిస్తాడో!

మహమ్మద్ ఖాన్

జహాపనాహ్! తమ అనుగ్రహం ఉండాలిగాని ఆరోజు అల్లా త్వరలోనే......

పాదుషా

ఈపాటికి దిలేరుఖాన్ దేవాలయ ప్రాకారాన్ని చుట్టి ఉంటాడా?

మహమ్మద్ ఖాన్

చిత్తం.

పాదుషా

కనక ఒక్క మానవుడైనా నేడా దేవాలయ ప్రవేశం చేయలేదన్నమాట! ఇకముందు వీలే లేదు.

మహమ్మద్ ఖాన్

చిత్తం.

(ప్రవేశం సేవకుడు సలాంచేస్తూ)

సేవకుడు

జహాపనాహ్! వజీరు మయిస్తఖాన్ సాహెబు తమదర్శనాన్ని కోరుతున్నారు.

పాదుషా

రమ్మను.

మయిస్తఖాన్

(ప్రవేశించి) సలాం అలేఖుం....

(వంగి సలాంచేస్తాడు.)

పాదుషా

(సలాం అందుకుని) వచ్చినపని?

మయిస్తఖాన్

ప్రభూ! నేను హిందువులకు పరవదినరోజు. మహాశివరాత్రి.

పాదుషా

అవును. తెలుసును నా కాసంగతి.

మయిస్తఖాన్

దేవా! మల్లికార్జునస్వామి ఆలయములోకి హిందువులను మనసిపాయీలు రానివ్వడంలేదని గోలపెట్టుతున్నారు హిందువులు. అట్లని...

పాదుషా

అట్లని మాఆజ్ఞ. నీవెవ్వడవు దానిని ప్రశ్నించడానికి?

మయిస్తఖాన్

తమ పాదసేవకుడను. కాని ప్రశ్నించరాలేదు. సామ్రాజ్యక్షేమము......

పాదుషా

కాఫర్! అనవసరప్రసంగం చేయక.

మయిస్తఖాన్

మహాప్రభూ! హిందువులు మీ పుత్రులవంటివారు. వారు మీకు ఎడమకన్నులు. వారిసౌభాగ్యమే మీసౌభాగ్యము

పాదుషా

ఏమిటి? నాసేనలో మహమ్మదీయసామ్రాజ్య ద్రోహులున్నారని నాకు ఇంతవరకు తెలియలేదు.

మయిస్తఖాన్

స్వామి నేను ద్రోహినికాను. మహమ్మదీయ సామ్రాజ్యంకోసం నారక్తం ధారపోస్తాను. ద్రోహమనేమాట నాచెవుల వినలేను.

పాదుషా

హిందువులపక్షం మాట్లాడడానికి నీవు కాఫరువా?

మయిస్తఖాన్

స్వామీ! కాదు. తమ ఈసేవకుడిపూర్వులు మహమ్మదీయులై చాలారోజులయింది.

మహమ్మద్ ఖాన్

జహాపనాహ్! ఈ మతావలంబికి కాఫర్ వాసన వదలలేదు.

మయిస్తఖాన్

స్వామీ, కాదు, ఆమతవిషయసంబంధమేమియు నారక్తమందులేదు. మహమ్మద్ ఖాన్ వజీరు పూర్వులు మహమ్మదీయులు కాకముందు ఎప్పుడో నాపూర్వులు ముసల్మానులయినారు. కాని ప్రస్తుతం హిందువులక్షేమం విచారిస్తేనే సామ్రాజ్యానికి క్షేమమని నా అభిప్రాయం.

పాదుషా

కాఫర్! నీవు ద్రోహివి. మహమ్మద్ ఖాన్! ఈ ద్రోహి శిరచ్ఛేదంచేయించు.

మహమ్మద్ ఖాన్

చిత్తం.

మయిస్తఖాన్

స్వామీ! ఈ సేవకుడికి ఆశిక్షఅనవసరం. తమ ఆజ్ఞానువర్తియై నడవగలవాడు. అభిప్రాయంమాత్రం మనవిచేసుకున్నాడు తమఆజ్ఞకై వేచియున్నాడు.

పాదుషా

ఆ! జ్ఞాపకంవచ్చింది. మహమ్మద్ ఖాన్! ఈ మయిస్తఖానేవెళ్లి ఆదేవాలయప్రాకారందగ్గర కాపలాకాయవలెను. ఆపనులలో తిరిగితేనేకాని కాఫరుల యందు అభిమానముపోదు.

మహమ్మద్ ఖాన్

జహాపనాహ్! మీఆజ్ఞ నిర్వర్తింపబడుతుంది. కాని నావిన్నపం ఈకులద్రోహి విధి సరిగానిర్వర్తిస్తాడాఅని?

పాదుషా

మూర్ఖుడా! నాభుజపరాక్రమముముందు నాఆజ్ఞ జవదాటినవాడిగతి ఏమవుతుందో ప్రపంచంలో అందఱికీ తెలుసు. ఆమరుక్షణం వాడి మెడమీద తలఉండదు.

మహమ్మద్ ఖాన్

చిత్తం. మీఆజ్ఞ అనుల్లంఘనీయమే. కాని కాఫరు అభిమాని......

పాదుషా

మయిస్తఖాన్! వెళ్లు. దేవాలయందగ్గర కాపలా కాయి. మానవకీటకం దేవాలయప్రవేశంచేసిందంటే నీప్రాణం నీదికాదు. మహమ్మదీయుడు దేవాలయప్రవేశం చేయడు. చేయకూడదు. హిందువులు ఆప్రక్కకే రాకూడదు. తెలిసినదా? ఈఆజ్ఞ మీరినవాడికి, కత్తివేటే ఫలితం. విధినిర్వహణములో ఏమాత్రం లోటుకలిగినా నీప్రాణాలమీద ఆశవదులుకోవలసిందే.

మయిస్తఖాన్

చిత్తం. ఈసేవకుడు యజమాని ఆజ్ఞ ఉల్లంఘించడమనేది ఎరుగడు. ఇకముందు ఆపని జీవాలలో చేయలేడు. ఎవ్వరూ లోపలికిపోగూడదని ఆజ్ఞ.

పాదుషా

అవును ఆదేశముకూడ. పో, ప్రయత్నిస్తే నీకత్తి కెరచేయావచ్చు.

మయిస్తఖాన్

చిత్తం. (సలాంచేసి వెళ్లిపోవును)

## రంగము 2.

(దేవాలయప్రాకారసమీపప్రదేశం. ప్రొద్దున 8 గంటలప్పుడు)

(ప్రవేశం మయిస్తఖాన్ గేటుకాపలా కాస్తూ. పలువురు బ్రాహ్మణులు నీరుకావిధోవతులు, తడికొల్లాయిగుడ్డలు, విభూతి పెండెకట్లతో)

ఒకటవ బ్రాహ్మణుడు

మమ్మల్ని లోపలికి పోనీయరా?

మయిస్తఖాన్

చిత్తం. పోనీయకూడదని పాదుషావారి హుకుం

రెండవ బ్రాహ్మణుడు

అవును. పాదుషాకు అంత్యకాలము సమీపించింది. చెట్టు చెడేకాలానికి కుక్కమూతి పిందెలుట.

మయిస్తఖాన్

మీరు బ్రాహ్మలు. రాజద్రోహమయిన మాటలు మీరు మాట్లాడకూడదు. నేను వినకూడదు.

మూడవ బ్రాహ్మణుడు

ఆనీచు డింతకింత అనుభవించడా'

మయిస్తఖాన్

మీరలాఅంటే నేను ఊరుకోను. మళ్లీ పాదుషాను ఏమన్నాఅంటే నాకత్తి తీయవలసి వస్తుంది. మీకు మాటలేవద్దు తప్పుకాని, ఒప్పుకాని పాదుషాఆజ్ఞ నిర్వర్తించకతప్పదు. మీరు పాదుషాను నాఎదుట తిట్టినా, ఈలోపల అడుగు పెట్టినా మీప్రాణాల మీద ఆశ వదలుకోవాలె.

నాల్గవబ్రాహ్మణుడు

మహమ్మదీయత్వం మూర్తీభవించినట్లుందే. పోదాం పదండిరా లోపలికి. ఏంచేస్తాడో?

మయిస్తఖాన్

స్వాములు. మూర్ఖించవద్దు. ఆపైన పశ్చాత్తాపపడి లాభంలేదు బ్రాహ్మలుకనుక చెబుతున్నా. ఏమాత్రం అఘాయిత్యంచేసినా లాభంలేదు.

రెండవ బ్రాహ్మణుడు

మేం వెళ్ళితే లోపలికి.

మయిస్తఖాన్

జీవాలతో వెళ్ళరు.

మూడవ బ్రాహ్మణుడు

అంతసాగరా! శరీరబలముందని.

మయిస్తఖాన్

వృథా వాక్కలహము స్వామి! ఈదారినే రావద్దు. ఆచుట్టుప్రక్కల వచ్చినవాళ్ళనే జీవాలతో ఉండనీయకూడదని పాదుషావారి హుకుం. ఇక్కడ ఇంత మందినిచూస్తే నాతో కోరుసక్కడు. మంచిగా చెబుతున్నాను. వెళ్ళండి.

మొదటి బ్రాహ్మణుడు

మంచిసాయిబురా! మరోసాయిబయితే మనం ఈ పాటికి ఎక్కడ ఉండేవాళ్ళమో మనయిళ్ళల్లోనే పూజచేసుకుందాం. భగవంతుడంటూఉంటే న్యాయం కలగక పోతుందీ. రండి. (అంతాకలసి వెళ్ళుతారు)

మయిస్తఖాన్

(స్వగతం.) మా పూర్వులు హిందూమతంలో ఎప్పుడుఉన్నారో? వీళ్ళూవాళ్ళూ ఏమాత్రం పోట్లాడుతున్నా నే నోర్చలేను. ఇదీ నాదురదృష్టమే. ఈ రోజు నానెత్తికి నేనే తెచ్చుకున్నాను, మంచికిపోయి ఈకాపలా. పాదుషాకులోడు ఈమంత్రులుకూడానూ. సగం వీళ్ళు చెడగొడుతున్నారు హిందూమహమ్మదీయ సామరస్యాన్ని. అక్బరుపాదుషా తెలివితేటలు వీళ్ళకెవళ్ళకీలేవు. పాదుషా మనస్సెరు మనమాటలు రుచిస్తవీ? (అంటూ కాపలా కాస్తున్నాడు)

## రంగము 3.

(పాదుషా ప్రాసాదం. పాదుషా హుక్కా పీలుస్తూ కూచుంటాడు.)

ప్రవేశం మహమ్మద్‌ఖాన్.

మహమ్మద్‌ఖాన్

జహాపనాహ్! సలాం ఆలేఖుం (సలాంచేస్తాడు)

పాదుషా

మంచిది. విశేషాలు?

మహమ్మద్‌ఖాన్

ఈసేవకుడు ఉదయమే మనవిచేసుకున్నాడు మయిస్తఖాన్ సరిగా ఆజ్ఞ నిర్వహిస్తాడో లేదో అని.

పాదుషా

(కోపంసూచించే నేత్రాలతో) ఏం! ఇప్పుడేం జరిగింది?

మహమ్మద్‌ఖాన్

కొంతమంది కాఫర్లను అతను లోనికి పోనిస్తున్నాడని చెప్పుకుంటున్నారు. కొంతమంది బ్రాహ్మలు అతని చుట్టూ మూగి మాట్లాడుతూండగా నాసేవకుడు కళ్ళారా చూశాడు.

పాదుషా

ద్రోహి. పరమనీచుడు. పాదుషాఆజ్ఞనే మీరడమా? అంతధైర్యము ఒకసామాన్యవజీరు మాత్రునకా? వాణ్ణి చిత్రవధ కావింపవలసిందే. అందరి నిజానిజములు తెలిపి తగినపనిచెయ్యి, వెళ్లు.

మహమ్మద్‌ఖాన్

ఏంచెయ్యమని సెలవు?

పాదుషా

ముందు నిజానిజములు తెలుసుకో. పో. వెళ్ళు ముందు నాముందరనుంచి. నీయిష్టంవచ్చినట్లు చెయ్యి తర్వాత.

మహమ్మద్‌ఖాన్

చిత్తం. (సలాంచేసి సగర్వంగావెళ్ళుతాడు).

## రంగము 4.

(రోజల్లా ప్రాకారందగ్గరకు వెళ్ళివచ్చే బ్రాహ్మణులే. బ్రాహ్మణులుకొందరు ప్రాకారం దగ్గర నుంచి తిరిగివస్తుంటారు. మధ్యాహ్నం రెండుగంటలు కావస్తుంది మహమ్మద్‌ఖాన్ మయిస్తఖాన్ మీదికి కాపలాకు వెళ్ళుతుంటాడు)

ఒక బ్రాహ్మణుడు

కాపలాసాయిబుగారు చాలమంచివాడల్లె ఉంది సుమా

మరియొక బ్రాహ్మణుడు

మెల్లిగా అంటావేం! ఎవళ్లో గాని అటువంటి వాళ్ళు ఉండడం అసహజం.

(మహమ్మద్ ఖాన్ విన్నాడు. తలఊగిస్తూ తోటదరగా ప్రాకారందగ్గరకు నడుస్తున్నాడు)

మయిస్తఖాన్

(స్వగతం) ఎందుకు చెప్మా మహమ్మద్ ఖాన్ వజీరు వస్తున్నాడు? నామీద కాపలా కాబోలు. పాదుషా ఆంతరంగికం గాఉండి, చేసేదంతా వీడే. నేను కాఫరు నన్నాడు. వీడితాతలు గాదూ మహమ్మదీయమతంలో కలిసింది? వీడి పూర్వులెరుగరు మా వాళ్ళెప్పుడు కాఫర్లయిందిన్నీ. మనం మనం సఖ్యంగాపోవడం మంచి దంటే నాకు కాఫర్లంటే అభిమానమని అర్థమా? వాళ్ళువీళ్ళు తలకాయలు పగలుగొట్టుకోని చావవల సిందేనంటే నిగ్గుదేలిన మహమ్మదీయుణ్ణా. వీడు ఊరికేరాడు. ఏదో ఎత్తుగడే (పెద్దగా) వజీరు సాహెబు! సలాం.

మహమ్మద్ ఖాన్

లోపలినించి బ్రాహ్మలు వస్తున్నారు. వాళ్ళను లోపలికి పోనిచ్చావు?

మయిస్తఖాన్

(కోపంవచ్చి ఎఱ్ఱనయిన కళ్ళతో) అవునా! నీకు చెప్పినవాళ్ళు అబద్ధీకులు.

మహమ్మద్ ఖాన్

బ్రాహ్మలు అనుకున్నమాటలు నేనే విన్నాను.

మయిస్తఖాన్

(కోపంతో) ఏమని......? ఇదివరలోనే చెప్పాను నేను ద్రోహినికానని. పాదుషా ఆజ్ఞలను ఎదిరించ గలిగిన సాహసం నాకులేదు. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు నటించేడం మావంశంలో ఎక్కడాలేదు.

మహమ్మద్ ఖాన్

అనవసరప్రసంగం చేస్తున్నావు. తలుచుకుంటే నిన్నేమైన చేయగలను. లోపలికి బ్రాహ్మలను పంపి మాటలతో మోసంచేయడానికి చూస్తున్నావు.

మయిస్తఖాన్

నీకు జవాబుచెప్పవలసిన బాధ్యత నాకు లేదు. పాదుషావారి హుకుంతీసుకుని ఇక్కడున్నాను. ఆజ్ఞ నిర్వర్తిస్తున్నాను.

మహమ్మద్ ఖాన్

నీముందు నిలబడి మాట్లాడడం నాదేతప్పు. నీవు లోపలికి బ్రాహ్మలను పోనిచ్చావు. దీనికి సమాధాన మేమిటి?

మయిస్తఖాన్

పాదుషావారికే నాసమాధానం.

మహమ్మద్ ఖాన్

అల్లాకు గూడానూ. ఇంకా లోపల బ్రాహ్మలు గూడా ఉంటారు. నేను లోపలికి వెళ్ళిచూడాలి.

మయిస్తఖాన్

వద్దు. మానవుణ్ణి లోపలికి పోనీయవద్దని పాదుషా వారి హుకుం అక్షరాలా జరిగితీరవలసిందే.

మహమ్మద్ ఖాన్

కండకావరం! పాదుషావారే నన్నువెళ్ళి నీచర్యపరి శీలించమన్నారు.

మయిస్తఖాన్

వారిహుకుం?

మహమ్మద్ ఖాన్

పాదుషావారి హుకుం నాకక్కర్లేదని నీకూ తెలుసు.

మయిస్తఖాన్

పాదుషావారిహుకుం నాకుమాత్రం కావలె లేక పోతే కదలడానికి వీలులేదు.

మహమ్మద్ ఖాన్

నీతో వాగ్వివాదం అనవసరం. నీ ఈకారుకూతలు చూస్తే నీవు అనుమానించవలసినమనిషివే. లోపల బ్రాహ్మలే ఉన్నారేమో?

(అని రెండు అడుగులు లోపలికి వేస్తాడు)

షయిస్తఖాన్

అవును. "మతోమతద్రోహి" అని ఎవళ్ళైనా చూపి ఇంకా బహుమతులు పొందాలని. ఇది నీస్వప్రయత్నమే కాదు తెలుసు కదిహావా బ్రతుకుమీద ఆశ వదలుకోవలసిందే.

మహమ్మద్ ఖాన్

(కళ్ళురుముతూ) ఆ! ఏంచేస్తావు?

షయిస్తఖాన్

మూడోమాటు చెబుతున్నాను. మానవకీటకం ఈ హద్దుదాటి పోగూడదు. పాదుషావారిహుకుం అది. నీ విదివరకే రెండడుగులు వేశావు. ఇంకోఅడుగు వేస్తే నీప్రాణంనీది కాదు. తరువాత అనుకొని లాభంలేదు.

మహమ్మద్ ఖాన్

(మరోఅడుగు వేస్తాడు)

షయిస్తఖాన్

పో! వెనక్కు.

మహమ్మద్ ఖాన్

(మరోఅడుగు వేస్తాడు)

షయిస్తఖాన్

పో!! వెనక్కు.

మహమ్మద్ ఖాన్

(మరొకఅడుగు వేస్తూ) నేను వెళ్ళను.

షయిస్తఖాన్

(కత్తి ఎత్తి మహమ్మద్ ఖాన్ను రెండుతుండాలుగా నరుకుతాడు).

—తెరవాలుతుంది.

—మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ.





## జానకి

సుందరాంగుల నెందరజూచియున్న
జానకీ! ఆత్మనిల్పు నీమానసంబె!
చోద్యముగ మింట నలరారు చుక్కలున్న
చందమామయె మదికెక్కు చందమునను!
చిత్తసీమ జీకటిరీతి చింతగప్ప
వలపు వెన్నెల బచరించి తొలగజేతు,
వాకసంబును దలపులు తాకుచుండ
హృదయముప్పొంగు జలనిధియేచులీల!
చెలియ! నీయాత్మ నలరారువలపుకలిమి
లలితమౌ పూలవాసనవలె చెలంగు;
సంతసమొసంగు చంద్రుని కాంతియట్లు
చల్లనై హాయిగలిగించు నుల్లమునకు!
పక్షిపలుకులు తెలుపు నీపలుకుతీపి,
జిగివసంతంబు తెల్పు నీసొగసుతెరగు,
వెన్నెలలు తెల్పు నీయెదనున్న కరుణ,
పరిమళము తెల్పు చెలియ! నీవలపుపొలుపు!
కడుమనోహరమగునట్టి కథలయందు,
తనువుమరువంగజేయు నందములయందు
విమలమాధురీకలితగానములయందు.
మానినీ! తోచుచుందువు మానసమున!
అలఘుసుఖమిడు నీపైని కలుగుతలపు,
నిర్మలంబగు నీయందు నిలచువలపు,
చెలియ! నినుగూర్చి గలిగెడు తెలివికలలు
అతిపవిత్రము లతిమనోహరము లగును!
తరుణి! నాచిత్తమనియెడు దర్పణమున
బింబితంబగు నీముఖబింబ మెపుడు,
తలపులేవేళ యెన్ను నీవలపుకలిమి,
చేడెరో! నీదు ప్రేమయే జీవనంబు!
మదిని నిను నిల్ప శోకంబుమాయమగును,
స్వాంతమున నిండు నొకవింతసంతసంబు,
పొడము నుత్సాహ, మవ్వేళ పూని సేతు
గొప్పకార్యంబులను సానుకూలముగను!

—అధికార్ల సూర్యనారాయణరావు, బి.ఎల్.

# జోన్ ఆఫ్ ఆర్క్

౧

ఫ్రాన్సుదేశంబు పుణ్యంబు పండినది, అ
రాజకంబయి దేశ మాంగ్లప్రభుత్వ
వదనగహ్వరాన గుటకపడెడి వేళ
నడ్డు పడగ 'జోనాఫార్కు' అవతరించె.

ఈయిల ఆమెయే అవతరించకపోయిననాడు ఫ్రాన్సుదే
శీయులు దాస్యశృంఖలలె హిందువులట్లు వహించియుండు వా
రేయనిపించు; దేశమననేమొ, తదీయస్వతంత్రతాపదం
బేయదియో, బిరాన చవియిచ్చిన దామె సహోదరాళికిన్.

వలువ ధరించి బీరపువ్వువంటిది పచ్చికబైళ్ల గొఱ్ఱె గుం
పులు మరలించు బాలిక ప్రబోధితయైనది యీశ్వరాజ్ఞచే
"నిలువుము దేశరక్షణకు నీయనుజన్ములతో" నటంచు మే
ల్కొలుపు ధ్వనించె నామెయెదలో ఒక దైవికవాణి యేదియో.

బారెడు సోగవెండ్రుకలపాయలు వీలుగ కత్తిరించి శృం
గారవిరక్తబాలకుడునా తన వేసముదిద్ది తీర్చి తా
నే, రణసీమ సేన నడిపించెనటే, మగవాని గుండెలో
నీరసమైన రక్తము ఘనీభవమై ధృతిపెంపు శోభిలన్.

అలవికిమీరిపోయిన తదద్భుతశౌర్యముతో నెదుర్కొనన్
దలకి, అసూయచేత ప్రమదామణి 'దయ్య' మటంచు తచ్చరి
త్రల విరచించుకొన్న అరిరాజుల యాలఘుచిత్తవృత్తు లే
వెలువడెఁగాక, ఇంత కొదవే! రమణీకమనీయకీర్తికిన్.

మాతృదేశాభిమానంబు మంటఁ గలిపి పరులఁగలసిన 'గాస్కనీ' ప్రజలు గూడ
ఆ శుభాంగిని ప్రస్ఫుటాస్యంబుఁ జూచి నపుడు మొగమెత్తలేక సిగ్గుపడలేదె?
పసితనపుసౌకుమార్యంబు వదలనట్టి మొగ్గవయసున మానవస్మృతిపథాల
వ్రాసికొన్నది పేరు కీర్త్యక్షరముల నువిద, కాలాన మాసిపోకుండు నట్లు.

౨

అట్టి తేజస్వినీకోమలాంగకములు
కాలి, మసియయ్యె, నాంగ్లుల కరకుచేయి
పేర్చిపెట్టిన చితిమీద; వీరయువతి
కిట్టి దుర్మరణంబు ప్రాపించె నకట!

బ్రతికిన నాల్గురోజులును వైరులగుండెలలోని బల్లెమ
ట్లె తనరినట్టి వీరనవలామణి, ఈశ్వరునాజ్ఞఁగాఁ దలం

చి, తనదు మాతృదేశమును సేవయొనర్చిన భక్తురాలు, ఆ
చితిపయిఁ బ్రాణసంపుటి త్యజింపఁగ నున్నది ధైర్యమూర్తియై.

వైరుల యీర్ష్యచే రగులఁబడ్డది యా చితిమీఁది నిప్పుఁ జ
ల్లాఱుప లేదు జాలి కనులన్ స్రవియించిన అశ్రుధారలై
నా, రమణీ తనూవిలసితాచ్ఛమనోహరమార్దవంబు నిం
డారు కవుంగిటన్ పొదివినట్టివిపో అరుణాగ్నికీలికల్.

ఇంచుక, కాలు, చేయిఁ గదలించుటకైనను వీలుగాక, బం
ధించినఁగూడ, నిప్పు సెగ కెట్టియునఃపరితాపఖేదమున్
గాంచదయేమి! యాలలితగాత్రి విలోకనమందు దేశసే
వాంచితదివ్యతేజసనుహాసమె తెల్లముగాఁ బ్రకాశిలున్.

అతిక్రూరంబయి రేగి పైకొనెడి యాయగ్నిచ్ఛటల్ క్రమ్మునో
న్నతరీన్, బాలిక తమ్మిపూపుటాడిలోనన్. నవ్వుమోమెత్తి సు
స్థితయై నిల్చెడి ధైర్యలక్ష్మియన మించెన్, దేశభక్తి ప్రబో
ధితనేత్రద్వితయంబు శాంతరససందీప్తంబులై శోభిలన్.

ఆచితినుండి వ్యోమముఖమై యెగఁబ్రాకిన ధూమరేఖల
న్నీ, చిరుమబ్బులై నలువునిండినవై, అనిశంబు ముక్తకం
ఠోచితవాక్యముల్ చదువుచున్నవి వైరుల దుర్యశంబు, ఆ
నీచతమప్రవృత్తి యవనిన్ చిరకాలము నిల్చిపోవఁగా.

3

ఫ్రాన్సుదేశాన నొకచిన్న పల్లెటూరు
ఆ లతాంగి జన్మస్థానమయి వెలుంగు;
ఆమె చిరుపాదములయచ్చు లచటి మేలి
పొలములును తమ గర్భసీమలనె దాచు

కొని పులకరించు వర్షాలు గురిసినపుడు; ప్రతివసంతనవోదయావసరమందు
నాతితోఁగల తమచిన్ననాటి చెలిమి నచటి యారామతరులెల్ల అడవిపూలు
రాల్చుచున్నవి ఆమోదరసము చింద; అచట నొక క్రేవ లోయలో, అలనగతిని
పారుచున్నట్టి 'మ్యూసు' నదీరవాలు తరుణివీరప్రశంసాకథానకములు—

మరుగు పడలేదు మానినీమహితసత్క్రి
యాకలాపంబు నేటికి నచటి నిర్మ
లప్రశాంతవాయుతరంగలాస్యములనె
వ్యక్తమగుచున్న దామె ధైర్యప్రశస్తి.

—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి. ఏ.

# మేక పాలు

**పాల బీదతనము : శిశుమరణములు.**

హిందూదేశమునందలి ప్రసూతివైద్యశాలలలోని లెక్కలను పరికించితిమేని ఈదేశపు శిశువు జన్మకాలమున పొడుగులోకాని, తూనికలోకాని ప్రపంచమునందలి మఱి యేదేశపుశిశువులకును తీసిపోకుండుట తెలియవచ్చుచున్నది. స్థితి ఇట్టిదికాగా హిందూదేశమున శిశుమరణముల సగటుసంఖ్య ఇతరదేశములందలి సంఖ్యకంటె మిక్కిలి హెచ్చుగానుండుటకు కారణమేమి? పాలిచ్చుటమాని అన్నముపెట్టుటకు ప్రారంభించు కాలముననే మనదేశమున శిశువులు విశేషముగా మృత్యుదేవత పాలబడుచుండుట లెక్కలు చెప్పుచున్నవి. అన్నప్రాశముచేసి శిశువులకు తల్లిదండ్రులు తిను ముతకఆహారమునే పెట్టుటతో వారిజీర్ణకోశము పూర్తిగ పాడై వారు రోగములపాలగుచున్నారు. పాలనే ఆహారముగ మఱికొంతకాలము శిశువులకు ఇచ్చియుందురో వారిట్లు అకాలమున మరణింపకుందురు. పాలే ఆహారముగ మఱికొంతకాలము మీ శిశువులకు ఏల ఈయలేదని మనము హిందూదేశపు మాతలను ప్రశ్నించుచో వారు పాలుదొరకుట కష్టమగుటయే ఇందుకుకారణమని చెప్పుదురు. పాలకుగల గిరాకీచే సామాన్యసంసారులు తమశిశువులను సాధ్యమైనంత త్వరలో పాల ఆహారమునుండి తప్పించి వారికి అన్నప్రాశనము గావించుచున్నారు.

**మేక 'పేదవాని ఆవు'**

అగుట క్షీరవిషయము ఇపుడు భారతదేశమున నొక పెద్ద సమస్యగానున్నదని ఒప్పుకొనకతీరదు. పాలు సమగ్రమైన ఆహారము. ఇట్టి సమగ్రమైన ఆహారసంపాదనార్థము భారతీయులు ప్రస్తుతకాలమున ప్రత్యేకశ్రద్ధనుచూపి గోసంరక్షణకు గడంగవలసియున్నదని మాలవ్యాపండితులు మొదలగు నాయకమహాశయులు పత్రికలలో చేయుచున్న హితబోధ ఎంతయు ఆచరణీయమై యున్నది. పాలకొఱకు ఆవును పెంచుటకంటె మేకనుపెంచుట ఎక్కువ లాభకరమని ఎ. ఇ. స్లేటరు మొదలగు మహాశయులు చెప్పుచున్నారు. హిందూదేశము నేడు పేదతనమున మ్రగ్గుచున్నది. పేదవారికి ఆవును పెంచుటకంటె మేకను పెంచుట సులభము. మేకను 'పేదవాని ఆవు' అని పిలుచుటయుగలదు. మాంటిగోమరీ, సిక్కిందియా, ఒంగోలు మొదలగు జాతి ఆవులు-పుష్కలముగ పాలిచ్చుభారీజాతివి - వరణీయములే. కాని వానిని పెంచుటలో విశేషధనవ్యయమగును. ధనికులగువారికిగాని అవి సామాన్యులకు అందుబాటున నుండవు. అవి దినమునకు ఇచ్చుపది, పన్నెండు సేర్లపాలును సామాన్యసంసారముల అక్కరకు మించును. దినమునకు మూడు, నాలుగుసేర్లపాలు ఉండిన సామాన్యసంసారములకు చక్కగ సరిపోవును. సాధారణజాతి ఆవు దినమునకు ఈమాత్రపుపాలను ఈయగలదు. మంచిజాతి మేక కూడ దినమునకు ఈమాత్రపుపాలను ఈయగలదు. కాని రెండింటిని మేపుటలో ఆవువిషయమునకంటె మేక విషయమున కష్టము, ఖర్చు తక్కువ. ఆవు ముట్టని పెక్కు ఆకులలములను మేకతినును; కనుకమేపుటలో మేకవిషయమున ఖర్చుతక్కువ. పచ్చిమేతకు తోడు పాలిచ్చుదినములలో మేకకు దినమునకు సేరువంతున పప్పు, పొట్టు మొదలగునవి ఇచ్చిన చాలును. ఒక్క ఆవును మేపుటలో అగు ఖర్చుతో ఐదుమేకలను మేపవచ్చునని ఎ. ఇ. స్లేటరుమహాశయుడు చెప్పుచున్నాడు. మేకలను పెంచుటకు పచ్చికబయళ్లుకూడ అవసరము లేదు. ఫ్రాన్సు, బెల్జియము, డెన్మార్కు మొదలగు దేశములందు ప్రతి యంగుళస్థలమును వ్యవసాయభూమియై యున్నది; అచ్చటి పొలములు మనదేశములందువలెనే ప్రాయికముగా ఖండఖండములై యుండును. అచ్చట విశాలములైన పచ్చికబయళ్లు లేనేలేవు. కాని ఆదేశములందు మేకల పెంపకము హెచ్చు. అచ్చటి మేకలు ఏడాదిపొడుగునను దొడ్లలోనే ఉండును.

వానికి ఆహారమంతయు అక్కడనే ఇత్తురు. మేతకై బయటకు పోనేపోవు. ఇట్టి పరిస్థితులలోకూడ అచటి మేకలు పాలబీడపడవు; వాని ఆరోగ్యమును చెడదు. ఎదిగెడుచెట్లను, చిట్టియడవులను నాశనముచేయుమారిగా మేకనుచూచువారు మనదేశమున కొందరుగలరు వారు డెన్మార్కు, బెల్జియము మున్నగు దేశములందలి మేకలపరిస్థితులు గమనించిరేని మేక ఎదిగెడుచెట్లను, చిట్టియడవులను నాశనముచేయు మారిగాకుండ చేయ నగుటను అంగీకరింపగలరు.

## కొన్ని మేకజాతులు

హిందూదేశమునందు శ్రేష్ఠమైన మేకజాతులు కొన్నిగలవు. వాని విలువను ప్రజాలోకముగుర్తించియు నున్నది. సంయుక్తపరగణాలయందు 'జమ్నాపారి' యని పిలువబడు ఒకజాతి మేకలుగలవు. ఆజాతి మేకలలో మంచివి దినమునకు నాలుగు మొదలు నాలుగు న్నరసేర్లవఱకును పాలిచ్చును ఆ పరగణాలయందే 'బార్బరి'యను మఱియొకజాతి మేకలుగలవు. బుర్రి ఆవులవలె ఈజాతిమేకలు మిక్కిలి పొట్టిగనుండును. ఈజాతి మేకలలో మంచివి రోజుకు నాలుగుసేర్లపాలు ఇచ్చును. బొంబాయి రాజధానియందు 'సుర్తి' యని పిలువబడు మఱియొక ప్రశస్తమైన మేకజాతిగలదు. జమ్నాపారిజాతిమేకల ప్రాశస్త్యము భారతదేశమునకు బయటనుగూడ వెల్లడియైయున్నది. సంయుక్తపరగణాలయందలి వెటినరీశాఖవారు రీనడుమ జావాద్వీపమునకు ఈ జాతిమేకలను రెండు పెద్దఓడలయందు ఎగుమతి చేసియున్నారు. 'జమ్నాపారి'జాతి మేకపోతులు లోగడ హిందూదేశమునుండి ఇంగ్లాండుదేశమునకు ఎగుమతిచేయబడినవి. అవి ఆదేశమున క్రొత్తజాతిమేకల ఉత్పత్తికి కారణభూతులైనవి. ఈ క్రొత్త జాతికి 'యాంగ్లో-నూబియన్' జాతియనిపేరు ఉంచబడినది.

## అమెరికాదేశమున ఆవుపాలకంటె మేకపాలకు వెలహెచ్చు

గుణవిషయమున ఆవుపాలను, మేకపాలన పోల్చి పరిశీలించితిమేని కొన్నిమంచిసంగతులు వెల్లడికివచ్చును. మేకపాలనిన మనము ప్రియముపడము. కారణము గుణవిశేషమున ఆవుపాలకు మేకపాలుతీసిపోవునను దురభిప్రాయము మనలో ప్రబలియుండుటయు, మేకపాలు ఒకవిధమైన గొల్లవాసనయు వింతరుచియు కలిగియుండుటయును. మేకపాలకు ఇట్లు గొల్లవాసనయు, వింతరుచియు కలుగుటకు కారణము మనము మేకలను పెంచుటలో అవలంబించు విధానమునందలి లోపములే అని స్లేటరుమహాశయుడు చెప్పుచున్నాడు. ఇంకను ఆతడిట్లు చెప్పుచున్నాడు: "ఎట్టి గొల్లవాసనయు లేకుండునట్లు మేకపాలను నేను తయారుచేసి స్నేహితులకు త్రాగుటకు ఇచ్చితిని. వారు వానిని ఆవుపాలు కావని గుర్తింపలేకపోయిరి. మేకపాలలోనుండు వింత రుచికి కారణము మేకలు చేదుగనుండు వేప ఆకులు మొదలైనవి తినుటయే అయియుండునని నా అభిప్రాయము. పాలిచ్చు మేకలయందలో పోతుమేకలను ఉండనీయకుండినచో మేకపాలకు ఎట్టి గొల్లవాసనయు ఉండదు; అప్పుడు మేకలు వేపమొదలగు ఆకులు తినినను వానిపాలకు వింతరుచికలుగదు. ఇది స్వానుభవముచే చెప్పునదికాని అన్యముగాదు. పలుకారణములచే ఆవుపాలకంటె మేకపాలు శ్రేష్ఠమైనవి. ఈవిషయమును గూర్చి తమనాయకమహాశయుడగు గాంధీమహాత్ముని అడిగితెలిసికొనవలసినదిగా హిందూసోదరులను కోరుచున్నాను. అమెరికాసంయుక్తరాష్ట్రములందలి న్యూయార్కు, చికాగో మొదలగు పెద్దపెద్దపట్టణములందు మేకపాలు ఆవుపాలకంటె రెట్టింపు హెచ్చువెలకు అమ్ముడుపోవును. ఆదేశమున ఆసుపత్రులయందును, ఆతురాలయములయందును ఆవుపాలకంటె మేకపాలకు గిరాకీ హెచ్చు."

## ఆవుపాలకంటె మేకపాలు మంచివి అనుటకు ఏడు కారణములు:

(1) ఏటేట హెచ్చుసంఖ్య మానవులమరణమునకు కారణభూతమైన వ్యాధులలో క్షయరోగమొకటి. ఆవులకుకూడ క్షయరోగము తగులుటకలదు, అట్టి ఆవులపాలు క్షయరోగమును కలిగింపగలవు. క్షయరోగకారకక్రిములు ఇంతవరకు మేకపాలలో ఉండి;

నిదర్శనములు శాస్త్రజ్ఞులకు దొరకలేదు. క్షయరోగ కారకక్రిములను నాశనము చేయుటలో మేకలు, వాని పాలు సమర్థములని ఆయుర్వేదము చెప్పుచున్నది.

(2) జీర్ణస్థితిలో ఆవుపాలు పుల్లటిగుణమును, మేకపాలు క్షారగుణమును పొందును. జీర్ణకోశము సరిగా లేనివారికి, మందాగ్నిగలవారికి పుల్లటిగుణముగల ఆవుపాలు ఆరోగ్యప్రదములు కాజాలవు.

(3) ఆవుపాలు జీర్ణమగుటకు రెండుగంటల కాలము పట్టును; మేకపాలు అరగంటలో జీర్ణమగును అనగా మేకపాలను ఆరగించుటకు ఆవుపాలను ఆరగించుటకు కంటె జీర్ణకోశము నాలుగింట మూడుభాగముల తక్కువపనిని చేయవలసియుండును. జఠరాగ్ని మందగించియుండు రోగస్థితియందు మేకపాలు ఎంతగ వరణీయములో ఇందువలన సులభముగా నిర్ణయించుకొనవచ్చును.

(4) ఆవు, మేక, స్త్రీల పాలను శాస్త్రయుక్తముగా పరిశోధించినవారు ఈమూడు రకములపాలయందును పండ్రెండు విధములైన లోహసంబంధములగు లవణములుకలవని కనుగొనియున్నారు. ఈమూడు రకముల పాలలో ఏ ఒక్కదానియందును ఈ పండ్రెండు రకముల లవణములును లేవు. స్త్రీలపాలయందు ఐదురకముల లవణములు ఆవుపాలయందు ఆఱురకముల లవణములు మాత్రము ఉన్నవి. మేకపాలయందు తొమ్మిది రకముల లవణములు ఉన్నవి.

(5) ఆవుపాలలో ఇనుము అసలు లేదనియే చెప్పవచ్చును. మేకపాలలో అది కొంతవరకుగలదు. పలువురు వైద్యశిఖామణు లిట్లు చెప్పియున్నారు: "ఆవుపాలలో మఱికొంచము ఇనుము ఉండియుండినచో అవి నూటికి నూరుపాళ్లుగల సమగ్రమైన ఆహారపదార్థమైయుండును."

(6) ఎముకల ఆరోగ్యస్థితికి ఫోస్ఫేటులు కావలసియుండుట అందరు ఎఱిగినదే. ఏడురకములైన ఫోస్ఫేటులవణములలో ఆవుపాలయందు 0.508 భాగములును; ఆవుకంటె మిక్కిలి చిన్నజంతువగు మేకయొక్క పాలయందు 0.319 భాగములును; స్త్రీలపాలయందు 0.096 భాగములునుమాత్రము ఉన్నవి.

(7) పొటాసియముగల లవణముల విషయమున గమనించితిమేని మిక్కిలి చిన్నజంతువగు మేకయొక్క పాలలో 0.483 భాగములు ఉన్నవి. ఆవుపాలలో 0.282 భాగములుమాత్రమే గలవు. వెబ్‌స్టరు భిషగ్వరుడు ఇట్లు చెప్పుచున్నాడు: "అన్నిపదార్థములకంటెను పొటాసియమునకు ప్రాణవాయువుతో బలమైన సంబంధముకలదు. కావున అది ఇతరపదార్థములనుండి ప్రాణవాయువును గ్రహించుటలో గొప్పశక్తిగలది. ఆవుపాలకంటె మేకపాలలో ఇనుముభాగమును, ప్రాణవాయువును అధికముగ గ్రహింపగల పొటాసియము భాగమును హెచ్చుగనుండుటచే ఇవి అన్నిపాలకంటె శ్రేష్ఠములైనవగుచున్నవి."

ఈ విధముగా రసాయనికశాస్త్రము 'పేదవానిఆవు' బలము, శక్తిగలిగి అన్నివాతావరణములకు ఎట్లు తాళగలుగుచున్నదో రూపించుచున్నది. మేకపాలు ఆరోగ్యమును కలిగించు శ్రేష్ఠమైన ఆహారమని ప్రపంచమునందలి వైద్యమహాశయులెల్లరు అంగీకరించియున్నారు.

మేకలవిషయమున మనదేశమునగూడ ఇపుడు కొంతశ్రద్ధ చూపబడుచున్నది వ్యవసాయవిచారణ సంఘమువారు (లిన్‌లిత్‌గో కమీషను) హిందూదేశమున మేకల ఉపయోగమునుగూర్చి విపులముగ వివరించియున్నారు పూనా, ఈటా మొదలగు తావులయందు మంచి జాతిమేకల ఉత్పత్తికై ప్రభుత్వపరిశోధనలు సాగుచున్నవి హిందూప్రజలలో మేకపాల యెడగల విముఖత్వము తొలగిపోవుటతో భారతదేశమున క్షీర సమస్యయు తొలగిపోగలదు.

ఆవును పెంచుటకంటె మేకను పెంచుట సులభమగుటయు, ఆవుపాలకంటె మేకపాలు సర్వవిధముల శ్రేష్ఠములైయుండుటయు గమనించి భారతీయులు మేకల పెంపకమునకు గడంగి తమ ఆరోగ్యసంపదను పెంపొందించుకొందురుగాక యని స్లేటరు మహాశయుడు హెచ్చరించుచున్నాడు.

—ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.




కో మాళ్ల కన్న తల్లి! ఊపవే ఉయ్యాల.

# ప్రవాసి

తల్లిరెక్కలపొత్తిళ్ల దాగి మణగి
శాశ్వతానందనిద్రాప్రశాంతయోగ
మున కనులువిప్పిప్రకృతిసమ్మోహనమున
కలరి కేరింతలాడు దివ్యావకాశ
మకట! నిను శత్రువునిగూటియందు దార్చి
తల్లియె విసమ్ముద్రావించి తరలిపోయె
పికకుమారక! నీవిధిప్రేరణమున.
వాయసమె తల్లి సోదరుల్ వాయసములె
నీకు నీనిర్మలానందనిబిడమైన
మానసపథాంతరమ్ముల మలసిపోయె
అతివినిశ్చితమైన ప్రేమార్ద్రదృష్టి
చివురుగొమ్మల కంఠమ్ము జీరవోని
విశ్వమోహనమైన, నీవిమలమైన
ఆచిరుతపాట జగమెల్ల నాక్రమించె.
ఈయనంతప్రకృతి పుల్కరించిపోయె.
కాకిగూటికి ఏంతభాగ్యమ్ము కలిగె!
కాకములమూకలెల్ల సంఘముగ జేరి
ఇది విజాతీయమనుచు గర్హించి కాళ్ల
రెక్కలను ముక్కుకొనల కేరించిపొడువ
సంధిసంధియు వ్రయ్యలై చావుదొరగి
ఆసలేలేని విశ్వగాయకుడవయ్యొ
ఆయగమ్యనిశానిబిడాంధఘోర
గహనములబట్టిపోయితే కాలవికృతి.

— ఊటుకూర సత్యనారాయణరావుబహద్దరు.



# టిరనీ

గోవిందరావును ఒక్కసారిగా నిరుత్సాహం, నిరాశా, నిస్పృహా ముంచేసినై. కుర్రవాడు పేకముక్కలతో ఎంతో కష్టపడి నాలుగంతస్తుల మేడకట్టి దాన్ని చూసి మురవటం పూర్తిచెయ్యకమునుపే చిన్న గాలి కొట్టి అదంతా నేలమట్టమయితే వాడిమనస్సెంత ఖేదిస్తుందో, గోవిందరావు మనస్సంత ఖేదించటం మొదలు పెట్టింది. ఆ పెంకపెళ్లాంమీద—ఆ అనాకారికోతిమీద—ఎంత ఆపేక్ష తెచ్చిపెట్టుకున్నాడు! ఎంత ప్రయాసయింది! గగనసౌధాలన్నీ ఒక్కపిల్లగాలికి గుభిల్లునకూలినై. అతని మనోనేత్రం ఎటుతిప్పినా కనపడుతున్నది ఆకాశమే. ఒక మనస్సులోనే కాకుండా శరీరంలోపలకూడా డొల్లగా ఉన్నట్టనుమానం తట్టిందతనికి. ఈశరీరంలోపల డొల్లగా ఉండటమనేది గోవిందరావు చిన్నతనంలో ఒకసారి కాబోలు అనుభవించాడు—ఒక స్నేహితుడి సలహామీద బీడీకాలుస్తూ బడిపంతులు కళ్ళపడ్డప్పుడు. ఇదంతా ఇట్లా ఉంటుండగా అంతరాత్మఎదట ఎట్లా పడదామా అని అతని కొకపెద్ద బెంగ.

ఈ చివరముక్క అందరకీ సులభంగా అర్థం కాగలందులకు—

బానిసత్వం అనేకరకాలుగా ఉంటున్నది. ఒక దేశానికి మరొకదేశం దాస్యంచెయ్యటం అనేది అట్లా ఉంచి—లోకాభిప్రాయానికి దాసులుకొందరు, బంధుకోటికి దాసులుకొందరు, గట్టిగా మాట్లాడగల వాళ్ళకల్లా దాసులుకొందరు, భార్యలకు దాసులుకొందరు, మతాచారాలకు దాసులుకొందరు—వ్యక్తులు రకరకాల దాస్యంచేస్తున్నారు. కాని అన్నిరకాల్లోకీ చిత్రమైన రకం అంతరాత్మకు దాసులు. ఈ బానిసత్వంలో ఉన్న విశేషమేమిటంటే, ఇది ఇతర దాస్యాలమోస్తరుగా చప్పున బయటపడదు. ఈవ్యక్తులనమ్మకం అంతరాత్మ చెప్పిందల్లా వేదవాక్యమనే! అంతరాత్మ పొరపాటు పడదనే! అంతరాత్మకు దాస్యంచేస్తూ వీళ్ళు చాలా గర్వపడతారు. వీళ్ళబుర్రల్లోకి తర్కంఎక్కదు. వీళ్ళకెంతచెప్పీ లాభంలేదు. భారతంలో ధృతరాష్ట్రుడిదే మచ్చు. 1938 లో గోవిందరావిదేరకం.

ఇతరులకు కైంకర్యం చెయ్యటంలోనూ అంతరాత్మకు చెయ్యటంలోనూ ఇంకో తేడా కూడా ఉంది. ఇతరుడు పొరపాటుచేసి యజమాని కంటపడకుండా తప్పించుకు పారిపోవచ్చు. అంతరాత్మకు చేతులుజోడించినవాడి కాఅదృష్టంలేదు. కనక గోవిందరావు వెధవమొహంవేసుకుని అంతరాత్మవినేటట్టు, "నాపెళ్ళాం హనుమంతరావుతో పోతున్నది. నేనేంచెయ్యను?—ఎట్లా యీడవను?" అన్నాడు. (ఎట్లా యీడవనేది అంతరాత్మకు కనికరం కలిగేటందుకు!) బెల్లంకొట్టిన

రాయల్లే అంతరాత్మ నోరు తెరవలేదు. (అదేగుర్తు నోరు చేసుకుంటే ఒకంతట వదిలిపెట్టదని.)

హెచ్. క్యూ. నుంచి ఆర్డర్సుకోసం ఎదురుచూసి, విసిగి, గోవిందరావు ఆలోచనలోపడి కాస్సేపు ఆశ్చర్య రసం అనుభవించాడు. తన పెళ్ళాంలో హనుమంతరావు ఏంచూసినట్టు! అందచందాలవిషయం అట్టేపట్టించుకోలేని తనకే తనపెళ్ళాం మరీ ఇంత కురూపిందుకొచ్చావాలని పిస్తుంటే—

"ఆడగొరిల్లాకూడా బాగుంటుంది,నీ పెళ్ళాం కాక పోతేసరి!" అని గొణిగింది అంతరాత్మ.

"నాకు వాణ్ణిచూస్తే చాలా జాలేస్తుంది" అన్నాడు గోవిందరావు, పాపం, తెలీక. దాంతో తుపాను బద్ద లయింది.

"ఎవణ్ణిచూస్తే జాలి? ఛీ! బృహన్నలవెధవా! సిగ్గు లేక వాగుతున్నావా?"

"ఎందుకట్లా తిడతావు?"

"తిట్టానా? నిన్ను నరికితే పాపంఉందా?"

"నేనేం చేశాను?"

"ఏం చెయ్యలేదు కనకనే! పెళ్ళాం ఎవడితోనో పోతూంటే ఏం చెయ్యకుండా ఊరుకున్న అడకుంకవు నువ్వుతప్ప ఇంకెవడూ ఉండడు"

"ఇంకోడైతేమాత్రం చేసేదేముంది?"

"నువ్వు ఆరుసంవత్సరాలకింద పున్నయ్య విషయం లో ఏమన్నావు?"

"నాకు జ్ఞాపకంలేదు."

"అయితే నాకు జ్ఞాపకం ఉంది! చెబుతా విను. 'ఎప్పుడైతే ఆడముండ పైవాడితో యిలాకా పెట్టుకుం టుందో అప్పుడు మగవాడైనవాడు దాన్నీ వాణ్ణీ చెరోపోటూ పొడిచి నూతిపక్కన గొయ్యితీసి పూడ్చి పెట్టి చేతులు కడుక్కోవలసిందే! మరో ఉపాయం ఆలోచించటం గొల్లభామమార్కు పాలడబ్బాలను ప్రత్యామ్నాయం అన్వేషించటమే. ఇదే నలుగురూ తొక్కినదారి, అందరికి తెలిసినక్రియ, బైరాగి చిటిక, అమృతాంజనం డబ్బీ' అంటూ తడుముకోకుండా ఉపన్య సిస్తివే"

"అప్పుడు తప్పకుండా పొరపాటుపడే ఉంటాను."

"నేను పొరపాటుపడనిస్తానా ఏమిటి? ఇప్పుడే వెధవ నవుతున్నావు."

"అయితే నన్నిప్పుడు వాళ్ళిద్దర్నీ చంపమంటావా ఏమిటి? ఊరుకో! పుణ్యానికి! నా మెడమీద తలనిలిచే ఏర్పాటు చేసేటట్టు కనపళ్ళేదు నువ్వు"

"ఓరి నపుంసకుడా! పాపిష్ఠినుగా! ముదనష్టపు కుంకా! మానంపోయినతరువాత ప్రాణమెందుకురా?"

పోయింది నాపెళ్ళాంమానంకాని నాదికాదండా మనుకున్నాడు గోవిందరావు. కాని ధైర్యం చాల్లేదు.

"అయితే నన్నేం చెయ్యమంటావు?"

"నే చెప్పినట్టు వింటావా?"

"అహా! యావజ్జీవం హాం ఫ్ట్యాఫు! నీ కెందు కను మానం?"

"అయితే ఈ రాత్రే నీపెళ్ళాన్నివారికి ఉప్పుపాతర్లో ఊరెయ్యి ముందు."

గోవిందం నిర్ఘాంతపోయినాడు.

"ఆడదానిమీద నా చెయ్యి చేసుకోటం? ఆలో చించు, సనాతనిస్టు లేమంటారో!"

ఇది నిజంగా ఆలోచించవలసిన విషయమే.

"పోనీ దాన్నివదిలిపెట్టేస్తవుగాని' మరి హనుమంత రావు గొంతెప్పుడు కోస్తావు?" (గోవిందరావు తలగో క్కున్నాడు.) "ఏమిటా ఆలోచన? నీ మొహం ఆలో చన!"

"అంటే—నాకు వాణ్ణిచూస్తే అంతకోపం రావటం లేదే మరి!"

"ఎంతకోపం?"

"చంపేటంత కోపం!"

"నువ్వు పుట్టుకుంకవని నాకు మొదణ్ణించీ తెలు సును. నువ్వు నిజమైనమాత్రం—మగసిరి—కలవాడివే అయితే—(నేను బ్రాహ్మణ్ణికదా అందామనుకొని

మానేశాడు గోవిందరావు.)—హనుమంతరావును నెత్తికి చిత్రవధచేసేటంత కోపంవచ్చేదే నీకు! భీముమా వాళ్లూ చూడు! ఏహా రెండోపక్షం, కోపంతెచ్చుకోవటం! ఇప్పటికైనా కోపంతెచ్చుకోరా! చచ్చు వెధవా!"

"తెచ్చుకుంటాను. వెధవని నరికేస్తాను."

"అట్లా!...ఏం పెట్టి నరుకుతావు?"

"ఏమో."

"ఓయి తెలివితక్కువ దద్దమ్మా! ఏమోనంటావేం? నీపెనసలు చెక్కుకునే కత్తిలేదూ? మంగలికత్తిలేదూ?"

"ఉన్నది."

"ఇంకేం?"

"అయితే నా రేజరుతీసుకుని చీకట్లో వెనకనించి వాడిమీదపడి అమాంతం గొంతు కోసేస్తాను. ఏం?"

"నీకు పగతీర్చుకునేటందుకు అపూర్వపు పద్ధతులు కూడా తెలీవేం? నువ్వు వాణ్ణి చంపేటప్పుడు వాడికి తెలియాలి ఫలానిపని కిదిశిక్ష అని. లేకపోతే నీనెత్తురు చల్లారకూడదు!"

"ఎందుకు చల్లారదు? నువ్వు మాట్లాడుతుంటేనే నాశరీరం మంచుకుండల్లే అవుతుంటే!"

"ఓరి నిర్భాగ్యదామోదర—"

"చెప్పు! చెప్పు"

"చల్లారుతుందా? చల్లారదా?"

"ఆ."

"కనక నువ్వేం చెయ్యాలి? హనుమంతరావును రాత్రి పదిగంటల కింటికి పిలిపించటం, వాడితో ఉన్న సంగతి చెప్పెయ్యటం, తరవాత వాణ్ణి కాస్తా—, వెంటనే దొడ్లో ఆరడుగుల లోతుగుంటతీసి వాణ్ణి పాతెయ్యటం, ఆమేర తోటకూరమడి వెయ్యటం! అంతా గంటపని!"

గోవిందరావు బాగా యోచించాడు.

"నువ్వు చెప్పింది చాలా అద్వితీయంగానే ఉంది కాని కొద్ది అనుమానాలున్నై."

"ఏమిటవి?"

"ఒకటి—హనుమంతరావు రాకపోతే? రెండు—ఇంకోళ్ళ వెంటపెట్టుకొస్తే? మూడు—నేను మాట్లాడుతుండగానే సంగతి గ్రహించి వాడులేచిపోతే? నాలుగు—నాచేత వాడు నిశ్శబ్దంగా చావటాని కొప్పుకోక కేకలు పెడితే? అయిదు—వాడే నన్నుచంపితే? ఆరు—"

"చావు! నీ సంగతి నాకక్కర్లేదు. నిన్ను నే నీక్షణంనించీ వెలేస్తున్నాను."

గోవిందరావుకు పెద్దచిక్కే వచ్చిపడ్డది. పెళ్ళాలు ఇంకోళ్ళతో లేచిపోవటంతో మొగుళ్ళనెత్తిన ఇంత బాధ్యతపడుతుందని అతను కల్లోకూడా అనుకోలేదు. అతనిప్పుడు చెయ్యవలిసిన కర్మకాండంతా చూస్తే, అంత కన్న వరసను నూరుమంది ఆడపిల్లల పెళ్ళిళ్లు చెయ్యటం వెయ్యిరెట్లు సులభంగా ఉంది. పైగా, భార్యచేతయినా వెధవగా చూడబడుతూ జీవించి ఉండవచ్చును గాని; అంతరాత్మ వెలివేసింతరవాత ఒక్కక్షణం మనశ్శాంతి ఉంటుందా?

గోవిందరావు ఒక్కటే అనుకున్నాడు. "చాటు వ్యవహారమెందుకు? మగతనానికి భంగంరాకుండా పట్టపగలే, నలుగురూ చూస్తుండగానే హనుమంతరావును చంపటానికి ప్రయత్నంచేద్దాం! పట్టుకుని జైలులో పెడతారూ? నేనేంచేస్తాను? వాడు తప్పించుకుపోయినందుకు కష్టంగానే ఉంటుంది! కాని, ఏంచేస్తాను? మనుష్యప్రయత్నంలో లోపంఉండదు!"

గోవిందరావు లేచి కోటుతొడుక్కుని, కోటు లోపలిజేబులో గడ్డంచేసుకునే రేజరు పెట్టుకుని హనుమంతరావింటికి బయలుదేరాడు. ఆయుధజేబి అయినా అతనికి ఉద్రేకంపుట్టలేదు. గుండె ఎర్రగీతదాటి పని చేస్తూనే ఉంది.

హనుమంతరావింట్లోలేడు. గుంటూరు పోతానని చెప్పి బయలుదేరాడట. గోవిందరావు గడియారం చూశాడు. గుర్రబ్బండీ చేసుకుంటే తనకు గుంటూరు బండి అందుతుంది. దూరానపోతున్న బండిని పిలిచాడు గోవిందరావు.

ప్లాట్ఫారంమీద హనుమంతరావు కనపడి, "ఏమిరోవ్, ఎక్కడిదాకా?" అన్నాడు.

"ఏనుండి గుంటూరు బయల్దేరానురా! నువ్వు?"

"నేనూ గుంటూరేరా! ఖాళీపెట్టెచూడు. కూర్చుందాం."

రైలు కదలబోతున్నది. ఇంకెవ్వరూ పెట్టెలో ఎక్కరేమోనని గోవిందరావు భయంపడటం మొదలు పెట్టాడు. కూచిపూడిభాగవతంలో నరసింహామూర్తిని నలుగురైదుగురు తాళ్ళతో లాగిపట్టినట్టు, తను హనుమంతరావును చంపబోతుండగా అడ్డపడేవాళ్ళెంతమంది ఉంటే అంత మంచిది రైలుకదిలింది! ఒక పోలీసు తలుపుతెరుచుకుని లోపలప్రవేశించి, హనుమంతరావును చూడగానే చక్కని మిలిటరీ శాల్యూటొకటికొట్టాడు. పోలీసూ హనుమంతరావూ సంభాషణలో పడ్డారు. ఇద్దరినంకా చూస్తూ చాలాసేపు గోవిందం కత్తి దుయ్యటం మరిచిపోయినాడు. జ్ఞాపకం వచ్చినప్పుడేమో హనుమంతరావును ఒంటరిగా చిక్కించుకుని చంపటమే చాలాక్షేమమనీ తనకు నిజంగా వాణ్ణిచంపాలని ఉన్నప్పుడు చూస్తూ చూస్తూ పోలీసెదట కత్తి తియ్యటం కేవలం తెలివితక్కువనీ తోచింది. అంగలకుదురులో పోలీసు దిగిపోయినాడు.

రైలు కదిలింది. హనుమంతరావు ఒంటరిగా దొరికాడు. ఏం చెయ్యాలా అని ఆలోచించటం మొదలు పెట్టాడు గోవిందం. రెండు నిమిషాలు గడిచినై.

"ఈజన్మ మిక దుర్లభమురా!"

గోవిందం కొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు. ఆగుడ్డివాడూ ఆ పిల్లా ఎప్పుడెక్కారో ఎట్లా ఎక్కారో తెలీదుకాని వాడిమాటమాత్రం అతనికి కొంతసహాయం చేసింది.

"ఇంత దుర్లభమైనజన్మ హనుమంతరావుకు మనం ఎందుకంతం చెయ్యాలి?" అన్నాడతను అంతరాత్మతో.

"ఏడిశావులే!" అంది అంతరాత్మ.

గుడ్డివాడు కాస్సేపుపాడి "బాబుల్లాలా! తండుల్లాలా." అంటూ హనుమంతరావువేపు చెయ్యి చాచాడు.

హనుమంతరావు వాడిమీద కాట్లుకుక్కల్లేపడి, "ఫుండాకోర్! ఎవడ్రా నువ్వు? మొద్దల్లే ఉన్నావు! కూలిచేసుకోలేవూ? గుడ్డివాడివైతే ఎట్లా కనపడుతున్నాను?" అన్నాడు.

"మసగ్గా కనపడుద్ది, బాబా!" అన్నాడు గుడ్డి.

హనుమంతరావు ధుమధుమ లాడుతూనే వాడిచేతులో ఒక అణా పడేసి "ఫో." అన్నాడు.

"పాపం! వాడు చాలా మంచివాడే! వాణ్ణెందుకు చంపటం? మాన్ ఇన్ బ్లాక్ అని చదవలా?" అన్నాడు దీనంగా గోవిందం.

"నీకు సిగ్గులేదుట్రా? నువ్వేంకొజ్జావా? నిన్ను—"

"నీయిష్టం వచ్చినట్టేడు! నాకేమీ అభ్యంతరం లేదు. న్యాయం చెప్పాను. వినలేదు. పోనీ! వేజెండ్ల లోపల వీడు చచ్చినవాడే!"

"అట్లా అను ఇంకా—"

"చాల్లే!"

సంగంజాగర్లమూడిలో రైలాగకముందే గుడ్డివాడు మాయమైనాడు. హనుమంతరావు ఒకబల్లమీద కాళ్ళుచాచుకుని పడుకున్నాడు- ఈసారైనా ఇద్దరూ ఒంటరిగా ప్రయాణించేసే యోగ్యత కలగలేదు. ఒక పల్లెటూరి కుర్రవాడు ఆపెట్టెలో ఎక్కి తలుపుతెరచి చుట్టకాలుస్తూ నిలబడ్డాడు. రైలుసాగింది.

అయిదునిమిషాలకాలం గడిచింది. పల్లెటూరి కుర్రవాడు చుట్ట అవతలపారేసి, హనుమంతరావు దగ్గిరకొచ్చి "లెగవయ్యా! పగ తేంపడక?" అన్నాడు.

"నన్నుచూస్తే నీకెందుకంత ఆపేక్ష?" అన్నాడు హనుమంతరావు.

"ఇంకెవ్వరూ కూకోక్కర్లేదేం? లెగో?"

"అట్లా కూర్చుందూ!"

"నేను కిరికిటీకాడ కూకోవాలి."

"అయితే నేను కిటికిటీకాడ తొంగోవాలి."

"సాల్లే. లెగు"

"నే లెగవలేను."

"లెక్కపోతే లెగదీత్తారు!" అంటూ ఆ కుర్రవాడు హనుమంతరావు చెయ్యిపట్టుకున్నాడు. మరుక్షణంలో



ఏం జరిగిందో వివరంగా గోవిందరావు చూడలేదు. దభాలున చప్పుడయింది. పల్లెటూరి కుర్రవాడు విసురుగా వెళ్ళి ఒకమూల దభాలున పడ్డాడు. చొక్కా చేతులు కిందికి దింపుతున్నట్టు నటించి హనుమంతరావు మళ్ళీ నడుం వాల్చాడు.

మూలనించి ఏకోశబ్దం వినపడ్డది.

"ఈసారి నా ఊశొత్తితే ఆసుపత్రేగతి!" అంతా నిశ్శబ్దం, గుంటూరుబండి హోరుతప్ప.

వేజెండ్ల స్టేషనులో కుర్రవాడు ఇంకో పెట్టె చూసుకున్నాడు. గోవిందం హనుమంతరావూ ఉన్న పెట్టెలో ఇంకో రెక్కుండానే బండిసాగింది.

"ఇదే సమయం!" అంది అంతరాత్మ.

గోవిందరావు ధైర్యం యావత్తూ చిక్కబట్టి, "వీలు పడదు!" అన్నాడు.

"ఏమిటీ?" అన్న దంతరాత్మ నిర్ఘాంతపోయి.

"వల్లకాదు!"

"ఓరి పిరికీ—"

"నో రు ము య్!"

*  *

"అన్నట్టు, ఉదయం మీయింటి కొచ్చానురా! అవసరమైన పనుండి నీ భార్య ఉన్నది చూడక గదిలోకి వెళ్ళాను. అవిణ్ణి చూడగానే గాభరాపడి బయటపడ్డాను."

గోవిందరావు కొక్కసారిగా ఎగరటం చాతయినట్టయింది. తక్షణమే హనుమంతరావు మెడమీదపడి అతని గొంతు చొంపటూ ఎందుకు ముద్దుపెట్టుకోలేదో గోవిందరా విప్పటికీ చెప్పలేదు.

'అట్లాగుటూ? ఏది? నువ్వొచ్చిన పనేదో చెప్పకురా!"

ఇంకొకసారి అంతరాత్మ చెప్పినమాటలు వింటే ఛండాలుణ్ణే ననుకున్నాడు గోవిందం.

—కొడవటిగంటి కుటుంబరావు

# కార్తికస్నాత

ఇట సౌందర్యపురేఖఁ బెంచికొనె తల్లీ? కార్తికస్నానసం
ఘటకోత్పుంజితశీతకంబు ముదుతల్ గల్గింప నీరంధ్రమై
కుటిలాలోలపరీమళత్ భ్రమరముల్ గోరాడు విస్తారపుం
నిటలం బాంధ్రసతీగతైకపతివత్నీదీక్షకుం తానమై.

జిలుగుం మ్రుగ్గులలోని యల్లిక లవిచ్ఛిన్నంబులై నూటిరే
ఖలకుంబోలె మదక్షియుగ్మమునకుం గల్గించు సొంపెట్టిదే
శిలనుం గల్గదు వేయికంబముల శాలానిర్మితింబూను శి
ల్పుల కాచార్యత సేయు నీకు పెరతల్లుల్ తుల్యలే యన్నరో?

పసుపుంబిష్టము మున్నుగాఁగలుగు సంబారమ్ములం బత్తి పెం
పెసగం దీర్చిన రంగవల్లికలలో నీవుంచుదీపంబు లాం
ధ్రసతీ! తన్నరకాసురప్రథనసత్యాజ్ఞాపితానీకపా
లసముద్భాసితశౌరతానలశిఖారాజిం దలంపించెడిన్.

ఒకనాడు జానకి యుభయవంశంబులు తనరారుటకు నోచికొనిన నోము
ఒకనాడు ద్రుపదజ ప్రకటాత్మరాజ్యంబు నార్జించుటకు మ్రొక్కినట్టి మ్రొక్కు
ఒకనాడు సావిత్రి యూర్జితపతిభక్తి యలరించుటకు జేసినట్టి సేవ
ఒకనాడు రుక్మిణి యకలంకకీర్తిఁ గైకొనుటకై పెల్లు వాకొనిన నుతులు
నీదువ్రతదీక్షలోన జీర్ణించి తల్లి! తత్ఫలావాప్తి హస్తగతంబు సేయ
నెదురుకోలిచ్చువిధము నీవెరుగవేమొ, కాంచుదుం నేను కన్నులఁగట్టినట్లు

ఆరాధనస్థలం బఘువర్జితమ్ముగా సంవరించిన ప్రవాహంబువలన
నుమపురాతనమైన నుతికినై శృతిగొల్పు, శరళాంబుగతనినాదంబువలన
పూజావిధికి తగ్గిపోఁజూచి నిండించు నుక్షిప్తబిందుసముత్కరమున
నీరోడునలకల నారుచు వడిగాలి నడనాపు చల్లదనంబువలన
నాకు తెలిసెపో నీకు కృష్ణాస్రవంతి కెట్టిదో సే నెరుంగని చుట్టఱికము
కలదు లే పూర్వజన్మానుగతపువలపు ఎంతచరితార్థ కృష్ణాస్రవంతి, తల్లి?

తెలినారచీరచెంగులు పసందుగదిద్దు, నారపుబిగింపు సొంపొదవజేయ
చిలుకపచ్చనిపట్టు జిలుగుకూర్పాసకం, బంసమందున పసలలరజేయ
పసరుంబసుపు నిగ్గు బాయని నెమ్మోము కుంకుమబొట్టునం గులకరింప
పసిడిచెక్కడపు పావడదోయినించులగమి పదంబులనంటి కొమరుపెంప

కేల నొకపూలపాత్రను లీలదాల్చి కనకదుర్గాలయంపుమార్గమున నేగు
నీదుపావనమూర్తి నేనొనర్తు వినతశతములఁ గొనుమమ్మ తెనుగుతల్లి!

—కొండపల్లి గోపాలరావు, హరి రామలింగశాస్త్రి.

# అధ్యక్షుడు పటేలు : కొన్ని కతలు

## జమాదారుడా? అధ్యక్షుడా?

అవి పటేలు మహాశయుడు అసెంబ్లీసభకు అధ్యక్షుడుగా నున్నదినములు. అమెరికనుదంపతులు అసెంబ్లీ సభామందిరమును చూడవచ్చిరి. ఆదంపతుల విజిటింగు కార్డును ఒకానొకరుతెచ్చి పటేలున కిచ్చిరి. తోడనే పటేలు ఆదరపూర్వకముగ ఆదంపతులను వెంటగొని సభామందిరము నలుమూలలు వారికి చూపెను. అధ్యక్ష పీఠమున వారిని కూర్చుండనిచ్చెను. వారా పీఠమున కూర్చుండియుండ తాను వినయపూర్వకముగ వారికి సలాముచేసెను. అందుమీద ఆ అమెరికనుదంపతులు అధ్యక్షుడగు పటేలును సాధారణుడగు జమాదారుగ భావించి ఆతనికి నేమానుక్రింద కొన్ని చిల్లరనాణెముల ఈయబోయిరి. కాని పటేలు స్వీకరింపలేదు. ప్రక్కనున్న స్నేహితుని వారికి మిగిలిన తావులుచూపి తన ఛేంబరులోనికి తీసికొనివచ్చునట్లు ఆదేశించి పటేలు అచటనుండి నిష్క్రమించెను. తిరిగి అమెరికనుదంపతులువచ్చి తాము జమాదారు అనుకొన్న ఆతడు ఉన్నతాసనమధిష్ఠించియుండుటకు ఆశ్చర్యచకితులై తామాతనికి చిల్లరనాణెము లీయబోయిన అవజ్ఞతను మన్నింపవలసినదిగా పరిపరివిధముల ప్రార్థించిరి.

## ఈశ్వరాదేశముకోరిన అధ్యక్షుడు

భగవత్సింగుబాంబు అసెంబ్లీసభలో పడినదినములు. అధ్యక్షుని హక్కులనుగూర్చి ప్రభుత్వమునకును, పటేలునకును అభిప్రాయభేదములుపుట్టి రవరవలుగా నుండెను. చరిత్రప్రసిద్ధినందిన పటేలు ఉపన్యాసమునకు పూర్వదినము. పలువురునాయకులు ఆతనిని సందర్శించి తమరు ఏవిధమున వర్తింతురని ప్రశ్నించిరి. అప్పటికంతయు తయారుగనే యుండెను కాని పటేలు "నాకు తెలియదు. అంతయును భగవంతునిపై భారమువైచియున్నాను. ఆతడు నాకు మార్గము చూపునుగాక!" అని బదులిడెను.

## గుజరాతీలో మాటలాడినపుడు:

పటేలు అధ్యక్షపదవికి రాజీనామా ఇచ్చి బొంబాయికివచ్చిన క్రొత్తలో అజదుమైదానమున నొక ప్రత్యేకసభ జరుపబడెను. ఆ సభలో పటేలు ఇంగ్లీషులో ఉపన్యసింపబోరకొనెను. చెంత కూర్చుండియున్న స్నేహితుడొకడు 'పటేల్! ఇది బహిరంగసభ కాని అసెంబ్లీసభ కాదు. గుజరాతీలో మాటలాడుము' అనెను. అందుమీద వెంటనే గుజరాతీభాషలో ఉపన్యసింపనారంభించి పటేలు ఇట్లు చెప్పెను. "బొంబాయిప్రజలు స్వాతంత్ర్యముపొందుటకు అర్హులని నేనింతవఱకు నమ్మలేదు. వారి దౌర్జన్యరాహిత్యమునకు నేడొకచక్కని నిదర్శనము దొరకినది. నేను ఇంగ్లీషులో మాటలాడుచుండగా మీరు శాంతముగా వినిరి. కాని పరభాషలో మాటాడినందుకు బుస్సను ధ్వనులు చేయలేదు. ప్రభుత్వమువారి చేతులనుండి అధికారభీనమును లాగికొనుటకు ప్రజలు సంసిద్ధులైయున్నారను సంగతి వారు గ్రహింతురుగాక!"

## "స్వరాజ్యమునకు చేరువపడుదుము."


అధ్యక్షపదవికి రాజీనామాయిచ్చిన క్రొత్తలో ఆతడొకసారి జిన్నాహాలులో ఉపన్యసించెను. ఆఉపన్యాసమునంతను ఒకడు నోట్సుతీసికొని కాంగ్రెసు బులెటినుకు ఆ ఉపన్యాసమొకఅనుబంధముగా సైక్లోస్టైయిల్ మెషినుపై తయారుచేసెను. సభ ముగియులోపల ఆ పత్రిక కాపీయొకటి పటేలున కందీయబడెను. "ఇంతటి శీఘ్రముగ పనులగుచో మనము స్వరాజ్యమునకు చేరువపడినట్లే" అని ఆతడనెను.

## హరిజనుల నడుమ.

అది 1916 వ సంవత్సరము. గోధ్రాలో హరిజన సంఘసభ జరుగుచుండెను. మహాత్ముడచటికివచ్చెను. "హరిజనోద్యమము విషయమై మీరు నిజముగా పట్టుదలగానుండుచో మీరందఱును హరిజనగూడెమునకు రండు" అని గాంధి అనెను. గాంధి హరిజనగూడెమునకు పోయినపుడు ముందు కనిపించినదెవరు? సాధారణమైన దుస్తులతో, సాధువునిటోపీతో పటేలు. అప్పటికాతడు శాసనసభలో సభ్యుడు.

## 3

జూలై మాసపు 'ఆంధ్రభూమి'లో చేతి యందలి వివిధ రేఖలను, గ్రహస్థానములను రూపించి చెప్పుచు హస్తసాముద్రికశాస్త్రమునందలి సాధారణవిషయములను వివరించియుంటిమి. ఆగష్టుమాసపు సంచికలో వివిధస్థానములనుబట్టి చేయదగు స్వభావ నిరూపణమును కూడినంత విపులముగ చర్చించియుంటిమి. ఇక రేఖలు, వాని నిర్మాణము, వానినిబట్టి చేయదగు స్వభావనిరూపణము వివరింపవలసియున్నది. ఈమీద చెప్పబోవు విషయములను సులభముగ గ్రహింపగలుగుటకు మొదటి వ్యాసమును (అనగా జూలైమాసమున ప్రచురింపబడిన దానిని) మఱియొకసారి చదువవలసినదిగా పాఠకులను కోరుచున్నాము. హస్తమునందలి వివిధ రేఖలను, వివిధస్థానములను మఱియొకసారి జ్ఞప్తికెలయించుకొనుడు. హస్తమునందు వివిధ రేఖలలో ప్రస్తుతము 'శిరోరేఖ'ను గూర్చి విస్తరింతుము.




చిత్రము 1.

## శిరోరేఖ

### శిరోరేఖనిర్మాణము

శిరోరేఖ విశాలముగ ఉన్నప్పటికంటె సన్నముగాను, లోతుగాను ఉన్నయెడల మనోద్రఢిమను, ధీశక్తిని సూచించును. ఇట్టి


రేఖ కలిగియుండువారు నిస్సంశయముగా మనస్సుతో పరిశ్రమ చేయువారు (బ్రెయిన్ వర్కర్సు) అగుచున్నారు. ఈరేఖ వెడల్పుగాను, మెరకగాను ఉండుచో నిలుకడలేని బుద్ధిని, ఏకాగ్రతలేని మనస్సును తెలుపును. శిరోరేఖ నిర్మాణమున ఖండఖండములై యున్నను, ద్వీపములుకలిగియున్నను స్పష్టముగా లేకున్నను ఆవ్యక్తి శిరోవ్యాధులచే బాధితుడగుటయేగాక ఆతడు ఎంతమాత్రమును మనస్సుతో పరిశ్రమ చేయగలవాడు కాజాలడు.

## ఉత్పత్తిస్థానము ౧.

సర్వసాధారణముగ శిరోరేఖ చూపుడు వ్రేలిక్రిందిభాగమునకును, బొటనవ్రేలి ఎగువభాగమునకును నడుమను అనగా గురుని స్థానమునకు దిగువను కుజుని దిగువస్థానమునకు మీదుగను ప్రారంభమై అరచేతికి అడ్డముగ చంద్రస్థానమునకుగాని కుజుని పైస్థానమునకుగాని పోవుచుండును. ఇట్లుగాక జీవరేఖకు దిగువభాగమునుండి (చిత్రము ౧. నెంబరు 1.) అనగా కుజుని దిగువస్థానమునుండి ఈరేఖ బయలు వెడలుచున్నచో ఆ వ్యక్తి అతిసున్నితస్వభావుడును, శీఘ్రకోపియునగును. శీఘ్రకోపియగుటచే ఇరుగుపొరుగువారితో పోట్లాడును; స్వల్పవిషయములందు కలహించును. ఈవ్యక్తి సభాకంపము గలిగి ధైర్యహీనుడై యుండును. కంపనశీలుండగుటచే అస్థిరుడును, చపలుడును అగును.

పైవిధముగ బయలువెడలుచు ఈరేఖ అరచేతికి అడ్డముగ తిన్ననిగీటువలె కుజుని లోస్థానమునకు (చిత్రము ౧. నెంబరు 1-4) సాగియున్నయెడల ఆవ్యక్తి తనకు దాదాపు ఇరువది సంవత్సరములు వచ్చువఱకు పైచెప్పిన గుణములనుకలిగి ఆ పిమ్మట మనోనిగ్రహమునుబడసి జీవితమున కృతార్థుడగుచున్నాడు.

పైవిధముగనే ప్రారంభమగుచు ఈరేఖ చంద్రస్థానము మధ్యకుగాని దాని దిగువకుగాని వ్యాపించినచో (చిత్రము ౧. నెంబరు 1-5) ఆవ్యక్తి తనకుపుట్టుకతో కలిగిన అన్ని దోషములు యావజ్జీవము కలిగియుండును. యోచనాశక్తిని తెలుపు ఈదీర్ఘమైన రేఖ తనకున్న దుర్లక్షణములను పోగొట్టుటకు బదులుగా వానిని మఱింత పెంచును.



చిత్రము 2. 1-1. జీవ, 2-2. శిరో, 3-3. హృదయ, 4-4. అదృష్ట, 5-5. సూర్య, 6-6 కుజ, 7-7. ఆరోగ్య, 8-8. వివాహ, 9-9. శుక్రుని వక్రరేఖలు.

పైవిధముగనే బయలువెడలుచు ఈరేఖ (చిత్రము ౧. నెంబరు 1-6) తుదిభాగము హృదయరేఖవైపునకు వంగినచో ఆవ్యక్తి ఉద్రిక్తభావము దుష్టచేష్టితములను, సాహసములను చేయ ప్రోత్సహింపవచ్చును. చేయిచెడ్డదై యుండుచో ఈ ఫలము నిశ్చయముగనగును.

# కోర్టులో కాంతం

## ౧

ఇంటికి వచ్చాను. కోర్టైనా విడవలేదు. నలుగురు పిల్లలూ కమ్ముకున్నారు. ఒక్కసారిగా, "అమ్మకొట్టింది నాన్నా" అని చిన్నదీ, "అమ్మకొత్తింది" అని దాని తరువాత పుట్టిన నాలుగేండ్ల మొగపిల్లవాడు, "అమ్మ. ఊమ్ - ఊమె ము, అ" అని వాడితమ్ముడు రెండేండ్ల వెధవ అనటమేకాకుండ ఆ పసిముండకూడా చేతులెత్తి ఏదో పెద్ద ఫిర్యాదు చేసేదానిలాగ బొబ్బలు పెట్టటం సాగించింది.

నేను గుమ్మంలో కాలుపెట్టటంతోనే ఒక్కపెట్టున అందరూ ఇల్లా కంప్లెంటులు దాఖలుచేసేసరికి నాకు గుండె గుభేలుమన్నది. రోజూ ఈ నాటకం మామూలే అయినా పది నిమిషాలలో పని తెముల్చుకొని వైవత్తరీయంతో బైటపడటానికి అవకాశం ఉండేది. ఆ రోజున అట్లా వీలులేదు. "ఫైలు ఎక్కువైందిరా భగవంతుడా" అనికొని, బడిపంతులు వేషాన్ని మార్చి, మేడపైకివెళ్లి దండుకు జేరగిలబడి చిరిచాపపైన కూర్చున్నాను.

అది మా కోర్టు. నేనే న్యాయమూర్తిని. న్యాయమూర్తినేకాదు. నేను సామ్రాట్టును. చక్రవర్తిని. నా ఆజ్ఞను తిరస్కరించేవాళ్ళు లేరు. నిరంకుశాధికారం చెలాయించే మహాప్రభువును. నారాజ్యము ప్రేమ రాజ్యము అల్లాంటిది. సమయంలో ఇటువంటి భావాలే నాజీవితాన్ని మధురంగా జేసేవి. మిగిలిన జీవితమంతా బానిసజీవితమే. అయితే జీవితంలో అల్లాంటి ఒక్క నిమిషానికి ఇరవైఏండ్ల సామాన్యజీవితానికున్న దానికంటె ఎక్కువ విలువ ఉన్నది.

ఊహతోకూడిన ఈ మాధుర్యాన్ని వదలిపెట్టి అసలు విషయానికొస్తే ఈ చక్రవర్తి చిరిచాపమీద కూర్చున్నాడేమాలంటే అనొచ్చు. మొగల్ చక్రవర్తులు అల్లాగే కూర్చునేవారని నా సమాధానం. అయితే వాళ్ళు రత్నకంబళములపై పట్టుపరుపులపై కూర్చున్నారు. నేనేమో ఈ చినిగిపోయిన చిరుచాపమీద కూర్చున్నాను.

ఈ న్యాయాధికారివళ్ళో ఎడపిల్లవాడు కూర్చున్నాడు. ఒకప్రక్కన చిన్నఅమ్మాయి కూర్చున్నది. వెనకాల పాలుతాగేది చేరి ఈ చక్రవర్తి నెత్తిమీద తన చిన్న చేతులతో దరవులాగ కొటుతున్నది. చేతులో వెండి గ్లాసుతో కాఫీ పట్టుకొని ముద్దాయి నిలువబడ్డది కోర్టువారి ఎదుట. గ్లాసు అందుకొని కాఫీతాగేశాను.




చిన్నది ఏడుస్తూనే ఉంది ఇంత సేపూ. "ఏమిటే అమ్మా." అని న్యాయ విచారణకు ఉపక్రమించాను.

ఈమాట వినేసరికి అందరికీ ఒక్కసారి మళ్ళీ దుఃఖంవచ్చింది. కాస్త ఊరుకోండని అందరిని ఊరకోబెట్టాను. పెద్దది దుఃఖాన్ని దిగమ్రింగి బుద్ధిమూతి పెట్టుకొని కొంచెం దూరంగా కూర్చుంది. చూస్తే ఏదో అందరికి తలానాలుగూ తగిలినట్లున్నవి. ముద్దాయి శాస్త్రరీతిగానే పాలుతాగేదాన్ని ఎత్తుకొని కోర్టువారిఎదుట నిలువబడి ఉన్నది. "ఎందుకు కొట్టిందే అమ్మనిన్ను" అని అడిగాను చిన్నదాన్ని.


“ఇవ్వాళ ఏంజేసిందో కనుక్కోండి” అన్నది ముద్దాయి.

“నీవు ఇప్పుడు మాట్లాడరాదు. ఫిర్యాది చెప్పేది అంతా ముందువినాలె. తరువాత నీ సంగతి” అని నేనన్నా కోర్టువారికుండే సహజమైన అధికారగర్వంతో.

‘అదికాదు నాన్నా, నేనే, మరే, నేనే మల్లెపూలు కొనమన్నా నాన్నా......”అని కొంచెం ఆగింది దుఃఖంచేత మాటరాక. “చెప్పూ, కొనమనటం ఏమీ తప్పులేదు. అట్లా అనటానికి నీకు సర్వహక్కులూ ఉన్నాయి. ఊఁ - అంటే” అన్నాను నేను.

“కొనమంటే కొనలేదు నాన్నా” అని అది పూర్తి జేసింది.

ఫిర్యాదు విన్నతరువాత ఇది క్రిమినల్ కేసా, సివిల్ కేసా అని నాకు సందేహం కలిగింది. పూలు ఆస్తే



కాబట్టి ఇది ఆస్తికి సంబంధించిన విషయంగా నిశ్చయించి సివిల్ లా ప్రకారం విచారించాలని తేల్చుకొన్నాను. ఆపళంగా, ముద్దాయి వంకతిరిగి “ఏమి! నీవు పూలు ఎందుకు కొనకపోవాలె? పిల్లల పూలకోసమని జీతంవచ్చినపుడు ప్రత్యేకంగా తీసి ఇచ్చిన రూపాయి ఏంజేశావు?” అని కొంచెము బొంగురుగొంతుకతో తీవిగా అనేశాను.

వాళ్ళమ్మను కోప్పడుతున్నానని మా అమ్మాయి అనుకొంది కాబోలు కొంచెం ధైర్యంగా “కొని ఇయ్యకపోతే నేను ఏడ్చాను నాన్నా” అన్నది. “పెర్ఫెక్ట్లి రైట్, నీ తప్పు ఏమీలేదు.” అని అది ఇంకేదో చెప్పబోతుంటే ఉండమ్మా ఇంతవరకు విచారిస్తాను అన్నాను.

న్యాయవిచారణలో సాక్షులు కావాలె. సాక్ష్యం క్రింద మా పెద్దఅమ్మాయిని తీసుకొన్నా—“ఏమే, అమ్మా! పూలుకొనమంటే అమ్మకొననిమాట నిజమేనటే” అన్నాను—“కొనలేదు నాన్నా” అని అది గట్టిగా అనేసింది.

అప్పుడు ముద్దాయి వైపుతిరిగి—“విన్నావుగదా, నీ మీద పెట్టబడినకేసు. బలమైన సాక్ష్యంకూడా, చదువుకొన్న (మా పెద్ద అమ్మాయి మూడోక్లాసు) లేడీ వలన నీకు వ్యతిరేకంగా ఉంది. ఏం జెపుతావు” అన్నాను, ప్రతిమాటాకూడా న్యాయమూర్తికి ఉచితమైన నొక్కుతో ఉచ్చరిస్తూ.

ముద్దాయి జవాబు ఇయ్యక నవ్వింది. “నవ్వటం పనికిరాదు. ఆట్టే నవ్వితివా అంటే కంటెంప్టు ఆఫ్ కోర్టు క్రింద నీకు శిక్షను ఎక్కువ చేస్తాను. పూలుకొని పెట్టకపోవటం నిజమా కాదా చెప్పు,” అని కొంచెంగర్జించాను.

“కొనిపెట్టకపోతే ఏంజేసిందో కనుక్కోండి” అని పెంకె జవాబు చెప్పింది. “అది వేరేసంగతి. తప్పు నీదని ఒప్పుకుంటావా?” అన్నాను.

“డబ్బులేక కొనలేదు” అని ముద్దాయి జవాబు విని నేను కొంచెం కోపంతెచ్చుకొని “నీకిచ్చిన డబ్బు ఏం జేశావు. ఆ రూపాయిపెట్టి అప్పుడే పూలుకొనేశావా?” అన్నాను, నిజంగా కోపంవచ్చినవాడిలా

“ఏదో జేశాను. పోనీ కొనలేదు. ఇప్పుడేం”—అన్నది ఈ కోర్టులో ముద్దాయిగా నుంచున్న కాంతం—చాల్లే సరిగా జవాబులు చెప్పు. అని కాంతంతో పిల్లలు వినకుండా ప్రైవేట్ కెపాసిటీలో అని, ప్రకాశంగా “నువ్వు అట్టే మాట్లాడకు. పిల్లలు పూలుకొనమంటే కొనకపోవటం తప్పు నీది. నిన్ను కన్విక్టు చేసినాను. అన్నాను.

“ఏడిస్తే కొట్టింది నాన్నా” అని మాఅమ్మాయి తల్లి మీద నేరాలు కుప్పలు కుప్పలుగా పడేయటం సాగించింది.

“ఆ,! ఆ!, తప్పుడుదానా, ఎందుకు కొట్టానే ఆ సంగతి చెప్పవేం” అన్నది కోపంగా కాంతం. పిల్ల మాట్లాడలేదు.

## ౨

మాకోర్టులో సంగతేమిటంటే మౌనము, నేరము చేసినట్లు అంగీకారసూచకము. కాబట్టి ఇదేదో చేస్తేనే వాళ్ళమ్మ కొట్టినట్లు స్పష్టము. ఇప్పుడు తల్లి ఫిర్యాది, కూతురు ముద్దాయి అయింది.

ఇపుడు నేను ముద్దాయితో, ‘ఏంజేశావే అమ్మా’ అన్నాను. మళ్ళా మాట్లాడలేదు చిన్నది.

“చూశారా! భడవా! మాట్లాడదు! దొంగ,! పరమ దొంగ! మాట్లాడదు!” అన్నది కాంతం.

“నీవు వూరికే తిట్టకు. అది వేరే నేరమవుతుంది. సంగతేమిటో చెప్పు” అన్నాను నేను విసుగుతో.

“ఏముంది? దీన్ని ముందుగదిలోపెట్టి బైటగొళ్ళెం పెట్టాను. తరువాత * * *”

“ఆగు ఆగు. నిన్ను గదిలోపెట్టి గొళ్ళెంపెట్టింది. అమ్మా” అన్నాను, “బైట గొళ్ళెం వేసింది నాన్నా” అని అది ఏడ్చింది.

“ఎందుకట్లా చేశావు?” అని నేను ప్రశ్నించాను.

“ఏం జేయమంటారు? పూలుకొనమని ఎగిరి నానా గోలాచేసి, పీకిచంపుతుంటే ఏంజేసేది? అసలు సంగతి వినరేం?” అన్నది కాంతం.

“వింటూ నుండు. ఒక్కొక్కపాయింటే విచారించి తీర్పుఇస్తా” నన్నాను.

“తీర్పూ, జడ్జిమెంటూనూ, అవతల పనుంది. వెళ్ళిపోవాలె. మీకేమి?” అన్నది కాంతం.

“పోవటానికి వీలులేదు. కంటెంప్టు ఆఫ్ కోర్టుక్రింద ఛార్జి చేస్తాను. జాగ్రత్త: చివరదాకా అట్లానుండు. అయితే పిల్లను గదిలో పెట్టిగొళ్ళెం ఎందుకు వేశావు? అట్లా వేయటంతప్పు ఈ నేరాన్ని ఇంగ్లీషులో రాంగుఫుల్ కన్ఫైన్మెంటు అంటారు. దీనికిశిక్ష, జరినామా ఆనెక చెపుతాను. కానీ నీవు చెప్పేదేమిటో చెప్పు” అన్నాను.

“అట్లా దాన్ని గదిలోపెట్టి గొళ్ళెంవేసి,చిన్నవాడు వంటఇంట్లో ఆడుకొంటూఉంటే వదిలేసి—పసిదానికి నీళ్ళుపోయటానికి దొడ్లోకివెళ్ళాను. కాసేపుండి ఇట్లా వచ్చి చూద్దునుగదా ఆ చిన్నవెధవ ఉడుకుతూ ఉడుకుతూ ఉన్న అన్నంలో బొగ్గులూ కచ్చికలూ పడేస్తున్నాడు. తవ్వెడుబియ్యపు అన్నం దగ్ధమైపోయింది. వాడ్ని నాలుగు బాదాను. ఇంతలో అబ్బాయి కవ్వున కేకేశాడు. ఇట్లాబోయి చూద్దునుగదా, హాలులో పిల్లలందరూ గంతులేస్తూ గోలచేస్తున్నారు. విడిచి పడేసిపోయిన చీరఒకటి భగ్గునమండిపోతున్నది. ఇల్లు తగలడిపోయేది. ఎంతగోలో చూశారా? ఆపళంగా నేను నలుగురినీ నాలుగేశాను. అదిగో, ఆ చిన్నదే ఇంతపనిజేసింది. దాన్ని వళ్ళు పగలగొట్టాను. కాస్త పెద్దదాన్ని అయినానని అయినా జ్ఞానంలేకుండా వీళ్ళతో కలిసినందుకు ఆ పెద్దదాన్ని రెండు ఉతికాను. బట్టలు ఎందుకు తగలబెట్టిందో కనుక్కోండి ఆ చిన్నదాన్ని” అన్నది కాంతం.

“ఏమే అమ్మాయి” అంటే ఆ చిన్నది బెల్లంకొట్టిన రాయిలాగ ఊరుకొన్నది.

సరే చిన్నది ఏదోచేసిందని తేలింది. అయితే ఇల్లు తగలబెట్టాలని పిల్లల ఉద్దేశంకాదు. కాబట్టి నేరంలో ఉండే సగంబలం తగ్గింది. అమ్మాయిని “అయితే, అసలు నిప్పుపుల్ల ఎక్కడిదే? ఎవరు గీశారు? ఎవరు ముట్టించారు.” అని అడిగాను.

‘తమ్ముడు తెచ్చాడు నాన్నా’ అన్నది అమ్మాయి.

‘నిన్ను బైటకు తీసిందెవరు?”

'అక్కయ్య గొళ్ళెంతీసి, డబ్బునరావే, అమ్మలేదు' అన్నది.

'నిప్పుపుల్ల గీచిందెవరు?'

'నేనే నాన్న, ఊరికేనేగీచి అక్కడ పారేశా నాన్నా.'

'ఊరికేగీచి ఎక్కడ పారేశావు? చీరమీదా?'

'కాదు నాన్న. అక్కడే పారేశాను.'

'అక్కడ పారేస్తే, చీర ఎట్లా అంటుకుంది?'

'ఏమో నాన్న'

'మరి చీర ఎట్లా అంటుకుందే?'

'ఏమో, అదంతట అదే అంటుకుంది'

## 3

ఇట్లా ప్రశ్నోత్తరాలు జరిగినయి. ఇప్పుడు చిన్నది నేరస్తురాలా కాదా అని సందేహం. నిప్పుపుల్ల గీచి వేయటం చీర తగులబడటానికి కారణంలాగ కనబడు తున్నా, అదేకారణం అని మనం నిశ్చయించకూడదు. కాబట్టి చిన్నది నేరస్తురాలని స్పష్టంగా నిశ్చయించ లేము. కాబట్టి పిల్లలు నేరమేమియు చేయలేదనే కోర్టువారి అభిప్రాయం.

ఇక తల్లిసంగతి. నిప్పుపుల్లలపెట్టె చేతిలో ఉండటం మూలాన అదే ఇంత పనిచేసి ఉంటుందని తల్లి అభి ప్రాయపడి వాళ్ళను తలానాలుగు కొట్టటం ఎస్సాల్ట్ నేరము క్రిందికి వస్తుంది. వాళ్ళు ఏడ్చి నానాగోల చేసి ఉంటారు. అపుడు బ్రీచ్ ఆఫ్ డొమెస్టిక్ పీస్ జరిగింది. ఇదివరకే ముద్దాయిలైన నీపై రాంగ్ ఫుల్ కన్ ఫైన్ మెంట్ కేసు ఉంది. పిల్లలకు పూలకోసం ఇచ్చిన డబ్బును అపహరించావు. అదీకాక నీవు ఇటు వంటి నేరములను తరచూ చేస్తూఉండే ఓల్డ్ అఫెం డర్ కాబట్టిన్నీ, చేసిననేరాలన్నీ కలిపి కన్ సాలి డేటెడ్ స్టేట్ మెంట్ ఒకటి తయారుజేసి తగిన శిక్షను అనుభవించటానికై నిన్ను సెషన్సుకు కమిట్ చేస్తు న్నాను. సెషన్సు కోర్టుకు నీవుమాత్రం రావాలె. పిల్లలు రానక్కరలేదు. వారి విషయమై ఉన్న రికార్డు చాలు. అని తీర్పుజెప్పాను,

ఇక మాటలురాని ఇద్దరు పసిపిల్లలకేసులు ఉండిపో యినాయి. అయితే పసిదానికి పాలు, ఎడబిడ్డకు పిప్పర మెంటుబిళ్ళలూ దొరకటంచేత వాళ్ళు రాజీపడి తల్లి దగ్గరచేరారు. కాబట్టి కోర్టువారికి చేసేది ఏమీ లేక పోయింది.

## ౪

'రండర్రా - అన్నాలు పెడతాను అన్నది కాంతం' అప్పటికి పూర్తిగా చీకటిపడటంచేత. ఆరోజు జీలకర్ర వేసి కందిపచ్చడినూరి ఉంచటంచేత పిల్లలు ఎప్పుడు అన్నంతిందామా అని చూస్తున్నారు. ఈ మాట వినటం తోనే ఒక్క సారిలేచి తల్లివెంట వెళ్ళిపోయినారు.

కోర్టువారు ఒక్కరే మిగిలిపోయినారు. ముందున్న బడిపంతులు తలగుడ్డ వెక్కిరిస్తూ బల్లమీద ఉంది. మాసినలాంగుకోటు వంకెనె వేలాడుతున్నది. కాఫీ తాగినతరువాత అక్కడపెట్టిన వెండిగ్లాసు అక్కడే ఉంది నిర్లక్ష్యంగా దొర్లుతూ. దూరాన మబ్బులలో నుంచి బాలచంద్రుడు వెకిలినవ్వులు నవ్వుతున్నాడు. పిల్లలను ఇంత అన్ డ్యుఇన్ ఫ్లూయన్స్ తో స్వాధీన పరచుకొని ప్రపంచంప్రకృతిఅంతా నన్నువెక్కిరించి నట్టు, హాస్యాస్పదమైన స్థితిలోకి నన్నుతీసికొచ్చి వదిలిపెట్టిన కాంతానికి సెషన్సులో కఠినశిక్ష విధించ మానను అని నిశ్చయించుకొన్నాను.

—మునిమాణిక్యం నరసింహారావు






గానలోలత్వము



నాగస్వరసాధన



భీతహారిణములు

# నోబెల్ వాఙ్మయ బహుమానములు

(౧) ౧౯౦౧ సంవత్సరము - ఫ్రాంసు.

### సుల్లీ ప్రూడ్‌హోం.

ఈ అంతర్జాతీయసాహిత్యమహాగౌరవమును బొందిన యీ ప్రథముడు ౧౮౩౯ లో జన్మించి ౧౯౦౭ సెప్టెంబరు ౭-వ తేదిని మరణించెను.

* 'వీరి కృతులందు నిండియున్న అద్భుతప్రతిభను, ముఖ్యముగ - ఉన్నతాదర్శము, కళాపూర్ణమైన పూర్ణత, ఉపజ్ఞల సమ్మేళనములకుగా' బహుమతి ఒసంగబడినది.

పుస్తకములు:—పరిక్ష, లాజస్టిస్ - ఇవి అతివ్యాప్తములైన పెద్ద పుస్తకములు. విక్టర్ హ్యూగోకు ద్వితీయుడుగా ఎన్నబడినాడు.

(౨) ౧౯౦౨—జర్మనీ.

### థియోడార్ మొంసెన్.

జననము ౧౮౧౭. మరణము ౧౯౦౩ నవంబరు ౧.

* 'చరిత్రను అభివర్ణించు శిల్పాచార్యులలో ప్రథమగణ్యుడు.' అగుటచే బహుమతిబడసినాడు.

'ప్రతివిద్యార్థియు తనకృషికి అనువైన ప్రత్యేకరంగమును ఎన్నుకొనవలయును కాని, దాని చరయందే బంధితుడు కాడు'—'చరితయొక్క ఐక్యత - క్రీస్తుకు పూర్వము ౧౮౦౦ నుండి ఇంతవరకు మానవప్రకృతియందు ఏకత' అనునవి వీరి నూతనసిద్ధాంతములు.

పుస్తకములు: ౧౦౦ సంపుటముల రోమకచరిత్ర.

(౩) ౧౯౦౩—నార్వే

### జోర్న్‌స్టెర్నె జోర్నసన్.

జననము ౧౮౩౨. మరణము ౧౯౧౦ ఏప్రెలు ౨౬.

* 'ఇతని మహోన్నత విభిన్నశిల్పమున భావావేశవినూత్నతగలిగి, అదే సమయమున అసాధారణముగ ఆత్మనిష్కల్మషత ప్రస్ఫుటముగ దీపించుచుండుటచే'

నవలారచయిత - నాటకకర్త - వక్త - ప్రచురణకర్త - నాట్యశాలాచార్యుడు - అగు నీతడు 'నార్వేజనకుడు' అను జాతీయగౌరవమును బొందినాడు.

నార్వేమహాకవి హెన్రిక్ ఇబ్సన్ యితని సహపాఠియైన ప్రతిపక్షి. వీరిమధ్య వాఙ్మయసమరకోలాహలము మెండుగనుండినది; తుదకు తన కూతురును ఇబ్సన్ కుమారునికిచ్చి పెండ్లిచేసినాడు.

పుస్తకములు:—'మానవశక్తికి అవల' 'ఎడిటరు' 'దివాలాకోరు' గొప్ప సమస్యలతోగూడిన నాటకములు; 'లెహోరెమస్' 'డాగ్లసెట్' పెద్ద నాటకములు. 'ఆర్నె' 'బెస్తపడుచు' 'అదృష్టవంతుడైన బాలుడు' లోనైనవి ప్రసిద్ధకథలు.

(౪) ౧౯౦౪—ఫ్రాంసు - స్పెయిను.

### [అ] ఫ్రాంసు - ఫ్రెడరిక్ మిస్ట్రాల్.

జననము ౧౮౩౦. మరణము ౨౫-౩-౧౯౧౪.

* 'వీరిది వినూత్నమైన స్వకపోలకల్పనాశక్తి, సారవంతమైన ఉపజ్ఞ. వీరికవితాశిల్పమున ప్రకృతియు, తన స్వజనజీవితమును సంపూర్ణముగ ప్రతిబింబించుచున్నవి. మరి తన స్వభాష జీర్ణముగాకుండ సల్పిన అపారకృషికి.'

పుస్తకములు:—'మిరియో' అను గ్రామ్యజీవనమహాకావ్యము ఉత్తమము. 'క్యాలెండాల్' మరియొక్క ప్రసిద్ధగ్రంథము.

### [ఆ] స్పెయిను-జోస్ ఎచెగరి.

జననము ౧౮౩౩. మరణము ౧౪ సెప్టెంబరు ౧౯౧౬.

* 'విశాలమును, విజ్ఞానమయమును, స్వతంత్రమునునైన వీరి రచనాశక్తి ఆత్మీయప్రత్యేకవిధానమున స్పెయిను నాటకకళయొక్క గొప్ప సాంప్రదాయములను మరల ఉజ్జీవింపజేసినందులకు' అభినందనపూర్వకముగ బహూకరింపబడినాడు.

పుస్తకములు:— 'గ్యాలియోటో ఘనుడు' అను బీభత్సవిషాదాంతనాటకము, 'డాన్‌జోన్ కుమారుడు' 'మేరియానా' అను నాటకములు సుప్రసిద్ధములు. 'ఎప్పుడూ అపహాస్యము' 'వీథిగాయకుడు' అనునవి చిన్న నాటకములు.

(౫) ౧౯౦౫—పోలాండు.

## హెన్రిక్ షీన్కీవి.

జననము ౧౮౪౬. మరణము ౧౬ నవంబరు ౧౯౧౬.

* 'చారిత్రకనవలల సృష్టించుటయందు వీరికిగల మహోజ్జ్వలశక్తికి.'

పుస్తకములు:—'ఖడ్గాగ్నులతో' 'జలప్రళయము' అను నవలలు ప్రసిద్ధములు. 'భూమిబిడ్డలు' అను విషాదగాథ ముఖ్యమైనది 'క్వోవాడిస్' 'అతనిని అనుసరింతము' 'హేనియా' 'జీవితవిషాదము' అనునవి వీరి అత్యుత్తమగ్రంథములు.

(౬) ౧౯౦౬—ఇటలీ.

## గిసోసూకార్డుకి.

జన ౧౮౩౫—మర. ౧౬-౨-౧౯౦౭.

* 'వీరివిశాలాగాధవిజ్ఞానము, హేతుపూర్ణపరిశోధనల ప్రతిభకేగాక, వీరి కృతులందు ప్రస్ఫుటముగ దీపించు కోమలసృష్టిశక్తికిని - శయ్యావినూత్నతకును, భావోద్దీపనబలమునకును' కానుకగా ఈ గౌరవమును బొందినాడు. విశ్వకళాపరిషత్తున ఆచార్యుడైన ఈతడు కర్షకకవి.

పుస్తకములు:—'సైతానుకు గీతము' అనునది ఒక్కదినములో ఈతనిని ప్రసిద్ధునిజేసినది. 'ఆదర్శము' 'తల్లి' అను కావ్యములు మంచివి.

(౭) ౧౯౦౭—ఇంగ్లండు (?)

## రడ్యార్డ్ కిప్లింగ్.

౧౮౬౫ లో బొంబాయిలో జన్మించినాడు. ౧౮-వ ఏడువరకు బొంబాయిలోనే విద్యనభ్యసించి, ఇంగ్లండునకుబోయి, అచటి విద్యార్థిసంఘమున మెలగలేక మరల జన్మదేశమగు భరతభూమికివచ్చి ౩౫-వ ఏడువరకు పత్రికావిలేఖరిగా, పాయినీరు-పత్రికా సహాయసంపాదకుడుగాఉండి ఇచటనే చాలకథల వ్రాసినాడు. వీటియందు జన్మదేశమును పరిహసించి తల్లి ఋణము దీర్చుకొన్నాడు యీ దొర. బహుమతి గౌరవము ఇండియాదా? ఇంగ్లండుదా?

ఈ గౌరవమునకు యీయన అర్హుడుగాదని ఇంగ్లీషువారిలోనే చాలమంది వాదింతురు. అందు సుప్రసిద్ధరచయిత ఎ. జి. గార్డినర్ ముఖ్యుడు.

* 'వీరికిగల విషయగ్రహణదక్షత, స్వకీయవినూత్నఊహాశక్తులకేగాక, యీ విఖ్యాతగ్రంథకర్త వ్రాతలందు ద్యోతకమగు దూరదృష్టి, అభివర్ణనశిల్ప సౌష్టవములకుగా' సత్కరింపబడినాడు.

పుస్తకములు:—హితోపదేశమునందలి కథలవలె మృగములకథలు. '౩౦' అను నవల అతివ్యాప్తము. కాని ఇది చాల పేలవముగానుండును.

(౮) ౧౯౦౮—జర్మని.

## రుడల్ఫ్ యుకెన్.

జననము—౧౮౪౬.

* "సత్యాన్వేషణమున వీరికిగల అకళంకవిశ్వాసము, విషయభేదకతాశక్తి, మానసికదృశ్యప్రస్ఫుటతలతో సర్వమానవజాతికి ఆదర్శమగు తత్త్వసిద్ధాంతముల నిర్మింపగలిగినందులకు.'

పుస్తకములు:—'ఆత్మజీవము' 'యతయథార్థము' అను తత్త్వగ్రంథములు ప్రసిద్ధములు.

(౯) ౧౯౦౯—స్వీడను.

## శ్రీమతి సెల్మా లాగెర్లోఫ్.

జననము ౧౮౫౮ (సజీవ)

ఈ అంతర్జాతీయసాహితీగౌరవమును బొందుటకు ఈమె ప్రథమస్త్రీ.

గృహముపై తనివినొందని ప్రేమానురక్తులే యీమె వ్రాతలందు ప్రధానగుణములు.

* 'ఈమె వ్రాతలందలి మహోన్నతాదర్శములు, భావసంపత్తు, ఆధ్యాత్మికసుగుణముల ప్రత్యేకతకుగా' విమర్శకులలో అవతంసమైనది.

పుస్తకములు:—'నైల్నదీ సంచారములు' 'గాష్టో కథ' 'అదృశ్యబంధములు' మొదలగుకథలు; 'ఐవర్' అను నవల అద్భుతమైనవి. 'జెరుసలేం' 'పోర్చుగల్లి యా సార్వభౌముడు' ఈ రెండు యీమె ఉన్నత (మాస్టర్ పీసులు) గ్రంథములు.

(౧౦) ౧౯౧౦—జర్మని.

## పాల్ హీసె.

జననము ౧౮౩౦. మరణము ౨-౪-౧౯౧౪.

* 'భావకవిగా, నాటకరచయితగా, కథకుడుగా, వీరుగావించిన దీర్ఘకృషియందు కనబడు మార్గదర్శికమైన ఊహాపూర్ణశిల్పమునకు.''

వీరు 'నావలె' అను నూతనవిధమైన చిన్నకథల సృష్టికర్త.

పుస్తకములు:— 'సలమ్యాండర్' ప్రఖ్యాతమైన నావలె. 'గ్రుడ్డివాడు' 'స్వర్గములో' 'ప్రపంచశిశువు' ముఖ్యములు.

(౧౧) ౧౯౧౧—బెల్జియం.

## మారిస్ మేటర్‌లిక్.

జననము ౧౮౬౨.

* 'వీరి సర్వతోముఖసాహిత్యకృషికిని ముఖ్యముగ నాటకసృష్టికిని సత్కరింపబడినారు. ఈ నాటకములందు ఊహాసంపద, కవితాదర్శములు ప్రదర్శితములై పాఠకుని భావములకును, యోచనలకును ప్రబోధము నొసంగును.'

తేనెటీగల పెంచుశాస్త్రమున అశేషానుభవమును గణించి రుచ్యమైన కథవలె 'తేనెటీగ జీవితము'ను వ్రాసినాడు.

పుస్తకములు:—'నీలిపిట్ట' అను నాటకము బహుమతికి కారణము. 'మొన్నావెన్నా' 'మేరీ మ్యాడలీను' 'స్టైల్‌మాండ్ నగరపాలకాధ్యక్షుడు' 'బెల్జియంయుద్ధము' మొదలగు నాటకములు ప్రసిద్ధములు.

(౧౨) ౧౯౧౨—జర్మని.

## జెర్‌హార్టు హాప్టుమ్యాన్.

జననము ౧౮౬౨.

* 'సారవంతమై, సత్యమయమైన నాటకకృషికి' గౌరవింపబడినాడు.

పుస్తకములు:—'మునిగినగంట' బహుమతిబడసినది. 'అంతమైన జీవితములు' 'నేతగాడు' కవితాబీజము, భావసంపత్తులో నిండినకావ్యములు. 'వెర్రిక్రీస్తు' 'ఎమాన్యుయల్ క్వింట్' 'సోనాయందలి ఒన్యాసి' మొదలగునవి కల్పితగాథలలో అగ్రగణ్యములు.

(౧౩) ౧౯౧౩—హిందూదేశము.

## శ్రీ రవీంద్రనాథ ఠాకూరు.

జననము ౧౮౬౧.

* 'వీరి కవిత్వమునందు ఇమిడియున్న నిమ్నత, ఉన్నతోద్దేశములకును; నిజప్రతీచీభావనవ్యతను మనోజ్ఞతను పశ్చిమవాఙ్మయములోనికి గొనివచ్చిన మహోజ్జ్వలవిధానమునకు' ఈమర్మజ్ఞాని నోబెల్ బహుమతి బడసి భరతఖండనామమును సువర్ణాక్షరములతో వ్రాసినాడు.

చిన్నకథలకు, కవిత్వమునకు పడమట దేశవాసుల మనము కెక్కినాడు. వీరు మంచి గాయకులు.

తన బహుమతిధనమును తనచే నెలకొల్పబడిన శాంతినికేతనమున కొసంగివేసెను.

౧౯౧౪ లో బహుమతు లొసంగబడలేదు.

(౧౪) ౧౯౧౫—ఫ్రాంసు.

## రోమెయిన్ రోలా.

జననము ౧౮౬౬.

* 'వీరి రచనలందలి ఘనతరాదర్శములకును, మానవజాతి ఐక్యతను గూర్చగలిగిన సానుభూతిసత్యములకును.'

తమమిత్రుడు ఠాకూరువలెనె యీ బహుమతి ధనమును తీసికొనక "యూరపుఖండగరవస్థానివారణము"నకుగా ఇచ్చినాడు.

విద్యలో నియమబద్ధావరోధములు, రాజకీయములందు వెన్నుజూపుట వీరికి నచ్చక వాటిపై ధ్వజమెత్తినారు.

పుస్తకములు:— 'జీన్‌క్రిస్టోఫ్' అను పెద్ద పుస్తకము బహుమతి బడసినది. 'సత్యవిజయము' 'జూను ౧౪-వ తేది' చాల గొప్ప గ్రంథములు.

గాంధిమహాత్ముడు అనిన వీరికి గొప్ప గౌరవము. భారతదేశము అనిన అభిమానము. వీరి 'గాంధిమహా

త్ముడు - రవీంద్రుడు' అను పుస్తకము ప్రపంచఖ్యాతి వడసినది. ఈపుస్తకమే ప్రాశ్చాత్యుల దృక్కుల మన దేశమువైపునకు మరల్చినది. వీరు 'వివేకానంద', 'రామకృష్ణపరమహంస'ల జీవితముల హృద్యముగ వ్రాసియున్నారు. టాల్‌స్టాయికంటే గాంధీజీయే గొప్పవాడని వీరి విశ్వాసము. మహాత్ముని తెలిసికొనవలయుననే ఆసక్తియే వీరిని ఇంగ్లీషునేర్చుకొనునట్లు చేసినది.

(౧౫) ౧౯౧౬—స్వీడను.

## వెర్‌నర్ వాన్ హేడేన్‌స్టామ్

జననము ౧౮౫౯.

* 'మనవాఙ్మయనవోదితశకమునకు మూలపురుషుడుగ.'

వీరికి 'స్వీడను ఆస్థానకవి' అను బిరుదము పోటీపరీక్షలో ఒసంగబడినది.

పుస్తకములు :—'దేవునిజననము' 'ఫాల్‌కంగుల చెట్టు' ప్రధాననాటకములు. 'ఎన్‌డిమియన్' అద్భుతమైనకత.

(౧౬) ౧౯౧౭—డెన్మార్కులో ఇద్దరికి.

## [అ] హెన్‌రిక్ పాన్‌టిపిడాన్.

జననము ౧౮౫౭.

* 'నేటి డేనిషు జీవనమును విరివిగ వర్ణించుటచే'

పుస్తకములు:—'పర్చిఫీడ' 'వాగ్దానదేశము' అనునవి మంచివి. 'చచ్చినవారి రాజ్యము' అను యుద్ధవర్ణన ప్రఖ్యాతము.

## [ఇ] కారల్ జెల్‌రప్.

జననము ౧౮౫౭—మరణము ౧౩. అక్టోబర్ ౧౯౨౯.

* 'కూలంకషమును, భాగ్యవంతమును అయి ఆవేశము నొసగగలిగిన ఉన్నతాదర్శములకు.'

పుస్తకములు:—'కామునీతయాత్రికుడు' అను బుద్ధభగవానుని చరితయు, 'మిన్నా' అనునవి ప్రఖ్యాతములు.

౧౯౧౮—బహుమతిలేదు.

(౧౭) ౧౯౧౯—స్విట్‌జర్లాండు.

## కారల్ స్పిల్‌టేలర్.

జననము ౧౮౪౫—మరణము ౧౯౨౫.

* 'ముఖ్యముగ వీరి 'ఒలింపియన్ స్ప్రింగు' అను మహాకావ్యమునకు.'

'ఇమాగో' అనునదిగూడ ప్రసిద్ధము. 'ఒలింపియా వసంతము 'డాంటేకృత 'డివైన్ కమిడీ'కి తుల్యమని ఎన్నబడుచున్నది. ఇంగ్లీషులో షెల్లీ, కీట్సులతో పోల్తురు.

(౧౮) ౧౯౨౦—నార్వే.

## నట్ హామ్సన్

జననము ౧౮౫౯.

* 'స్థిరస్థాయియైన 'గ్రోత్ ఆఫ్ ది సాయిల్' అను మహాకావ్యమునకు.'

ఈతడు మొదట నిరుపేదయై దేశదేశముల తిరుగాడినాడు. అమెరికాలో చాల వృత్తుల నవలంబించి వీధులలో తిరుగు గుర్రపుబండి కండక్టరుగా, సేద్యగాడుగా, గుమాస్తాగా, ఉపాధ్యాయుడుగా క్లేశపడినాడు. బహుమతిరాగానే 'గుర్రపుబండికండక్టరుకు నోబెల్ బహుమతి'' అని అమెరికాపత్రికలు స్వాగతమొసంగినవి.

పుస్తకములు—'ఆకలి' 'నిగూఢచర్యలు' 'పాన్' 'స్వప్నములగనువారు' 'యుగపు బిడ్డలు' అతివ్యాప్తములు.

(౧౯) ౧౯౨౧—ఫ్రాంసు.

## అనటోల్ ఫ్రాంసు.

జననము ౧౮౪౪. మరణము ౧౯౨౪.

వీరు ఫ్రాంసులో అత్యంతము గౌరవింపబడినారు. వీరి అపరక్రియలు మహారాజులకువలె (స్టేట్ ఫ్యూనరల్) గావింపబడినవి.

* 'మంజులశయ్యతోడను, విశాలసహృదయమానవత్వముతోడను, పరాసుహాస్యరసముతోడను విరాజిల్లు కృతికర్తగా వీరు గావించిన అద్భుతకృషికి.'

పుస్తకములు:—'సిల్వెస్టె బోనార్ నేరము' విశ్రుతిగూర్చినది. 'కార్నిత్ వధువు' 'ఎర్రకలువ' మాస్టర్ పీసులు. 'జీవితవికసనము' 'తీయాస్' అనునవి ఉద్గ్రంథములు.

(౨౦) ౧౯౨౨—స్పెయిను.

## జాకిన్టో బెనవెన్టె.

జననము మ్యాడ్రిడ్ నగరమున ౧౮౬౬.

* 'పూజ్యమైన స్పెయిన్ నాటకసాంప్రదాయములను అనుసరించుటయందు వీరవలంబించిన హృదయంగమ విధానమునకు.'

పుస్తకములు :—'సంఘములో', మృగములవిందు, అను నాటకములు ముఖ్యములు. 'ఎట్ హెంగ్రెకిటో' అను నాటకము ఇబ్సన్‌గారి 'డాల్సుహౌసుకు' సమానముగా ఎన్నబడుచున్నది. 'ప్రణయకుసుమములు' 'శిశిరగులాబి' 'ఎర్మైన్‌భూమి', 'వితంతుభర్త' మొదలైనవి విశ్రుతములు.

(౨౧) ౧౯౨౩—ఐర్లండు.

## విలియం బట్లర్ యేట్సు.

జననము ౧౮౬౫.

* 'వీరి ఔచితీపూర్ణ, ఆవేశమయ కవితాశిల్పము ప్రజాశక్తిని వెల్లడించుటచే.'

వీరికి రవీంద్రకవీంద్రులు మిత్రులు. గీతాంజలికి అవతరణము వ్రాసియున్నారు.

జీర్ణించిన స్వకీయ 'కెల్టిక్' విజ్ఞాన పునరుద్ధరణ కృషికులలో వీరు ప్రథములు.

పుస్తకములు:—'అపహరింపబడిన శిశువు' 'దిల్యాండ్ ఆఫ్ హార్ట్సుడిజైర్' 'ఆయిసన్ ప్రరిభ్రమణములు' వీరికీర్తికి మూలములు. 'ది అవర్ గ్లాస్' మహోన్నత నైతిక నాటకము.

(౨౨) ౧౯౨౪—పోల్యాండు.

## ల్యాడిస్‌లా రీమాంట్.

జననము ౧౮౬౮. మరణము జనవరి ౧౯౨౫.

* "వీరిగొప్ప ఇతిహాసము 'కర్షకులకు'గా."

పుస్తకములు:—'వాగ్దానభూమి' మంచినవల. 'ప్రజలేపుంటారు' 'నల్లమందు త్రాగువాడు' మొదలగు కథలు అభిరుచికరములు.

(౨౩) ౧౯౨౫—ఐర్లండు.

## జార్జి బెర్నార్డు షా.

జననము ౧౮౫౬.

* 'ఉదారాశయములతోడను, మానవత్వముతోడను, వింతకవితాసౌందర్యముతో విరాజిల్లు సజీవవ్యంగ్యముతోడను శోభించు రచనలకు.'

ఇతడు సమాజవాది. విశ్వవిద్యాలయములు విజ్ఞాననిర్మూలనహేతువులనియు, ప్రజాస్వామ్యములకంటె డిక్టేటరే పాలనాసౌష్ఠవమును కలిగించుననియు వీరి విశ్వాసము

పుస్తకముల వరుంబడిమీద సూపర్‌ట్యాక్సు చెల్లించు కవి లోకమున యితడొక్కడే!

బహుమతిధనమును షా ర్వే బీదవారికి యిచ్చినాడు. చాల నాటకముల వ్రాసినాడు.

(౨౪) ౧౯౨౬—ఇటలీ. (౧౯౨౭లో ఒసంగబడినది.)

## శ్రీమతి గ్రేజియా డెలెడా.

జననము ౧౮౭౫. రోము.

* 'ఈమె కావ్యములు ఉజ్జ్వలాదర్శదీపితములు తనదేశజీవనమును చిత్రకారునివలె ప్రస్ఫుటముగ అభివర్ణించి, మానవసమస్యల పూర్ణమైన సహానుభూతితో వివరించుటచేత.'

'సంఘైక్యతయొక్క మహోన్నతాదర్శము సంసారము' అని యీయమ విశ్వాసము. స్త్రీలు పుస్తకముల వ్రాయరాదని ఇంటిపోరు యీమెకు జాస్తిగా నుండినది.

పుస్తకములు:—'అనెమె ఆనెస్టు' 'డీనాటె' 'కనెరి' మొదలగునవి మంచినవలలు.

(౨౫) ౧౯౨౭—ఫ్రాంసు.

## తత్త్వవేత్త - హెన్రీ బెర్గుసన్

జననము ప్యారిస్—౧౮౫౯.

* 'సారవంతమై - జీవనప్రదమైన ఆదర్శములను వర్ణించిన తేజోమయశిల్పమునకు."

(౨౬) ౧౯౨౮—నార్వే.

### శ్రీమతి - సిగ్రిడ్ ఉండ్‌సెట్.

జననము. ఆస్‌లో ౧౮౮౨.

ఈ గౌరవమును బొందుటకు ఈమె మూడవ స్త్రీ.

* 'మధ్యమయుగ జీవితమును వర్ణించిన 'గ్రోత్ ఆఫ్ ది సాయిల్' అను మహత్తర కావ్యమునకు.'

(౨౭) ౧౯౨౯—జర్మని.

### హెర్ థామస్ మ్యాన్.

జననము. ౬ జూను ౧౮౭౫.

మ్యూనిక్ నగరమున భీమాకంపెనీలో గుమస్తాగా నుండియే సాహిత్యకృషి సలుపుచు 'పతిత' అను కథ వ్రాసినాడు. చిన్నకథలవలననే మొదట ప్రఖ్యాతి నందినాడు

పుస్తకములు:— 'చిన్న ఫ్రీడ్‌మ్యాన్‌గారు' అను కథల సంపుటి, 'బడన్‌బ్రూక్సు' అను నవల ముఖ్యములు. 'మాంత్రికపర్వతము' 'వెనీసులోమరణము' ఎన్నదగినవి.

(౨౮) ౧౯౩౦—అమెరికా సంయుక్త రాష్ట్రములు

### సిన్‌క్లేర్ లూయి.

మధ్యతరగతుల జీవనమును వర్ణించుటయందు వీరి కళావైదుష్యము కూలంకషమైనది మొదటపత్రికలకు లేకరి.

పుస్తకములు:—'మెయిన్‌స్ట్రీటు' చాల ప్రఖ్యాతము. 'బ్యాబిట్' 'ఆరోస్మిత్తు' నేడు ప్రఖ్యాతములు.

(౨౯) ౧౯౩౧—స్వీడను.

### డాక్టర్ ఎరిక్ ఆగ్జెల్ కారల్ ఫెల్టు.

వీరు చనిపోయిన తర్వాత యీ బహుమతి ఒసంగబడినది. ఇంతకుముందు గౌరవింపదలచుకొనగా తాను అనర్హుడనని నిరాకరించినాడు.

(30) ౧౯౩౨—ఇంగ్లండు.

### జాన్ గాల్సువర్థీ.

(ఈ సంవత్సరము చనిపోయినారు)

బహుమానద్రవ్యమును తన ఆస్తిని తనచే స్థాపింపబడిన 'పెన్' అను అంతర్జాతీయ కవిసంఘమున కొసంగిరి. దీనికి ఆయనే అధ్యక్షుడు. ఇప్పుడు హెచ్. జి. వెల్సు. దీనిశాఖ ఠాకూరుగారి అధ్యక్షతక్రింద భారతదేశమున నెలకొల్పబడినది. సరోజనీదేవి, ఇక్‌బల్ కార్యదర్శులు.

వీరి నాటకములు, నవలలు చాల ప్రసిద్ధములు:

### సింహావలోకనము.

ఈ బహూకరణములు 1901 లో ప్రారంభింపబడి నేటివరకు అవిచ్ఛిన్నముగా పెరుగుచు ప్రతిష్టవంతములగుచున్నవి.

1914, 1918 లలో బహుమతు లొసంగబడకుండినను 1904, 1917 లలో యిద్దరిద్దరికి పంచిపెట్టబడుటచే యిప్పటికి 32 మంది గౌరవింపబడినారు.

ఇందు 8 స్త్రీలు గలరు

దేశములు:— 14.

| | | |
|---|---|---|
| జర్మని | 5 | మారులు. |
| ఫ్రాంసు | 5 | ,, |
| నార్వే | 3 | ,, |
| స్వీడను | 3 | ,, |
| డెన్మార్కు | 2 | ,, |
| పోల్యాండు | 2 | ,, |
| ఇంగ్లండు | 2 | ,, |
| ఐర్లండు | 2 | ,, |
| స్పెయిను | 2 | ,, |
| ఇటలీ | 2 | ,, |
| భారతదేశము | 1 | ,, |
| బెల్జియం | 1 | ,, |
| స్విడ్జర్‌ల్యాండు | 1 | ,, |
| అమెరికా. సం.రా. | 1 | ,, |

* ఈ గుర్తుగల వాక్యములు బహుమతిపత్రమున వ్రాయబడినవి.

—మరుపూరు కోదండరామరెడ్డి.

[గ్రంథాలయ పతాకమును గూర్చి గతమాసమున శ్రీ ఊటుకూరు వేంకటసుబ్బరాయశ్రేష్ఠిగారు కోరిన దానికి బదులుగా ముప్వురు తమ అభిప్రాయములను తెలిపియున్నారు. ఆముప్వురి అభిప్రాయముల క్రింద ముద్రించుచున్నారము. —సంపాదకుడు.]



# గ్రంథాలయోద్యమము.

## గ్రంథాలయ పతాకము

### ౧

వేదకాలమున జ్ఞానాభివృద్ధికి, సర్వభూత దయకు ముందంజవేసిన హిందూమతము నేడు భిన్నభిన్నశాఖలుగా నేర్పడి పెక్కు దేవుళ్లను, దేవతలను ఆరాధించుచూ వాటికి ప్రత్యేకాలయములు నిర్మించి, పరస్పర కలహములతో పొట్టనింపుకొనుచున్నది. వైష్ణవులంటే శైవులకు గిట్టదు. శైవులంటే వైష్ణవులకు అసహ్యము. అల్లాంటప్పుడు బ్రహ్మకు, ఆయనభార్య సరస్వతమ్మకు కూడా గుళ్లుగోపురాలు ఉంటే అధికముగా ఇంకొకతెగ బయలుదేరేది. మనకు ఇప్పుడున్న దేవుళ్లు, దేవతలు చాలును. పురుషసూక్తములో వర్ణింపబడిన ఏకేశ్వరోపాసన పేరైనా లేకపోయింది. హిందువుడు ప్రతిపనికి వేర్వేరు దేవతులను కొలుస్తున్నాడు. ఒక్కడిమీద సిశ్చలభక్తి నిల్పలేదు. అల్లాంటప్పుడు సరస్వతిని కూడా తెస్తే ఇంకా ఆఅనిశ్చలత్వము వృద్ధిచేయుట మవుతుంది. కనుక సరస్వతికి గుడినిగుఱించి మనము విచారింపబనిలేదు. అయినా సరస్వతి హిందువులదేవతేగాని మనదేశమునందుగల ఇతరమతస్థులగు మహమ్మదీయులు, క్రైస్తవులు మొదలగు అన్యమతస్థుల దేవతగాదు. గ్రంథాలయాలు అన్ని మతములకు అన్నిజాతులకు చెందినవిగాని, కేవలము ఒక్క హిందూసంఘమునకే చెందిన విజ్ఞానవస్తువుగాదు. కనుక సరస్వతిని పతాకముమీద చిత్రిస్తే అన్యమతములు సహింపకపోవచ్చును. ఏమతమువారైనను హిందువులందఱికి కావలసింది భారతమాత. భారతదేశపటమును వేసి, అందు భారతమాత తనబిడ్డలందరికిన్ని పుస్తకాలద్వారా జ్ఞానము పంచిపెట్టుతూవున్నట్లు చిత్రిస్తే బాగావుంటుందేమో! 'బిడ్డలందరు' అనగా పటములో అన్నిజాతులవారును అన్ని మతాలువారును. ఇలా పతాకము తయారుచేస్తే సర్వసమత్వముగా అన్నిమతాలవారికిని గ్రంథాలయాలు స్వాగతమిస్తున్నట్టుగా వుంటుంది.

—వల్లభదాసు రాజగోపాలరావు, బి. ఏ.

### ౨

ప్రపంచములోనున్న సర్వదేశస్థులును ఎల్లవిద్యల కధిదేవత స్త్రీగాని పురుషుడుగాడని నిర్ణయించియుండుట యందఱకు తెలిసినవిషయమే. హైందవులు తమ దేశ

మును మాతృభూమియనియు, ఇతర దేశస్థులు తమతమ దేశములను పితృభూములనియు ప్రకటించునట్లు వాగ్దేవతావిషయమున భిన్నాభిప్రాయములు లేవు. కనుక విద్యాస్వరూపిణి లలనామణి యనియే సర్వజనసమ్మతము. రమణీయమగు ఆమె ప్రతిమ పతాకమున నుండవలసినదే. కాని విద్యాదేవి కరములో వీణెకన్న అజ్ఞానదైత్యమును పారదోలు అర్థమిచ్చువిధమున బల్లెముండిన బాగుండునని నాకు తోచుచున్నది.

—నరహరిశెట్టి శేషగిరిరావు.

3

ఆంధ్ర దేశ గ్రంథాలయోద్యమ నాయకులలో నొకరగు శ్రీ ఊటుకూరు వేంకట సుబ్బారావు శ్రేష్ఠిగారు చెప్పినచొప్పున గ్రంథాలయోద్యమమునకుకూడ పతాకముండుట శుభావహమని ఎల్లరును అంగీకరింతురు. ఈ పతాకముపై పుస్తకమును, జ్యోతియు ప్రదర్శించిన అన్నిమతముల వారికిని అంగీకారమై యుండును. అజ్ఞానమును, అంధకారమును పారద్రోలుటకు పుస్తకము, జ్యోతి పరికరములు. అజ్ఞానాంధకారమును పారద్రోలుట కుద్దిష్టమైన గ్రంథాలయముల పతాకములపై అజ్ఞానాంధకారమును తొలగించు పరికరములగు పుస్తకము, జ్యోతియు ఉండుట ఎంతయు సముచితముగ నుండునని నా అభిప్రాయము.

—అ వేంకటరామయ్య, బి. ఏ

గ్రంథాలయముల పూర్వోదంతము.

గ్రంథములు, వేదయుగమునుండి మనకు ప్రబుద్ధములై యుండుటచే వాని పుట్టువు కాలమిదియని స్ఫురించెడు. ఆకాలమునఁ బండితసమావేశములున్నట్లు కనఁబడుచున్నవి. అప్పుడు గోష్ఠిస్థలము లున్నట్లును, అందు గ్రంథాధానమును, ఉన్నట్లు ప్రమాణముల వినంబడు. అట్టి పరిషత్తులందు గ్రంథపేటికలుండెను. గ్రంథములు పారిషదులచేఁ దేఁబడుచుండెను. అవి కేంద్రస్థానములనుండి శాఖాస్థానములకు గొనిపోఁబడుచుండెను. ఇప్పుడమెరికాఆస్ట్రేలియాల లోని సంచారగ్రంథాలయములు దీని స్మరణచిహ్నము లేమో? కొన్ని పరిషత్తులు నియమితకాలానుకూల్యముగను, మఱికొన్ని నిత్యములై గురుకులాశ్రయములకు దోఁబుట్టువులుగను ఉండెను. స్థిరపరిషత్తులందు స్థిరగ్రంథపేటికలు విరాజమానములు. ఇవియే కోశాగారములు. వీని యధ్యక్షుఁడు కోశాచార్యుఁడు. ఈతఁడు కోశాగారమందలి గ్రంథరత్నముల విలువ నెఱిఁగిన విశారదుఁడు. కోశాగారమందుఁ గోశాచార్యుడును, లిపింకరుండును నను నిద్దరు కార్యనిర్వాహకులుండిరి. కోశాచార్యుఁడు కోశస్థగ్రంథములు స్వాంతముగఁ జదివిన చదువరియు, బాలకులకు దర్శకులకు జనించు శాస్త్రసందేహములు తీర్చు వేత్తయునై యుండెను. ఈతఁడు రాజుల యాదరణమును ప్రజల యనురాగమును ఉపార్జించి, కోశాగారములను సర్వవిధముల నున్నతికిఁ దెచ్చుచుండెను. ఆగారమందలి పురాతన ప్రతిష్ఠగ్రంథములను వ్రాయుటయే లిపింకరుని కార్యము. ఇట్టి యాగారముల కార్యావర్తమే మొదటిచోటు. ఋషుల యజ్ఞశాలలందలి ప్రాగ్వంశములు పవిత్రకోశాగారములయి యుండెనని యూహవాదము చున్నది గాని శ్రాద్ధ, విశ్వవార, వాక్కు-ప్రభృతులగు తపస్వినులకు ఆకోశాగారములు విద్యాక్షేత్రంబులై యుండెను. కానఁ గోశాగారముల జననము ప్రాచీనములకు సమకాలికముగఁ గన్పట్టుచున్నది. (ఉగాదిసంచిక.)

—సాహిత్యసరస్వతి నారాయణశర్మ



స్త్రీలు

ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.



# మహిళా లోకము

## నేటి అమెరికను స్త్రీలు

నేటి అమెరికనుస్త్రీల స్వాతంత్ర్యమును తిలకించి గొప్పగొప్ప నాయకులుగూడ భయభ్రాంతులగుచున్నారు. అయితే ఇచట అమెరికనుస్త్రీల స్వాతంత్ర్యపథమును విమర్శించుటగాక పరిచయము చేయుటయే మాయుద్దేశము.

### ౧. వివాహముఅనిన విముఖత్వము

అమెరికనుస్త్రీల స్వతంత్రభావములు తొలుత దాంపత్యజీవితమున ప్రస్ఫుటములైనవి. భార్యాభర్తల జీవితమున పరివర్తనమేగాదు అసలు వివాహసమస్యయే చిక్కులపాలాయెను. స్త్రీలు ఉన్నతినందుచున్నకొలదియు వివాహపద్ధతిని అసహ్యముగ జూచుచున్నారు. వివాహము తమ్ము పనికిరానివారలగ నొనర్చుచున్నదనియు; పురుషులరీతిని తామును అధికవిద్యాసంపత్తినందుటకు వివాహమునకు దూరమగుటయే మార్గమనియు వారిభావన. వైవాహికబంధమునజిక్కి, సంతానమునుబొంది, బిడ్డలపోషణమునను గృహకార్యనిర్వహణమునను దగిలియుండినచో స్త్రీ పేర్కొనదగిన ఏ పెద్దకార్యమును చేయజాలదని వారినమ్మకము. ఇందుకు ఫలితముగ అమెరికనుస్త్రీలలో వివాహమును ద్వేషించువారిసంఖ్య క్రమముగా వృద్ధిచెందుచున్నది. విద్యాలయములందు, ప్రభుత్వమువారి కార్యాలయములయందు, ఇతర కంపెనీలయందు, కమ్మరము వడ్రంగము మొదలగు కర్మాగారములయందు నేడు అమెరికనుస్త్రీలు విరివిగ ప్రవేశించి తమ నైపుణ్యమును ప్రదర్శించుచున్నారు. భవననిర్మాణము మొదలగు ఇంజనీరింగుపనులయందును, మోటారునడుపుట విమానచోదనము మున్నగు విద్యలయందును వారు సిద్ధహస్తులైయున్నారు. పెండ్లి కారాగారముగ స్త్రీలు భావించుచుండుటవలన పురుషులును వివాహమును ఒక ఆపదగనే భావింప ప్రారంభించిరి. అమెరికనుస్త్రీల జీవితవ్యయములు సామాన్యులు భరింపరానంతగ నుండును. అచటిస్త్రీలు వివాహమాడుచో స్వస్థుడు, విద్యావంతుడునగు శ్రీమంతులనే వరింతురు. పురుషులును విద్యావతి, సుందరియగు యువతులనే వివాహమాడుదురు. దీనికి ఫలముగా అమెరికాదేశమున అవివాహితుల సంఖ్య దినదినమునకు పెరిగిపోవుచున్నది. అచట దాంపత్యజీవితమిట్లు విపరీతపరివర్తనమును గాంచినది. మన దేశమునందువలె వివాహము గావించు భారము అచట తలిదండ్రులపై నుండదు. యువతీయువకుల యంగీకారములేక జననీజనకులు వైవాహికసంస్కారము నెరపనేరరు. వధూవరులు ఒండొరులు అంగీకరించినచో ఆ వివాహమును తలిదండ్రులు ఆపలేరు. వివాహమునకు పూర్వము యువతీయువకులు ఒకరిస్వభావాదులొకరు పరిశీలించుకొందురు. ఒకరివలన నొకరు తృప్తి చెందిన యనంతరమే వివాహమునకు గడంగుదురు.

### ౨. వివాహప్రమాణవాక్యములలో మార్పు

అమెరికాదేశమున వివాహకలాపము అతిసులభమైనది. వివాహనిర్ణయము అయినతోడనే వధూవరులిరువురును తమ ప్రాంతపురిజిస్ట్రారుకడకు బోయెదరు. అచట ఆజ్ఞాపత్రము పొందవలసియుండును. అనంతరము ఇరువురును ఒక సివిలు సర్వెంటు సముఖమునగాని, చర్చిలో పాదిరియెదుటగాని వైవాహికసంస్కారమును జరుపుకొందురు. వివాహమునకు చాలతక్కువ సమయమేపట్టును; ఆసమయమున వధూవరులిరువురును

కొన్ని ప్రమాణవాక్యములు ఉచ్చరింపవలసియుండును. వరుడు "నేడు ఈమె నాకు పత్నియైనది. నేను నా సుఖదుఃఖములలో – ఎట్టిస్థితియందైనను ఈమెను ఆదరముగ జూతును. నాజీవితాంతమువరకును ఈమెను విడనాడను. మఱియు ఈమెకు సర్వదా సహాయభూతుడనైయుందు" నని ప్రమాణముచేసిన యనంతరము వధువును అదేవిధముగ పతినిగూర్చి ప్రమాణముచేయును. కాని స్త్రీప్రమాణవాక్యములలో "ఎల్లప్పుడును నేను నాపతిఆజ్ఞకు అనువర్తినినైయుందు" నను వాక్యము మాత్రము అధికముగనుండును. ఈవాక్యము అవమానకరముగనున్నదనియు, ప్రమాణవాక్యములనుండి దీనిని తొలగించివేయవలయుననియు ఆందోళన స్త్రీలలో ప్రారంభమాయెను. స్వతంత్రభావసంపూరితలగు స్త్రీలు ఈ వాక్యమును గర్హింపసాగిరి. పాదిరీలు ప్రమాణవాక్యములనుండి దీనిని తొలగింపక 'ఇది బైబిలులోనిది. తీసివేయుటకు వీలులేదు. అయినను ఆచారమననుసరించి ఉచ్చరించిన మాత్రమున నష్టమేమి?' అని కాలము వెళ్ళబుచ్చుచుండిరి. అది మొదలు అమెరికను నారీలోకము ఆవాక్యమును నామమాత్రముగ తలంచుచున్నారు. ఈప్రమాణవాక్యములతో వివాహకార్యము తుదముట్టును. పిమ్మట భార్యాభర్తలు వేఱుఇంట కాపురమునకు ప్రారంభింతురు.

### ౯. ఇంటిపనులన్నియు ఎలక్ట్రిక్ మీటులతోడనే

అమెరికాలో గృహనిర్వహణభారము స్త్రీలనుండి క్రమముగ తగ్గుచున్నది. అమెరికాదేశమునందలి సుప్రసిద్ధనగరముల విశేషములు ఆశ్చర్యజనకములుగ నుండును. నిరుపేదల ఇండ్లయందుతప్ప మిగిలిన అన్ని తరగతులవారి గృహములందును సమస్తకార్యములును విద్యుచ్ఛక్తివలననే జరుగుచుండును. దుస్తులు కుట్టుట, ఉదుకుట, ఇస్త్రీచేయుట, గృహమును శుభ్రపరచుట, వంట మొదలైన పనులం దేవియునుగూడ చేతులతో చేయవలసినపనిలేదు. భోజనమును తయారుచేయుటలో పొయ్యిసెగను కాగవలసినగతి యచటిస్త్రీలకు లేదు. అందుకును విద్యుత్ యంత్రములే కలవు. బియ్యము, శాకములు, మాంసము మొదలగునవి శుభ్రపఱచి పొయ్యిపైనిడి విశ్రాంతిమందిరములోనికి పోవచ్చును. విశ్రాంతిమందిరములోనే యుండు ఎలక్ట్రిక్ మీటును భోజనసమయమునకు కొంచెముముందు నొక్కినమాత్రమున వంటయింట నవి ఉడుక ప్రారంభించును. పొయ్యికడనుండి ఈగదిలోనికి ఉన్న థర్మామీటరుద్వారా భోజనమైనదిలేనిది తెలిసికొనవచ్చును. ఆయంత్రమునకు సంబంధించియే ఒక గంటయుండును. భోజనము సిద్ధము అయినతోడనే అది మ్రోగును. ఎప్పుడైనను గృహిణి అన్యత్ర పోవలసియున్నచో తాను తిరిగి వచ్చువరకునగు సమయమును ఎంచుకొని దానినిబట్టి పొయ్యికి ఇంతవేడి కావలెనను నిర్ణయముతో యంత్రమునందలి ముల్లును త్రిప్పి తనదారిని పోవును. ఆమె వచ్చునప్పటికి భోజనము సిద్ధమై ఆరిపోక వేడిగనుండును. ప్రాతఃకాలమున ఉపాహారము చేసికొనునిమిత్తముగూడ అమెరికనుస్త్రీ పెందలకడ లేవవలసిన ఆవశ్యకతయుండదు. మంచముపై పరుండియే ఎలక్ట్రిక్ మీటులనొక్కి యన్ని ఏర్పాటులు చేసికొనును. అవసరమైనపుడు లేచిన తయారుగనున్న ఉపాహారములభించును. అమెరికను స్త్రీలు తమగృహములను ఆఫీసులవలె చక్కగ నలంకరింతురు. ఎంత చిన్నగృహమైనను వారు చేసిన అలంకారములచే శోభాయమానమై ఉల్లాసమును గల్గింపగల్గియుండును.

### ౯. తమబిడ్డలకు తాము పాలీయరు.

పిల్లలనుగనుట, వారినిపోషించుట అమెరికను స్త్రీలకు చాలవఱకు అసహ్యమైనది. వివాహమాడిన స్త్రీలకు నారీసంఘమున గౌరవ మంతగా లేదు. వివాహితలగు స్త్రీలను అవివాహితలగు స్త్రీలు అపహాస్యమొనరింతురు. వివాహితలగు స్త్రీలు సంఘమునందు అడుగడుగున అపరాధముచేసినవారివలె సంచరింపవలసియుండుట అరుదుగాదు. వివాహమాడుటకంటెను సంతానమును బడయుట మఱింత అసహ్యకార్యముగ పరిగణింపబడుచున్నది. సంతానోత్పత్తివలన స్త్రీ దేహస్వాస్థ్యమును, యౌవనమును, సౌందర్యమును గోల్పోవునని అమెరికను స్త్రీలభావము. అచటి స్త్రీలు తమ బిడ్డలకు తామే పాలీయక పాలదాదులచే నిప్పింతురు.

చాల ఆరోగ్యముగను, శుభ్రముగను ఉండువారే పాల దాదులుగ నియమింపబడుదురు. పిల్లలకు పాలిచ్చుటచే ఆరోగ్యసౌందర్యములు చెడునని అచటి స్త్రీలు వారి పోషణము దాదులచేతులయందే యుంతురు.

## ౬. సౌందర్యపోషణమే వారి పరమావధి

తమ సౌందర్యమును పరిపోషించుకొనుటకును, వృద్ధినొందించుకొనుటకును విశ్వప్రయత్నములను చేయుదురు. సౌందర్యపోషణమునకై వారు వెచ్చించు కాలము, ధనము సులభముగా లెక్కకట్టరానిది. వారి జీవితములో స్వాస్థ్యరక్షణార్థము ప్రబలముగు నిచ్చగలుగుటకు కారణము వారి సౌందర్యాభిలాషయే. వేషములలో పాశ్చాత్యదేశములకన్నిటికిని ముందడుగు వేయగలది అమెరికా. అచటీస్త్రీల విలాసప్రియత్వము, సుఖోపభోగేచ్ఛ దినదినమును వృద్ధినందుచున్నవి.

—గద్దె లింగయ్య చౌదరి.

---

## స్త్రీలు : ప్రభుత్వ బాధ్యత

[నవంబరు 4-వ తేదీని ఏలూరుపురమునకూడిన సప్తమాంధ్రరాష్ట్రీయమహిళాసభకు అధ్యక్షత వహించి శ్రీమతి డాక్టరు ముత్తులక్ష్మిరెడ్డిగారిచ్చిన ఉపన్యాసమునుండి ఈ పంక్తులు గైకొనబడినవి.]

"(ఎ) ఆరోగ్యము అనుకూలవాతావరణము అనగా ముఖ్యముగా మంచిజనావాసములు. (బి) విద్య. (సి) జీవనోపాధి—అనగా మనకు కావలసిన వస్తువులను ఉత్పత్తిచేయుట. లేదా, మనకు కావలసినవానికొరకై బదలీగా తదితరవస్తువులను తయారుచేసి యిచ్చుట. (డి) పౌరస్వామ్యములు—అనగా వ్యక్తిస్వాతంత్ర్యమున్ను, సర్వసమత్వముగల న్యాయపరిపాలనయున్ను—ఇవన్నియు ఇంటిలోని కుటుంబినియగు తల్లికిముఖ్యములైన విషయములు. అవి ఆమె జీవితమును కుటుంబజీవితమును తారుమారు చేయగలవు. కనుక శాసననిర్మాణములయందు స్త్రీజోక్యము కలుగచేసికోవలసియున్నది. అనగా ఎన్నికలలో తగు బాధ్యత వహింపవలసియున్నది. అట్లయినచో శాసనసభలకు తగినవారినిపంపి వారిద్వారా న్యాయచట్టములను నిర్మించి తద్వారా తమ సంసారములను పైనచెప్పిన నాలుగు అపాయములనుండి రక్షించుకొనగలరు. కావుననే స్త్రీ వోటరుల సంఖ్య అధికముగనుండవలయుననియు, వారు స్వతంత్రలై, విద్యావివేకవతులై ఓట్లు నీయవలెననియు మా విజ్ఞాపనమునందు మేము ఇంగ్లాండులో మనవిచేసియున్నాము. మన పిల్లలకు చక్కనివిద్య, ఆరోగ్యము, శరీరదార్ఢ్యము, జీవనోపాధి కావలయును. ఇవి లభించుటకును తగిన పరిపాలనావిధానములను నిర్ణయించుటలో మనమాట చెల్లుబడియగుటకు మనకు శాసనసభలలో తగిన ప్రాతినిధ్యముండవలెను. మన పిల్లలకు నిర్బంధప్రాథమికవిద్య యుండవలెననియు, పాఠశాలలోని పిల్లల ఆరోగ్యదార్ఢ్యములను వైద్యులు పరీక్షించుచుండవలెననియు, తల్లులకును బిడ్డలకును రక్షణశరణ్యముల నొసంగవలెననియు, బీదలకు ఆరోగ్యకరమైన వసతుల నేర్పరచవలెననియు, వైవాహికపద్ధతులను సంస్కరించవలెననియు, మనవారసత్వపు హక్కులను సంస్కరింపవలెననియు, స్త్రీపురుషుల పరస్పరసంబంధము ఉత్తమనీతిదాయకములై యుండవలెననియు, స్త్రీలను బాలికలను వ్యభిచారవృత్తికై యలవరచు వ్యాపార మడుగంటవలెననియు మనము కోరుచున్నాముగదా. ఇవన్నియును మనలను రాజకీయరంగములోనికీడ్చుచున్నవి. దేశమునకు భవిష్యన్నాయకులై పౌరులై వెలయగల మనబిడ్డల యోగక్షేమముల కనువగురీతిని ప్రభుత్వపరిపాలనాపద్ధతులను నిర్ణయింపజేయుటకై మనము రాజకీయములందు పాల్గొనకతప్పదు. ఇతర దేశములలోని స్త్రీలు రాజకీయవిషయములను చర్చించుచుండగా మనమేల చర్చింపరాదు? పురోభివృద్ధినందుచున్న ఆదేశముల స్త్రీలవలె మనమేల వ్యవహరింపరాదు?"

# విడ్డూరములు

## ౯. ఏడాదిబిడ్డ సరస్సులో ఈదుట

కాన్‌టన్ పరిసరమునగల లవ్‌కవ్ సరస్సునందు పడవలవాడొకడు ఒకపడవపై కాపురముండెను. వాని కూతురు—ఏడాది వయస్సుగలది - పడవలో ఆడుకొనుచు ఆడుకొనుచు ప్రమాదవశమున నీటిలో పడిపోయెను. తల్లి మొదలగువారు ఆమె నీటిలో మునిగిపోవునని యే అలజడినొందిరి కాని ఇంతలో ఆబిడ్డ అత్యాశ్చర్యకరముగ తానుపడిన తావునుండి ఒడ్డువఱకుగల ఇరువది అడుగులదూరమును ఈదుకొనుచుపోయి గట్టు చేరెను. అచ్చటివారు ఆ శిశువును పైకెత్తిరి. ఇంతకు పూర్వము ఆ శిశువునకు ఈదువిద్య నేర్పబడియుండలేదు. ఈ అద్భుతకృత్యము చేసినందులకు ఆ బిడ్డకడ ఏదియో గొప్పమహత్తు ఉండితీరునని ఆచెంతగల గ్రామవాసు లందరును నమ్ముచున్నారు.

## ౯. పందొమ్మిదిమాసములనుండి ఒకటేనిద్ర

పెట్రీషియా మాగ్వ్యారి అని ఒక అమెరికనుస్త్రీ. ఆమె ఇరువదియేండ్లది. పందొమ్మిదిమాసములనుండి ఆమె ఒకటేనిద్రలో మునిగియున్నది. నిద్రనుండి ఆమెను లేపుటకు భిషగ్వరులు పలువురు పలుసారులు ప్రయత్నించి విఫలులైరి. ఈ నిద్రలో ఆమెను రెండు పుట్టినరోజులు గడచిపోయినవి. ఈ నిద్రలో ఆమెకు నిస్సత్తువకలుగుటకు మారుగా ఆమె తూనిక హెచ్చినది; ముఖవర్చస్సు, దేహసౌందర్యము పెంపొందినవి. ఈ నిద్రాసమాధిలోనే ఆమెకు నిరుటిశీతకాలమున న్యుమోనియావ్యాధి సోకి నివారణ అయినది. ఇట్లు నిద్రపోవుటకు కొన్నిదినములకు పూర్వము నిత్యము ఉదయమున ఆమెను నిద్రనుండిలేపుట అతికష్టముగానుండెను. ఒకనాడు ఆమె తానుపనిచేయు ఆఫీసునుండి వచ్చునపుడు రైలులోనే నిద్రపోయెను. తాను దిగవలసిన స్టేషనులో అతికష్టముమీద దిగి విశేషశ్రమతో ఇంటికి నడచిపోయెను. ఇంటికిపోయి ఆమె పండుకొనెను. అప్పటికి ఇప్పటికి ఆమె పాదవలన మెలుకగదు. ఆమె ఇట్లునిద్రాసమాధిలోపడిన తొలిదినములలో ఆమెకు నర్సుగానుండిన ఆమె ఇపుడు పెండ్లియాడి పిల్లతల్లియైనది. పెట్రీషియాకు ఈ పందొమ్మిది మాసములుగను కోడిగ్రుడ్లు, పాలు, నారింజరసము ఆహారముగ నిచ్చుచున్నారు. మన పురాణములలో కుంభకర్ణుడు ఆరుమాసములు ఒకటేనిద్రలోనుండుట వర్ణింపబడియున్నది. పెట్రీషియా విషయము దీనినికూడ మించుచున్నది.

## ౯. ఒకేసారిపుట్టి ఒకేసారిచనిపోయిన కవలలు

లీసెస్టరునందు మెక్రీఫీల్డు కుటుంబమున పాలిన్, లియోనార్డు అను కవల పిల్లలుపుట్టిరి. వారు పదునొకండువారములుమాత్రము జీవించిరి. జీవించిన ఈస్వల్పకాలమునందే వారు తమ ప్రవర్తనమునందలి సాదృశ్యముచే తలిదండ్రులను, వైద్యులను సంభ్రమాశ్చర్యములకు గురిచేసిరి. ఈ శిశువులకు శరీరములు వేరైనను ఆత్మ ఒక్కటియేనా అను సందేహము పొడమెను. ఒండొరులను స్పృశించుచుగాని వారు నిదురింపరు. ఒక శిశువు నిద్రించుచుండగా రెండవ శిశువునకు పాలు మొదలగునవిపోయుచో నిద్రించుచున్న శిశువుకూడ ఏదియో త్రాగుచున్నటుల పెదవులు కదుపును. ఒకనాటి సాయంకాలము పాలిన్ అను శిశువునకు ఈడ్పురోగము తగిలి మరణచిహ్నములు కనిపించెను. తండ్రి డాక్టరుకడకు పరువెత్తెను ఈలోగా రెండవ శిశువగు లియోనార్డునకు కూడ పెద్ద జబ్బుతగులుటచే ఆసుపత్రికి గొనిపోవలసి వచ్చెను. శిశువు లిరువురును ఒకేక్షణమున మరణించిరి.

## ౯. ఏడేండ్లు నిండని బాలిక ప్రసవించుట

'బ్రిటిష్ మెడికల్ జర్నలు'లో ఢిల్లీ డాక్టరు ఒకడు

ఇట్లు వ్రాయుచున్నాడు: "ఏడేండ్లు నిండని ఒక మహమ్మదీయబాలిక ఒక ఆడశిశువును ప్రసవించెను. పుట్టినపుడు శిశువు నాలుగుపౌనుల మూఁడు ఔన్సులు తూనిక ఉండెను. ప్రసవించిన మూఁడుదినములవఱకు తల్లికి ఈ అపూర్వప్రసవమును గూర్చిన భయము హెచ్చుగ నుండెను. మఱి యేవ్యాధియులేక ఆమె శీఘ్రముగ ఆరోగ్యమునందెను. ఆమె ప్రసవించి ఇప్పటికి తొమ్మిదిమాసములైనది. ఈ తొమ్మిదిమాసములుగ ఆమె శిశువునకు చాలినన్ని పాలీయగలుగుచునే యున్నది. ఇపుడు శిశువు పదునొకండు పౌనుల రెండు ఔన్సుల తూనిక ఉండెను. ఆరోగ్యశాఖాధికారి బాలిక వయస్సును నిర్ధరించుచున్నాడు. ఇంత పసితనమున ప్రసవించిన బాలికల వృత్తాంతములు ఇక నేమైనగలవా?"

### తల్లికి, కూఁతురికి, కొడుక్కి ఒకేనాఁడు పెళ్లి

యార్కుషైరు చర్చిలో ఒకేనాఁడు తల్లికి, కూఁతురికి, కొడుక్కి వివాహములు జరిగెను. పాశ్చాత్యనాగరికత ఎంతటి అభివృద్ధినందినదో!

### నేలమీఁదనడుచు చేపలు

బెరన్‌హార్డు ఫ్రీమాన్ అను నతఁడీనడుమ 'ఫ్రీమాన్ ఆఫ్ స్టాంబక్' అనుగ్రంథమును ప్రచురించెను. అందు తాను ఆస్ట్రేలియాలో నేలమీఁదనడుచు చేపలను చూచినవిధ మిట్లు వర్ణించుచున్నాడు. "ఎటు చూచినను అరమైలులోపున నీళ్ళులేని ఒకదిబ్బమీఁది పల్లములో నేను మూఁడు చేపలను చూచితిని. ఒక్కొక్కటి ఒక అడుగు పొడుగు ఉండెను. అవి సజీవములై ధారాళముగ గాలిని పీల్చుచుండెను. అవి 'సిరాటోడస్' అనుజాతికి చెందిన చేపలు. వానికి ఒక్కటే ఊపిరితిత్తి ఉండును. బయట – అనగా నీటిలోఁగాక – అవి పెక్కుదినములు ఉండఁగలవు. అవి అప్పుడప్పుడు చెట్లపలవలలో నివసించుచుండుటగలదు. ప్రస్తుతము ఆ మూఁడు చేపలను ఆ దిబ్బమీఁదికి వరదసమయమున కొనిరాబడియుండుననియు, అప్పటినుండి అవి అచట ఉండియుండుననియు ఊహింపవలసియున్నది."

### రెండుతలల తాఁబేలు

ఈనడుమ అమెరికాఖండమున రెండుతలల తాఁబేలొకటి కానవచ్చెను. బాగుగా పరీక్షచేసినమీఁద రెండుతలలు కలిగియున్న విషయముతప్ప మిగిలిన ఏ విషయమునందును వింతలేదని తెలియవచ్చినది. రెండు తలలుఉన్నను ఈవిడ్డూరపుజంతువునకు ఒకటే వెన్నెముక ఉండెను. కంఠస్థానమునుండిమాత్రము వేఱై రెండు తలకాయలు ఏర్పడియుండెను.

### చంద్రలోకమునకు కనిపించు దీపము

ఈనడుమ జర్మనులు ఒక బ్రహ్మాండమగు పొఁగయోడను నిర్మించిరి. అది ఇపుడు బాల్టిక్ సముద్రమున ప్రయాణము సల్పుచున్నది. ఆయోడకుగలదీపము అఖండమైనది. దానికి 3,000,000,000 కొవ్వువత్తుల కాంతి గలదు. చంద్రగోళమున నివసించు జీవికి ఈ అఖండజ్యోతి ఖగోళమునందలి ఆరవ ఆర్ద్రకు చెందిన నక్షత్రమునుండి వచ్చుచున్నట్లు కనుపించును. ఈ అఖండజ్యోతి మానవుని బుద్ధిబలమున కొకనిదర్శనము.

### గానమున కిట్టిశక్తిగలదు

ఆల్‌ఫ్రెడ్ మిన్సాస్ అని నార్వేదేశపు వ్యాపారస్థుడు. అతఁడు ఇరువదిసంవత్సరములు నిరంతరపరిశ్రమ సల్పి సంగీతమువలన ఆహారపదార్థములనుకూడ నిలువ చేయవచ్చునని కనుగొనినాఁడు. రోగములను మాన్పుటలో గానము శక్తిమంతమైనదని శాస్త్రజ్ఞు లీవఱకు కనుగొనియున్నారు. ఆహారపదార్థములు పాడగునట్లు చేయు క్రిములను నాశనముచేయుటకును సంగీతమునకు శక్తికలదని ఇపుడు కనుగొనియున్నారు. ఈపరిశోధనయొక్క నిజానిజములను తెలిసికొనుటకై హెర్‌బ్రఫ్ అను రసాయనికశాస్త్రవేత్త ఆరుమాంసఖండములను గొని అందు మూఁడింటికి ముప్పది నిముసముల సంగీతప్రాప్తి కలిగించెను. ఈమూఁడింటిని ఒక పెట్టెయందును, మిగిలిన మూఁడింటిని మఱియొక పెట్టెయందును జాగ్రత్తచేసెను. ఒకవారము జరిగినపిమ్మట ఆ రెండు పెట్టెలను తెఱచిచూచిరి. సంగీతప్రాప్తినందిన మూఁడు మాంసఖండములును చెక్కుచెదరక యథాస్థితియందుండెను. కూరగావండుకొని ఉపయోగించుటకు అర్హములై యుండెను. సంగీతము నందజాలకుండిన మూఁడు మాంసఖండములును బాగుగా చెడియుండెను.

# ఆరోగ్య విజ్ఞానము

## ౯. గొంతుక బొంగురుపోయినపుడు

నీటిపల్లటముచే గాని; క్రొత్తచింతకాయ, మామిడికాయ, పచ్చివెలగకాయ మున్నగు కాయలపచ్చళ్లు తినుటచే గాని; ఉపన్యసించుట, పాడుట, పోట్లాడుట మున్నగు కంఠముతో చేయుపనులను అధికముగ చేయుటచే గాని అపుడపుడు కొందఱకు గొంతుక బొంగురుపోవుచుండును. గొంతుకలోని కొన్నిపొరలు రేగి పైకి లేచి కంఠమును మూసివేయుటచేతనే బొంగురుగొంతుక కలుగుచున్నది. బొంగురుగొంతుక కలిగినపుడు అనాసపండురసమును త్రాగవలెను. కంఠములో రేగి పైకి లేచి స్వరమును వికారముగాచేయు సన్నని పొరలను అనాసపండురసము కోసివేయును. అందుచే కంఠస్వరము వెంటనే స్వాస్థ్యమునందును.

## ౯. నిమ్మరసము వాడదగు వ్యాధులు

పైన పూయుటచేతను, లోనికి తీసికొనుటచేతను నిమ్మరసము రోగకారకక్రిములను నాశనముచేయుటలో అమోఘముగ పనిచేయును. 'ఐయోడిన్' కంటె నిమ్మరసము ఉపయోగించుట మంచిది. ఐయోడిన్ రోగకారకక్రిములను చంపుటయేగాక చర్మపుపొరలను తినివేయును. నిమ్మరస మట్లుగాక చర్మపుపొరలకు ఎట్టిహానియు చేయక రోగకారకక్రిములను మాత్రము సంహరించును. భోజనాత్పూర్వమును, రాత్రి పండుకొనబోవునపుడును ఒక్కొక్క నిమ్మకాయరసమును తీసికొనుచో ఉబ్బసరోగము శాంతించును. పైత్యవికారములయందు ఆహారమును విడనాడి జీర్ణకోశమునకు పూర్తివిశ్రాంతి నిచ్చుచు దినమునకు ఐదుసారులు నిమ్మరసమునకు సమభాగముగా నీళ్ళు కలిపి తీసికొనుట చాలమంచిది. మొండికురుపులు, నాకలునాకలుగా పోయు కురుపులు, కుళ్లువ్రణములు వీనియందు నిమ్మరసమును ధారాళముగా పూయుచుండవలెను. పెద్ద కురుపులకు మొనతేలువఱకు నిమ్మరసమును ఆరారగా పట్టించుచుండవలయును. మొనతేలినతరువాత ఒకనిమ్మకాయను బాగుగా వెచ్చచేసి రెండుబద్దలుగా కోసి ఓర్చుకొనగలిగినంత వెచ్చదనముఉండగానే కురుపుపై వేసి కట్టవలయును. కురుపుచితికిన తరువాత ఒక పైంటు వేడినీళ్ళలో ఒకనిమ్మకాయరసమును పిండి చీము ఓడిపోవునట్లు బాగుగా కడిగి పిమ్మట కట్టుకట్టవలయును. పడిసెములయందు నిమ్మకాయను నిప్పుల పొయ్యలోవైచి తొక్క కాలి పగిలి రసముకారుటకు ప్రారంభముఅయినతోడనే తీసి రసముపిండి యుంచుకొని మూడుగంటల కొకసారి ఒకమిల్లిగరిటెడు అరసమును పుచ్చుకొనవలెను. శిశువులకైనచో ఈరసమున కొంచెము తేనెకలుపవచ్చును. రొంపభారము పూర్తిగ తగ్గువఱకు ద్రవరూపకమగు ఆహారమును తీసికొనుట మంచిది.

—సైంటిఫిక్ హెల్తు.

## ౯. పాలు సమగ్రమైన ఆహారము

క్షీరవిషయము ఇపుడు భారతదేశమున నొక పెద్ద సమస్యగానున్నది. ఆరోగ్యబలముల కొఱకు పాలు ఒక్క శిశువులకేగాక పెద్దవారికిగూడ ముఖ్యావసరమైయున్నవి. ఆహారముగా పాలయొక్క అధికృత ఆరోగ్యశాస్త్రవేత్తలు బహుధా వర్ణించియున్నారు. ఏ ఆహారపదార్థమునందును లేనిమాదిరిని పాలయందు వివిధపదార్థములు సమ్మేళనమునొంది వానిని సమగ్ర

మైన ఆహారపదార్థముగా నొనరుచుచున్నవి. పాలలో చక్కని సున్నపుపాలుగలదు. వీనియందలి ఫోస్ఫరస్ పదార్థముల కూడిక ఎముకల, దంతముల పెంపకమునకును, రక్షణమునకును సమర్థమైయున్నది. పాలయందు ఇనుము తక్కువగానున్నమాట నిజమేకాని ఉన్నకొద్ది పాటి ఇనుమును శీఘ్రముగా రక్తమున మిళితము కాజాలినదియైయున్నది. మనము తిను పప్పుదినుసులలోని ప్రోటీనులకు సహాయభూతములు కాజాలి పాలలోని ప్రోటీనులు కండరముల ఆరోగ్యస్థితికి కారణములై యుండును. పాలలో కొవ్వును, పంచదారయు చక్కని పాళ్లగనున్నవి. 'లాక్టోస్' అనబడు పాలలోని ఈ పంచదార పేగులలో కుళ్ళుపదార్థము చేరకుండ చేయును. పాలలోని విటమినులు శరీరపోషణమును గావించును; కొన్ని రోగములనుండి మానవుని కాపాడును; కొన్ని రోగములయందు రోగనిరోధకశక్తిని కలిగించును. వివిధపదార్థములు ఒక్కచో లభించుటచే పాలు సమగ్రమగు ఆహారమై మానవునకు ఉపకరించుచున్నవి.

## వెలగపండు

ఈ రోజులలో వెలగపళ్ళు విస్తారముగ లభించును. వెలగపండు సర్వదా అపథ్యకరమైన పదార్థమని మనవారిలో పలువురి అభిప్రాయము. ఇది దురభిప్రాయమనియే చెప్పవలసియున్నది. కొబ్బరికాయకువలె దీనికిని పైన గట్టిపెంకుగలదు. అగుటచే దుమ్ము మొదలగు దుష్టపదార్థములు లోనికి చొచ్చుటకు వీలులేదు. లోపలిగుజ్జు సులభముగా చెడిపోకుండుటకుగాను ప్రకృతిమాత వెలగపండు విషయమున చక్కని కట్టుదిట్టము చేసినది. బాగుగా పండిన వెలగపండు సువాసనగానుండును; పెంకుపై తెల్లని, సన్ననిపొరలురేగి వాని దిగువను మాగురంగును చూపును; పండు తేలికగనుండి కొంచము గట్టినేలమీదవైచినచో కొద్దిగా పైకిలేచి తిరిగి క్రిందికిపడును. ఇట్టి లక్షణములుగల పండు ఎన్నటికిని అపథ్యముగాదు. వస్తుగుణసర్వస్వము వెలగపండునుగూర్చి ఇట్లు చెప్పుచున్నది: "వెలగపండు సువాసనగలది, వేడిమిని పోగొట్టునది. బాగుగా పండిన పండులోనిగుజ్జు గడ్డకట్టిన మధురక్షీరముల రుచిగలిగియుండి తినదగియుండును. నోటనీరూరుట, కంఠము నొప్పి, కంఠములోవ్రణము, చిగుళ్లజబ్బు ఈ రోగములందు వెలగపండు చాల పథ్యమైనది. ఉప్పు, చింతపండు, మిరియములు మొదలగునవివైచి వెలగపండు గుజ్జుతో చేయబడిన పచ్చడిగాని, షరబతుగాని ఇచ్చిన ఎక్కిళ్ళు, అజీర్ణవ్యాధి, పిత్తాధిక్యము, గొంతుక జబ్బులు నయమగును. వెలగపండు గుజ్జులో తేనె, పిప్పళ్ళచూర్ణము కలిపియిచ్చిన ఎక్కిళ్ళు, శ్వాసావరోధము నివారణమగును. విషపుపురుగుల కాట్లకు పైనపట్టించుటచే వెలగపండుగుజ్జు మంచి పనిచేయును." మందాగ్నికలవారు వెలగపండును తినుటలో ఒక మెలుకువను చూపనగును. జామిపండులోని గింజలవలెనే వెలగపండులోని గింజలుకూడ సులభముగా జీర్ణముకావు కావున వెలగపండుగుజ్జును తేలికగ తొక్కిపిసికి గింజలను విడదీసి మిగిలినగుజ్జును పచ్చడిగా చేసికొని తినుట హితకరము. వెలగపండు పచ్చడిలో కొంచము పంచదార చేర్చికొనుట చాలమంచిది. పంచదార వెలగపండుకు విరుగుడువస్తువు కావున దానితో చేర్చికొనితినుటచే వెలగపండువలని దోషములు కలుగకుండును. వెలగపండులోని గింజలలో ఒక్కొక్కదానియందు అమృతముండుననియు, పండుఅంతను ఒక్కరే తినవలెనుగాని ఇతరులతో పంచుకొని తినరాదనియు పెద్దలు చెప్పుదురు. మలబద్ధరోగము కలవారుమాత్రము వెలగపండును ఉపయోగింపకుండుటమేలు. కంఠదోషములను మొదలంట పోకార్చుటలో వెలగపండు సాటిలేనిది. గ్రంథాంతరమున వెలగపండుగుణములు ఇట్లు చెప్పబడినవి: "వెలగపండ్లు కఫహారములు, పిత్తహారములు మాత్రమేగాక శ్వాసకు సంబంధించిన నొప్పులు (అనగా నూపిరికట్టునొప్పులు మొ.) మూలవ్యాధులు గ్రహణులు వెక్కిళ్ళు ఛర్దిరోగములు కాసరోగములు అరుచి శ్రమము నీరసము వాంతులు విదాహములు మున్నగు పిత్తరోగముల నన్నింటిని పోగొట్టును. త్రిదోషముల(వాతపిత్తకఫముల) ప్రకోపముల హరించును."

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౩౬. అడవిపువ్వులు

ఖండకావ్యముల సంపుటి. కృతికర్త : ఉభయభాషాప్రవీణ మిన్నికంటి గురునాథశర్మగారు. 'ఈ గ్రంథమునందలి కతిపయములకు మూలము శైర్వాణి. వానిని సంస్కృతప్రాస్తావికములకు యథేచ్ఛాపరివర్తనము లనవచ్చును. మఱికొన్ని బహుసంఖ్యాకములు స్వతంత్రము.' విద్యావిభూషణులును, సాహిత్యసరస్వతులును, అమృతలూరు సంస్కృతోన్నత పాఠశాలా ప్రధానాధ్యాపకులును అగు విద్వాన్ నా. వేంకటేశ్వరశాస్త్రిగారు ఈగ్రంథమునకు వ్రాసిన పరిచయవాక్యములలో నిట్లు వ్రాసిరి. "ఇందలి వర్ణనములన్నియు మనకు నిత్యప్రత్యక్షములగు విషయములగూర్చినవి. కోయిల, పద్మము, బంగారము, కాకము, మబ్బు, చందమామ మున్నగు విషయములు కేవల వర్ణనపరములే కాక సుమనోహరధ్వనిసంయుతములును, అత్యద్భుతోత్ప్రేక్షాద్యాభాసితములు నయి కావ్యమున కౌత్కృష్ట్యమును సంతరించుచున్నవి. కావున రసికుల కుపాదేయములనుట పునరుక్తప్రాయము." శైలి తెలియుటకై మూడుపద్యముల నిట పొందుపఱచుచున్నారము :

చ. పదములకూర్పు, వాక్యముల
వైఖరి, సద్రసపుష్టి, యర్థసం
పద, నవభావవిస్ఫురణ,
వ్యంగ్యవిలాసము, పద్యలక్షణం
బెది విడిపోవునో ? యనుచు
నెన్నియొ భంగులఁజూడనౌ విశా
రదులగు సత్కవీంద్రులకు ;
రాజుల కివగ లెల్ల లేవుగా !

శా. లే దర్థంబు, స్వరంబులేదు, శ్రుతియున్
లే, దక్షరాబద్ధముం
గా దభ్యస్తముగాదు, లాక్షణికముం
గా, దైన నేమీ ? మహా
హ్లాదంబుం గలిగించి, తన్మయులఁ జే
యంజాలు మహామ్మర ! నీ
కీ దివ్యామృత మెల్కుపాట పికమా !
యెట్లబ్బెఁ జైత్రంబునన్.

మ. నలుకంగా నగుఁ దుండెతుండెములుగా
నజై స్వరూపంబలన్,
గలుకుంగానుగ నైవఁగావలయు ని
ష్కారుణ్యతం, గానిచోఁ
జెలికా ! బెల్లమువెట్టుమంచు నరుఁడుం
జే సాఁపఁగాఁ బెట్టుదే ?
వెలపుంగొల్పినఁగాక సామమున ను
ర్విం గార్యముల్ సాగునే ?

సుందరరచనమున నొప్పుచున్న ఈగ్రంథము సుందరముద్రణమునందు ఆకర్షణీయముగ నున్నది. విద్యాధికారుల ఆదరణకు పాత్రమగుగాక ! క్రౌనుసైజున ౧౦౦ పుటలు. వెల రూ ౧-౦-౦. గుంటూరు టవున్ హైస్కూలు ఆంధ్రోపాధ్యాయులగు గ్రంథకర్తకు వ్రాసిన పుస్తకములు బడయవచ్చును.

## ౩౭. కవిజనరంజనము

పిల్లవసుచరిత్రయను ప్రఖ్యాతి నార్జించిన ప్రబంధములలో నొకటియగు ఈకవిజనరంజనమునకు అడిదము సూరకవి కర్త. ఈగ్రంథము మున్నెన్నడో ముద్రితమైనది. ఇపు డాప్రతులు దొరుకుటలేదు. అపురూపములగు ఆంధ్రశృంగారప్రబంధములను శృంగారముద్రణమున వెలయించి భాషాసతిని సేవించుచున్న శ్రీగంటి సూర్యనారాయణశాస్త్రిగారు ఇపుడు తిరిగి ఆకవిజనరంజనమును ముద్రించి లోకమునకు చేకూర్చియున్నారు.

గ్రంథము మంచి ఫెదరువెయిటు కాగితములమీద ముద్రింపబడినది. ఆంధ్రప్రబంధముల్ని కిల్లు ముద్రణవిషయమున సౌభాగ్యమునుగూర్చుచున్న శ్రీశాస్త్రిగారిని బహుధా ప్రశంసింపవలసియున్నది. కవిజనరంజనమునకు ఆంధ్రకవిత్వచరిత్రకారులును, కవులును, పండితులును అగు భోగరాజు నారాయణమూర్తిగారు సవిమర్శకమగు పీఠికను వ్రాసియున్నారు. అందు వారు కవిజీవితమును, కవితారీతులును వెల్లడించిరి. 'ఈ కవిజనరంజనము మొత్తముపై 260 పద్యములుగల మూఁడాశ్వాసముల గ్రంథము. ఇందలి ప్రధానకథ చంద్రమతీహరిశ్చంద్రుల వివాహమహోత్సవము. ఇందలికథ మిక్కిలి చిన్నదైనను కవి లాక్షణికుఁడగుటచే నష్టాదశవర్ణనములతోఁ గావ్యమునందంతటఁ దన యనల్పకల్పనాశిల్పమును విరివిగాఁ బ్రకటించెను.' గ్రంథము వెల రూ ౧-౦ ౦. వలయువారు కళ్యాణిఆఫీసు, విజయనగరము, విశాఖపట్టణము జిల్లా, అను విరునామాకు వ్రాయునది.

## ౩౮. త్యాగమహిమ

గ్రంథకర్త దేశసేవకులగు గొల్లపూడి సీతారామశాస్త్రిగారు. శ్రీవారు కడలూరు కారాగృహమునందుండినప్పుడు బౌద్ధసంబంధమైన వినయపిటక గ్రంథములు మూడింటిని చదివి వానిలో ముఖ్యములైన పదమూడు కథలను తెనుగుచేసి ఇపు డీశీర్షికతో కూర్చి గ్రంథరూపమున ప్రచురించిరి. శైలి సులభముగనుండి వడిగా సాగిపోవుచున్నది. కథలన్నియు ప్రాయికముగా త్యాగమహిమను రూపించుచున్నవి. బౌద్ధయుగము నాటి సంప్రదాయములు కొన్ని ఈగ్రంథపఠనమువలన తెలియవచ్చుచున్నవి. గ్రంథము క్రౌనుసైజున 80 పుటలు. మూల్యనిర్ణయమునుగూర్చి శాస్త్రిగారు తొలిపలుకులో వ్రాసిన క్రిందిపంక్తులు ఆంధ్రగ్రంథప్రచురణకర్త లందఱును గమనించుటలెస్స: "ఈ గ్రంథము అచ్చువేయుటకు రు 98-8-0 లు ఖర్చులు అయ్యెను. వాడినకాగితము టిటఘర్ యంత్రశాలలో తయారైన స్వదేశీకాగితము. దీనివెల రు. 0-1-6. అన్నిప్రతులు అమ్మినయెడల రాదగిన మొత్తం రు. 187-8-0 ప్రకటన ఖర్చులువగైరా రుసుములు పోను మిగిలినది దేశసేవకై వినియోగించబడును. శుద్ధఖద్దరును చౌకచేయుటకు ఎట్లు వీలగునో ప్రజలకు ఉపయోగకరమగు గ్రంథములను గూడ చౌకజేయవచ్చునని దీనివలన ఋజువగుచున్నది" రెండణాల తపాలబిళ్ళల నంపిన గుంటూరుజిల్లా ఖద్దరు సంఘము, గుంటూరునుండి బడయగలరు.

## ౩౯. చంద్రహారము

రాజమహేంద్రవరమునందలి వాణీగ్రంథమాలలో మూడవ కుసుమము. శ్రీయుత అరవ వెంకటస్వామిగారిచే రచియింపబడినది. భారతి, గృహలక్ష్మి, సమదర్శిని పత్రికలలో లోగడ గ్రంథకర్త ప్రచురించిన చిన్నకథలకు ఈగ్రంథము సంపుటీకరణము. "సంఘములోయున్న కొన్ని దురాచారాలిన్ని, యీ కథల్లో విమర్శించాను. వేశ్యపాతుకపోయిన, అస్పృశ్యతావరశుల్కాది దురాచారాలు సాంఘికాభ్యుదయాభిలాషుల్లో కొంతమందైనా రూపుమాప ప్రయత్నిస్తే నా ప్రయత్నము, ఆశయమూ నెరవేరుతవి. కథలన్ని - ఒక్క చంద్రహారముతప్ప - స్వకల్పితాలే." అని గ్రంథకర్త 'పీఠికలో తెల్పుకొన్నాడు. ఈ కథలన్నిటిలో 'యీరమ్మ' చాల బాగున్నదని మాయభిప్రాయము. క్రౌనుసైజున 132 పుటలు. వెల 0-4-0 మాత్ర మే. కాలక్షేపార్థము చదువుకొనుట కనువైన గ్రంథము. చిరతరాభ్యాసముచే శ్రీవేంకటరత్నముగారు ఇంకను ప్రశస్తములగు కథలను వ్రాయగలుగుదురని ఆశించుచున్నాము.

## ౪౦. కవిత్వచింతామణి

గ్రంథకర్త చదలువాడ కోటినరసింహముగారు. ఆంధ్రభాష నభ్యసించుటకు అవసరములైన వ్యాకరణాంశములు, అలంకారములు, ఛందోలక్షణములు ఇందు చక్కని పద్ధతిని వివరింపబడినవి. బంధగర్భకవితాలక్షణములుకూడ ప్రస్తరింపబడినవి. ఉన్నత పాఠశాలలలోని విద్యార్థుల కీగ్రంథము పాయరానిమిత్రము. ముఖ్యముగా సంధిప్రకరణము, సమాసప్రకరణము విద్యార్థులకు ఎక్కువ వరణీయమగుపద్ధతిని రచియింపబడినవి. కావుననే సమకాలికవిద్వాంసులు పలువు రీగ్రంథము

ప్రశంసించియున్నారు. క్రౌను సైజున 130 పుటలు. వెల 0-12-0. వలయువారు గ్రంథకర్తపేర పర్వతస్వామి శర్మగారు, పెద్దకూరపాడు పోష్టు, సత్తెనపల్లి తాలూకా, గుంటూరుజిల్లా అను చిరునామాకు వ్రాయునది.

## ౪౧. కర్షకుని కాలగతి

ఆదర్శగ్రంథమాలలో నాల్గవపాత్రము. ప్రపంచ ప్రఖ్యాతి నార్జించిన టాలుస్టాయి మునిసత్తముని రచనకు తెలుగుసేత. అనువాదకులు 'నవయుగ' సంపాదకులగు గద్దె లింగయ్యచౌదరిగారు. రైతుజనమునుగూర్చిన ఈమహోత్కృష్టగ్రంథము ధారాళమగు వాడుక భాషలో వ్రాయబడినదగుటచే విశేషప్రచారమునందునని తలంచుచున్నాము. కలిపురుషుని దూతలు కర్షకులను భగవంతునినుండి ఎట్లు దూరముగ గొనిపోదురో ఇందు చక్కగ వివరింపబడినది. ప్రతి తెనుగురైతు దీనిని చదివి అర్థలాభమునందుగాక! క్రౌనుసైజున 48 పుటలు. వెల రెండు అణాలు. దొరుకుచోటు ఆదర్శగ్రంథనిలయము, ఎలమర్రు, కృష్ణాజిల్లా.

## ౪౨. నీతికథానిధి

'నీతికథానిధి' అను ఈసపుకథలు. కర్త: తాడూరి లక్ష్మీనరసింహారావుపంతులుగారు. ఇవి 1892 ప్రాంతమున రచియింపబడి అపుడు భీమవరమునుండి చెన్నాప్రగడ రామమూర్తిగారిచే ప్రచురింపబడుచుండిన 'ధర్మవర్ధని' అను పక్షపత్రికలో ప్రచురింపబడినవి. ప్రత్యేకగ్రంథరూపమున 1910 లో మదరాసు ఆనంద ముద్రణాలయాధిపతులచే ప్రచురింపబడినది. గ్రంథకర్త దీనిని 1932 లో తిరిగి ముద్రించెను. ఆ కూర్పు ప్రతులు వెంటనే అమ్ముడుపోవుటచే ఈవత్సరము తిరిగి ముద్రింపబడెను. గ్రంథము విశేషప్రచారము నందియుండుట ఇందువలన తెలిసికొననగును. ఈ సంవత్సర మిది ట్రెయినింగుస్కూళ్ళలో పాఠ్యగ్రంథముగా నుంచబడినది. కథ అంతయు వచనమునను, నీతి పద్యమునను చెప్పుచు పంతులుగారు గ్రంథమును సులభశైలిలో నిర్వహించిరి. క్రౌనుసైజున 56 పుటలు. వెల 0-4-0 అణాలు. వలయువారు గ్రంథకర్తపేర రాజమండ్రి వ్రాయునది.

## ౪3. శ్రీకృష్ణాపుష్కరము

కూచిభొట్ల ప్రభాకరశాస్త్రిగారిచే రచియింపబడినది, కృష్ణానదీమాహాత్మ్యము, పుష్కరప్రశంస, పుష్కరదానవిధానము, కృష్ణానదీపూజావిధానము ఇందు వివరింపబడినవి. క్రౌనుసైజున 24 పుటలు. వెల 0-1-0. ప్రకాశకులు: వి. వి. యల్. పంతులుగారు, రేపల్లె, గుంటూరుజిల్లా.

## ౪౪. కంఠమాల

హాయి; రాజమహేంద్రవరము; కాదు, కాదు; నమ్మకాలు; స్వర్గములో విలాపము; కన్నకడుపు; సుమబాల పాట; చాణక్యుని ప్రార్థన—అను శీర్షికలుగల పద్యముల సంపుటి ఈ కంఠమాల. ఇందలి 'రాజమహేంద్రవరము' రాజరాజనరేంద్రపట్టాభిషేకసంచికయందును, 'కాదు, కాదు' మున్నగు కొన్ని ప్రబుద్ధాంధ్రపత్రికయందును ప్రచురితములు. ఛందోవిషయమున కవి ఈ గ్రంథమున తన 'సుమబాల' యందువలెనే స్వతంత్రపథమును ద్రొక్కెను. చూడుడు: 'హాయి', 'రాజమహేంద్రవరము' అను ఖండకావ్యములలో వాడబడినవృత్తము ఉత్పలమాల. ఇందు యతిప్రాసములు మానివైచి కవిభాషా సౌలభ్యసంపాదనార్థము సమ్మానార్హమగు నూతనపథమును ద్రొక్కెను. 'హాయి' అనుకావ్యము 'మహత్తు లదృష్ట నివాసులయ్యు సంతోషితసర్వమానవ సమాజసమూకలితోరుసద్గుణోదారులుగారె?' అను సత్యమును ప్రస్ఫుటము చేయుచున్నది. వీరేశలింగవీరుని కార్యక్షేత్రమగు రాజమహేంద్రవరమునందలి ఒక ఉన్నతపాఠశాలకు ప్రధానాచార్యుడైన కవి 'రాజమహేంద్రవరము' అను కావ్యమున ఆపట్టణమును 'ఆంధ్రసరస్వతీపఠనమందిరము' గను; నన్నయఆంధ్రవాణిని తల్లి, దాది; తండ్రి, గురుడు; భార్య, తోడు గను వివరించి ఉత్తేజమును కల్గించుచున్నాడు. 'కాదు, కాదు' అను కావ్యమునందలి భావములు గభీరములు. 'కన్నకడుపు' జాలిగొలుపు భావములతో నిండారియున్నది. శైలి తెలియుటకై 'స్వర్గములో విలాపము' అను కావ్యమునుండి కొన్ని చరణములు:

"ధరణీతలంబునకు నరిగి, యచ్చట నొక్క
యరదిన మెకాదు, యుగమంత మగుదాక నీ
వఱచినను, ఏడ్చినను, మఱియభోజనమున్న

మఱియింక నేమన్న, మఱియేమిచేసినను,
కరుణమైయమృతంబు, పరిక్షోభమునవిషము,
కురియించి నప్పటికి కుదర దాశోగము."

గ్రంథము క్రౌనుసైజున 86 పుటలు. వెల 0-6-0 అణాలు. వలయువారు ఏతద్గ్రంథకర్తలగు శ్రీజయంతి గంగన్నగారికి రాజమండ్రి వ్రాయనగును.

# క్రొత్తపత్రికలు

## ౧. సహకారిమిత్ర

ప్రతిశుక్రవారమున నెల్లూరిలో ప్రకటితమగు సహకారవార వార్తాపత్రిక. సహకారోద్యమాభ్యుదయమే దేశాభ్యుదయము. కాగా సహకారోద్యమప్రచారమునకై ప్రత్యేకము బద్ధకంకణయై ప్రచురింపబడుచున్న 'సహకారిమిత్ర'కు అక్షరాస్యులగు నాంధ్రులెల్లరును ఘనస్వాగత మీయగలరని ఆశింతుము. ఆంధ్రదేశపు సహకారనాయకశిఖామణులగు నరసింహదేవర సత్యనారాయణగారు, ఆంధ్రవిద్యాధికులగు మామిడిపూడి వేంకటరంగయ్యగారు మున్నగువారు ఈ పత్రికయొక్క ఆలోచనసంఘమున సభ్యులై పత్రికప్రతిష్ఠకు మంచి పునాదినివైచిరి. భారతదేశభాషలలో ఇక నెందును సహకారవిషయకమగు వారపత్రిక లేదు. సాహసించి తెనుగువారికిట్టి దానిని ప్రసాదించిన సహకారిమిత్ర సంపాదకులు మన్నేపల్లి రామకృష్ణరావుగా రెంతయు కొనియాడదగియున్నారు. విదేశసహకారవార్తలు, దేశసహకారవార్తలు మున్నగు శీర్షికలు పత్రికవిలువను పెంచుచున్నవి. సంపాదకీయములు సులభశైలిలో నొప్పుచు విజ్ఞానదాయకములై ఒప్పుచున్నవి. పత్రిక చిరకాలమునని తెనుగుమాగాణిని సేవించుగాక యని మనఃపూర్వకముగ ఆశించెదము. సాలు చందా రు 3-0-0.

## ౨. చిత్రగుప్త

ఈ నూతన సచిత్ర మాసపత్రికకు మాస్వాగతము. 'ప్రజల నిత్యజీవనములో తరుచు ఎదురవుతూవుండే నైతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయాది సమస్యలను విడమర్చి సామాన్యజీవికి తేటవ్యాసాల'లో తెలుప ప్రచురింపబడుచున్న ఈ పత్రిక తొలిసంచికలోని వ్యాసములన్నియు సంపాదకుల సంకల్పమును చక్కగ నెరవేర్చుచున్నవి. మార్షల్ పిల్సుడ్స్కినిగూర్చి తెలుగువారికి మొదట చెప్పినది ఈ పత్రికయే యగుచున్నది పెక్కు చిత్రములతో నిండాఱియుండుటచే ఈ పత్రిక అచిరకాలముననే విశేషప్రచారమునంది వయోజనవిద్యావ్యాప్తికి యథాశక్తిని తోడుపడగలదు. వ్యంగ్యచిత్రములను విశేషముగ ప్రచురించు తెనుగుపత్రిక ఇదియొక్కటియే అనవచ్చును. ఇంతకును పత్రిక చాలచవుక. సాలు చందా రు 1-0-0. విడిసంచిక 0-1-6 మాత్రమే. చిరునామా: 6, లాయర్ చిన్నితంబిమొదలివీధి, సావుకారుపేట, మదరాసు.

## 3. సరస్వతి


ప్రతి ఆదివారము విశాఖపట్టణమునుండి పుస్తకరూపమున ప్రచురింపబడు వారపత్రిక. మండలమునకు ఒక్కొక్కవారపత్రికయైనయుండుట అవసరముగలదు విశాఖపట్టణమండలమునకు ఇదియొక్కటియే వారపత్రిక. కావున ఆమండలవాసులు ఈపత్రికను హెచ్చుగ పోషింపగలరని నమ్మెదము. ఈ పత్రిక సంపాదకులగు శ్రీ వెంపటి సత్యనారాయణగారు పట్టభద్రులు గావున పత్రిక సత్యరీతుల నడుపబడునని ఆశింతుము. సాలు చందా రు 2-8-0. విడిసంచిక 0-1-0.

## ౪. విశ్వకళ

ప్రతిమాసము 15 వ తేదీన గుంటూరునుండి వెలువడు సారస్వతవిషయక మాసపత్రిక. సంపాదకులు యువకవులగు కుందుర్తి నరసింహారావుగారు. అక్టోబరుమాసమున వెలువడిన తొలిసంపుటము రెండవసంచికలో వున్నవ లక్ష్మీనారాయణగారి 'తిరస్కృత' అను గేయవ్యాసము మనోజ్ఞముగ నున్నది. సాలు చందా రు 1-0-0. విడిసంచిక రు 0-2-0 అణాలు.

## ౫. శశి

నూత్నకళాప్రపంచమును యథోచితముగ సేవింప విజయనగరమునుండి ప్రచురింపబడు మాసపత్రిక. ఈ తొలిసంచికయందలి పద్యవ్యాసములు ప్రౌఢకవితావిలసితములైయున్నవి. 'విడిపత్రిక వో అణా. సాలు చందా పది అణాలు. వెవ్వార్లకు పోస్టేజి ప్రత్యేక




# రాజపాళెయమందలి ఆంధ్ర క్షత్రియులు

(తమిళదేశమందలి రామనాథపురం జిల్లా రాజపాళెయ మంధలి ఆంధ్ర క్షత్రియ కుటుంబముల సంక్షిప్త వివరములు.)

## దక్షిణాంధ్రులు

ఆంధ్రదేశచరిత్రయందు మిక్కిలి ప్రసిద్ధమైన విజయనగరసామ్రాజ్యకాలమున, ఆంధ్రులు దక్షిణదేశమునందంతటను, వలస లేర్పరచుకొని యుండిరి. అఖండ సామ్రాజ్య ధురంధరుడగు శ్రీ కృష్ణదేవరాయలవారు చోళ పాండ్య కేరళాది దేశముల జయించి, అందందు దన ప్రతినిధుల నియమించి పాలించియుండుటయే ఆకాలపు తెలుగు వలసలకు గారణమైయున్నది. నేటి కిని అరవదేశమున 26 లక్షల యాంధ్రులు నివసించుచున్నారు. ఆంధ్ర సామ్రాజ్యధ్వజము తమిళదేశమున స్థిరముగ నాటబడి యుండుటచేతనే ఇందరిజనుల కాదేశము తావిచ్చియుండినది. ఆంధ్రులచే నిర్మింపబడిన గ్రామములు వందలకొలదిగా వ్యాపించియున్నవి. అట్టి గ్రామములలో కెల్ల పెద్దదియనదగు మా రాజపాళెయపు బుట్టుకయు, నది రాజులకెల్లు వలసగా నేర్పడినదియు వివరించుటకు ముందు స్థానికవివరముల గొన్నిటి దెలుపవలసియున్నది.

## స్థానిక వివరములు

రాజపాళెయ గ్రామము భారతదేశపు దక్షిణాగ్రమున తూర్పు పడమర సముద్రములకు 50 మైళ్ళసమ దూరమునను, కన్యాకుమారి కుత్తరమున నూరుమైళ్ల దూరమునను, రామనాథపురంజిల్లాలో చేరియున్నది. శ్రీ కృష్ణదేవరాయలచే దమ విష్ణుచిత్తీయమున వర్ణింపబడిన శ్రీవిల్లిపుత్తూరను వైష్ణవక్షేత్రము ఇచటకు ఉత్తరమున 7 మైళ్ళదూరముననున్నది మీనాక్షీక్షేత్రమగు మధురనుండి 50 మైళ్ళ మోటారు ప్రయాణమువల్లను, విరుదునగర్ జంక్షనునుండి రైలుమీదను ఈగ్రామము చేరవచ్చును. ఊరికు పడమర 8 మైళ్ళదూరమున అత్యున్నతములగు పశ్చిమ కనుమల వరుసయు, వ్యాఘ్రాది జంతుసమన్వితమగు మహారణ్యమును వ్యాపించియున్నవి. అందుండి వెలువడు సెలయేళ్ళచే నిచటి చెఱువులు నిండుచుండును. ఈ యడవులలో కొండల మీదినుండి దుముకుచు పాఱుచుండు జలధారలు, అచ్చటచ్చట నిర్మింపబడిన వనదేవతా మంటపములు, నాగరికుల నాకర్షించుచుండును. కిలకిల కూయుచు నెగురుచుండు పక్షులును, పరిసరములనున్న పొలములయందలి సస్యముల బాడుచేయు అడవియేనుగులును, పందులును, నిర్భయముగా సంచరించు లేళ్లును, మేతకై వచ్చిన గ్రామపశువుల దమ పాట్టన బెట్టుకొను వ్యాఘ్రాది క్రూరమృగములును, రాచ వేటకాండ్ర నాకర్షించును. అడవి నరికియు కట్టెలు కసుభ్రల నమ్ముకొని జీవించు బీదవారికిని, పశువుల మేపుకొను గొల్లలకును, సంవత్సరమునకు సరిపోవు చింతపండు నేరుకొను గ్రామస్థులకును, గుత్తకు దీసికొని కలపవర్తకము జేయు వ్యాపారులకును, తేనె కరక్కాయలు మొదలగు కొండ వస్తువులను నమ్మువారికిని ఈయరణ్య మెంతయో లాభకారిగ నున్నది. ఈయడవిదగ్గిర భూములందు మెట్టపంటలు పండించబడును. ఈపొలముల కావల మైళ్ళకొలది వ్యాపించియున్న తోపులలో కొబ్బరి, అరటి, మామిడి, పనస, నారింజ మొదలగు ఫలవృక్షములును, బూరుగచెట్లును సమృద్ధిగ నున్నవి. ఊరును చుట్టుకొని అయిదారు చెరువులున్నవి. వాటిక్రిందనున్న

భూములు, వ్యవసాయము జేయుట కీని రుపయోగింపబడును. ఇక్కడ మొత్తము 3 వేల ఎకరములు మాగాణీపంటలకును, 30 వేల ఎకరములు మెట్టపంటలకును, 2 వేల ఎకరములు తోపులకును ఉపయోగింపబడుచున్నవి. మెట్టపంటలలో ముఖ్యముగా ప్రత్తి, రాగి, మినుములు, జొన్నలు, ఆముదములు, నువ్వులు, మిరప మొదలగునవి ఎక్కువగ పండును. మొత్తము మీద సాగుబడి చేయబడు భూములలోగాని, ఉపయోగింపబడు అడవులు తోపులలోగాని సగమునకు పైగనే ఆంధ్రక్షత్రియసోదరులకు చెందియున్నది. మూడు నాలుగు చిన్నపల్లెలుగా నేర్పడియున్న ఈగ్రామము, జనసంఖ్యనుబట్టియు, వైశాల్యమునుబట్టియు గ్రామమనిపించుకొనదు. 1921 నివేదికనుబట్టి ఇందలి జనసంఖ్య 33,184. ఈ చుట్టుప్రక్కలకన్న నిది ఆరోగ్యవంతమగు ప్రదేశమగుటచేతను, కాయకష్టములజేయు జన మధికముగ నుండుటచేతను, ఇందలి జనసంఖ్య సత్వరాభివృద్ధి గాంచుచున్నది గత 50 సంవత్సరములలో 3 రెట్లధికముగా పెరిగినది. క్షత్రియులు సుమారు 8 వేలును, బ్రాహ్మణులు, భట్రాజులు, కమ్మలు, బలిజ, శెట్టి, కంసాలి, కుమ్మర, దొమ్మర, మాదిగ మొదలగు కులములవారు సుమారు 4 వేలును మొత్తము 12 వేలమంది తెలుగువారును; మిగిలిన 21 వేలు తమిళులును ఉన్నారు.

## వలసచరిత్ర

క్షత్రియేతరులగు దక్షిణాంధ్రుల వలసకు కారణమగు విజయనగర సామ్రాజ్యమే క్షత్రియుల వలసకును కారణమని నిశ్చయింపవచ్చును. విజయనగర సైన్యముల మూలముననే ఆంధ్రక్షత్రియకుటుంబములు పాండ్యదేశమున బ్రవేశింప గలిగినవి. ఇది వాస్తవమని నమ్ముటకు కొన్ని యాధారములుగూడ కానవచ్చుచున్నవి.

(1) పాండ్యమండలాధినాథులగు నాయకరాజులలో నెనిమిదవవాడును, క్రీ. శ. 1659 మొదలు 1682 వఱకు రాజ్యమేలిన చొక్కనాథనాయకర్ వలన మా పూర్వులు పొందిన దానశాసనమునకు దాళపత్రప్రతియొకటి కానవచ్చుచున్నది. అందు పూసపాటి అప్పలరాజు, చిన్నయరాజు, కృష్ణమరాజు, గోపాలరాజు అనునలుగురు మధురసంస్థానసైనికపరిపాలనయందు నియమింపబడియుండిరనియు, వారు 36 సంవత్సరము లాపనిని నిర్వహించి ఇంటికిబోవునపుడు వారికేర్పాటైన జీతమిచ్చుటయేకాక, యీరాజుల కోరిక ప్రకారముగా దానధర్మములు చేయునిమిత్తమై కొంత భూమినిగూడ నుచితముగ నొసగినట్లు తెలియుచున్నది.

(2) ఇవిగాక ఆదిని విజయనగరమునుండి బయలుదేరి వచ్చినటుల ప్రబలమగు జనశ్రుతియొకటి గలదు. ఇది ప్రస్తుతపు విశాఖపట్టణమండలమందలి విజయనగర సంస్థానమనియే కొందరు భావించుచుండిరి. కాని క్రీ. శ. 1700 వఱకు విజయనగరనిర్మాణమే జరిగియుండక పోవుటవలనను, అంతకు చాలపూర్వమే పాండ్యరాజ్యమున క్షత్రియులు ప్రవేశించియుండినందునను, విజయనగరమనిన కర్ణాటకరాజ్యస్థమగు విజయనగరమనియే నిశ్చయమగుచున్నది.

(3) మా పూర్వులచే రచింపబడిన కొన్ని యాంధ్రగ్రంథప్రతులయందు ఇక్కడి గొట్టుముక్కలవారికి మహామండలేశ్వరులను బిరుదు కానవచ్చుచున్నది. విజయనగర సామ్రాజ్యపరిపాలనయందు ఇట్టి పదవులును, ఉద్యోగములును, ఉండియుండుటచేత సామ్రాజ్య పరిపాలనయందు వీరుకూడ చేరియుండిరని యూహింప వీలగుచున్నది.

(4) ఆంధ్రదేశక్షత్రియులలో లేని "ఎఱ్ఱగుంటల" యను గృహనామము మాలో గానవచ్చుచున్నది. ఓరుగంటి యను పేరే యిట్లు మారినదని శ్రీ పొత్తూరి కృష్ణమరాజయోగిగారు సెలవిచ్చియున్నారు. కాని ప్రథమమున వీరింటిపేరేదోయొకటిగ నుండినను, కడప జిల్లాయందలి "ఎఱ్ఱగుంటల" గ్రామసంబంధమును బట్టియే వీరి కీపేరు నూతనముగ నాపాదింపబడినట్లూహించుచున్నాము. కనుకనే విజయనగర పరిసరములనుండి మే మీదక్షిణదేశమున బ్రవేశించితిమని చెప్పుటకు కారణమగుచున్నది.

—సశేషము.

# ఇన్సూరెన్సు విషయములు

## ఆర్థిక విధానము : ఇన్సూరెన్సు

ఇదివరకు (సెప్టెంబరు సంచికలో) ఆర్థికవిధానమన నేమో వివరించితిమి. ఆర్థిక విధానమునకును యిన్సూరెన్సునకును ప్రతి శాఖయందు సంబంధమున్నది. ఆర్థికవిధానమున ఇన్సూరెన్సు ఒక భాగముగనే యెంచబడును. అదెట్లో గమనింతము.

### ఇన్సూరెన్సు : వస్తు నిర్మాణము.

వస్తువులను తయారుచేయు ఉత్పత్తిశాఖయందే యిన్సూరెన్సు యెక్కువ ప్రాముఖ్యతను బడసియున్నది. ఉత్పత్తికి ప్రథమోపకరణమైన ప్రకృతితో యిన్సూరెన్సుకు సంబంధములేదు. మానవునిచే వుపయోగింపబడని స్థితిలో ప్రకృతి ప్రసాదించు వస్తువులు, శక్తులు, ప్రకృతి నాబడునని అర్థశాస్త్రవేత్తలు యెంచుదురు. అట్టి వస్తువులను, శక్తులను మానవుడు చేయూతగగొని వస్తుచయమును సృష్టించుచున్నాడు. అప్పుడవి పెట్టుబడిగనో లేక ఉపయోగార్హమగు ఐశ్వర్యముక్రిందనో పరిగణింపబడును. వాడబడని స్థితిలో ప్రకృతి యిన్సూరెన్సురక్షణ పొందుటకు నిమిత్తముండదు. మానవునికి వాటిని రక్షింపవలెనను ఉద్దేశమును వుండదు.

### పని, లేక కృషి.

ఈపని, లేక, కృషి ఉత్పత్తికి రెండవపరికరము : ముఖ్యసాధనమును. ఇన్సూరెన్సు యీశాఖతో గొప్ప కలయికగల్గి యున్నది. మన నాగరకతకు పునాది కుటుంబము. కుటుంబపోషణకర్త తన కుటుంబమునందలివారి కుచితరీతి సౌకర్యము లేర్పాటుచేయు నిమిత్తము యేదో ఒకపనిలో ప్రవేశించి, తన శక్తికొలది కృషిచేయుచున్నాడు. ఈపని లాభకరమైనదిగనే యుండును. సాధారణముగ తన బిడ్డలు తనకన్న ఉన్నతస్థితిలో నుండవలెననియే ప్రతితండ్రియు కోరును.

ఇట్లు అతనుచేయు పనులసందర్భములో అతనికి సహచరులతోను, యజమానులతోను, తదితరులతోను పరిచయమేర్పడును. అతనికి ఆకస్మిక ప్రమాదమో, జాడ్యమో, మరణమో, నిరుద్యోగమో, పనిచేయుటకు శక్తి చాలకపోవుటయో కలిగి, తనపనినుండి విరమింపవలసిన అవసరము వచ్చును.

ప్రతిదేశమును, ప్రజల సహాయమును కోరుచున్నది. వారు చురుకుగ, నిరాటంకముగ ఉత్పత్తి కుపకరణములగు యితరసాధనముల సహాయముచే వస్తునిర్మాతలగుచున్నారు. వారి కుటుంబము లందువలన రక్షింపబడవలెను. ఈ శాఖయందు యిన్సూరెన్సు, ప్రభుత్వమువారిచే కొంతయు, యిన్సూరెన్సు కంపెనీవారి వల్ల కొంతయు ప్రబలినది.

జీవితభీమావలన, పోషణకర్త మరణింపుచో తోడనే అతని కుటుంబము సంఘముపై ఆర్థికభారము వేయ

**సుభాషితము**

**౧౩**

“మనదేశమున (అనగా అమెరికాదేశమున) నిత్యజీవనమునందు జీవితభీమా విశ్వవ్యాప్తమైయుండుట అమూల్యమైన విషయమై యున్నది. మనజాతీయసత్క్రమాభివృద్ధికి అదియొక చక్కని ఫలమని నేను నమ్ముచున్నాను.”

— హెర్‌బర్టు హూవర్.

నవసరములేదు. క్రమముగ కొద్దిగ ప్రీమియములు కట్టుచు వచ్చిన, ఎపుడు మరణించిన అప్పుడు మొత్తముగ కొంత ద్రవ్యము యిచ్చుటకు కంపెనీలు బాధ్యత వహించును. ఈసొమ్ము, కొన్ని సమయములందు, కొన్ని కుటుంబములకు చాలకపోయినను, కుటుంబములు విడిపోక యుండునట్లు కాపాడి, వారి కొక విధమైన ఆధారమును కల్గించుచున్నది.

ఈ యంత్రయుగమున, మానవుడు ప్రమాదములకు లోనగుచున్నాడు. ఒక యంత్రశాలయందు పనిచేయువాని కెపుడైనను ప్రమాదము సంభవింపవచ్చును. ప్రభుత్వము కార్మికనష్టపరిహారక చట్టము, (వర్కుమెన్సు కంపెన్సేషన్ ఆక్టు), న్యాయచట్టము (కామన్‌లా) మూలకముగ వీరికి వసతు లేర్పరచినది. ఎవనికైనను తనవద్ద పనిచేయుచున్నపుడు, ప్రమాదము కల్గినను, అందువలన మరణము సంభవించినను, యజమానుడు నష్టపరిహార మివ్వవలెను. ఈ భారము కొంత స్వల్పద్రవ్యమునకు ఇన్సూరెన్సుకంపెనీలు వహించుచున్నవి. యజమానుడు విచారముతీరి, తన మూలధనమును యితర లాభకరములగు పరిశ్రమలలో వెచ్చింపవచ్చును. తమకేదైన జాడ్యముకల్గి అందువలన జీవనోపాధి పోవునేమోయని భయపడువారికి దేశీయారోగ్య భీమాపద్ధతి (నేషనల్ హెల్తు ఇన్‌సూరెన్సు స్కీము) అనుకూలమైనది. ఈపద్ధతి యింగ్లాండులో ప్రభుత్వమువారిచే అమలులో నుంచబడియున్నది. ఏకారణముచేనైనను వీటిలో చేరనివారికి యిన్సూరెన్సు కంపెనీలు వసతు లేర్పరచగలవు.

కార్మిక సమస్యలగూర్చి విచారించునపుడు యిన్సూరెన్సు యెంతవరకు వృద్ధికివచ్చినది గమనింపవలెను. సాంఘిక భీమా (గ్రూప్ ఇన్‌సూరెన్సు) యొక్కవిధము. యజమానుడు తనవద్ద పనిచేయువారికి తోడ్పడి ద్రవ్యసహాయముచేసియో, లేక స్వతంత్రముగనో, పాలిసీ లిప్పించి వారి మరణకాలమున వారి కుటుంబమునకు జీవనోపాధి కల్గించుచున్నాడు. ఇందువలన భీమావలని లాభములు తెలియని కుటుంబీకులు వాటిలాభములు పొందుటయేగాక, పనివారికి యజమానునకు సౌభ్రాతృత్వభావము కలుగుచున్నది. తనపై అభిమానముంచి తన యనంతరము తన కుటుంబపోషణకై తన యజమానుడు శ్రద్ధవహించుటను గమనించిన యేపనివాడు, రెట్టింపు ఉత్సాహముతో పనిచేసి తన యజమానుని మేలును కోరడు? ఆర్థికములగు ఆటంకములు తగ్గుటయేగాక, పని చులకనగ, బాగుగ ఇందువలన జరుగును. అమెరికాలో ఈ సాంఘికభీమా మిక్కిలిగ అమలులో నున్నది.

పెన్షనుపద్ధతియు ఈవిధముగనే. వ్యాపారి తనవద్దయుండు మూలధనము విలువ తగ్గుచుండుటచే, ఆలోటును పూడ్చుటకుగాను ప్రతి సంవత్సరము లెక్కలు తయారుచేయుచున్నపుడు, కొంత ద్రవ్యము నిలువచేయుచున్నాడు. ఇట్లు చేయుటచేత, విలువ యెప్పటికిని ఒక స్థితియందేయుండును. మానవుని విషయమింతియే. మానవుని శక్తులు వయసు కానుకాను తగ్గుచు వచ్చును. అతని సంపాదనలో కొద్దిగ సేకరించుచువచ్చిన, పనినుండి విరమించునపుడు పెన్షను పొందవచ్చును. యంత్రములు విలువతగ్గి నిరుపయోగమైన పారవేయవచ్చును కాని తనకు విశ్వసనీయుడై

### సుభాషితము

### ౧౪

"తన సంతానమునకు చక్కని ఆధారమును చూపనిచో, తనపై ఆధారపడి యున్నవారలకు తగిన ఉపపత్తి కల్గింపనిచో, రాగల పరిస్థితులనుగూర్చి దూరపు టాలోచనలేనిచో, రాగల దినములను గూర్చి ముందుజాగ్రత్త వహింపనిచో అట్టివాడు పొడిమి అను మంచిగుణము లేనివాడనిపించుకొనుటయే గాక మానవజీవితమునందలి ఉద్దేశమును గూర్చిన విశాల పరిజ్ఞానమునకు అంధుడనికూడ అనిపించుకొనును. మన మీప్రపంచమున మన పొట్టలు నింపుకొనుటకు జీవించుట లేదు; ఇతరులను పోషించుటకొరకు జీవించుచున్నాము. ఇది గుర్తించుటయే పొడిమికి మూలము."

—వుడ్రో-విల్సన్.

అతని వయసున బాగుగ పనిచేసినవానిని యే యజమానుడు తీసివేయ తలపెట్టడు. అందువలననే పెన్షను పద్ధతి అమలులోకి వచ్చినది. కొన్ని కంపెనీలు ఆయా సంవత్సరముల రాబడినుండి పనులనుండి విరమించువారికి పెన్షనులిచ్చుచున్నవి. కాని యీ పద్ధతి తృప్తికరము కాదు. ఒక యంత్రము పూర్తిగ చెడిపోవువరకు ఊరక యుండి, దానికి బదులు మరొకటి కొను ప్రయత్నమే యజమానుడు చేయడు. మొదటినుండియే కొద్దిగ సేకరించుచున్నాడు. పెన్షను పద్ధతియనంతే. వార్షిక చందా, వసూలయిన ధనరక్షణ, బాధ్యతలు యిన్సూరెన్సు కంపెనీలకు వదలవలెను.

ఋణముచేసియు, ప్రభుత్వమువారి నుండి సహాయముపొందియు, మూలధనము బలపరుపబడినది. అనతికాలములో ఇది భీమాపద్ధతికి రాగలదు.

పనికిని, భీమాకును సంబంధమిది. మరణము, వార్ధక్యము, రోగము, ప్రమాదము, లేక నిరుద్యోగము; వీటి వలని అనిశ్చలత్వమును పోగొట్టి భీమా రక్షణయొసంగుచున్నది. ఆర్థికముగ ఇది మంచిది. స్థిరత్వములేనిచో నూతనమగు ఊహలు, స్వతంత్రత, ఆలోచనాశక్తి కలుగుట కవకాశముండక, క్రొత్తదియు మేలైనదియునగు పద్ధతులను అమలులో పెట్టుట కడ్డు తగులుచున్నది.

## నిరుద్యోగము.

ఆధునికపరిశ్రమలలో పనిచేయువారిని నిరుద్యోగభూతము వెన్నాడుచున్నది. కార్మికసంఘమున నిరుద్యోగులధికము. మరియు ప్రపంచమంతయు ఆర్థిక దుస్థితిచే పీడింపబడుసమయమున వీరి సంఖ్య మరింత హెచ్చుచున్నది నిరుద్యోగులు ఆర్థిక భారమును మరింత వృద్ధిచేయుచు, సంఘమునకు కష్టము కలిగించుచున్నారు. అంతేకాక వారికి నిస్పృహపుట్టి, మనోదౌర్బల్యమునకు లోనగుచున్నారు. ఈ కష్టములు తగ్గుటకు దేశీయనిరుద్యోగ యిన్సూరెన్సుపద్ధతి స్థాపింపవలెను. ఇట్టి పద్ధతి 1911-వ సంవత్సరమునుండి యేదో ఒకరూపమున యింగ్లండులో అమలులో ఉన్నది. యజమానుల సహాయము చేతను, భీమాచేయబడిన పనివారిపైనను, ఎక్చెకర్ పైనను యీ పద్ధతి ఆధారపడియున్నది. రాబడి, లాభములుకూడ ముందుగ నిర్ణయింపబడినవి కాన, యేవిధమైన పనిలో ఎట్టి ప్రమాదముకల్గినను ఒక్కటే. నిరుద్యోగులసంఖ్య యెక్కువయినందున ఈ పద్ధతి యిప్పుడంత బాగుగ పనిచేయుటలేదు. అధికముగ

### సుభాషితము

### ౧౫

“ఏదృష్టితో చూచినను ఆధునికజీవితమున జీవితభీమా ముఖ్యావసరమైన దగుచున్నది. జీవితభీమావలని లాభములగూర్చి నాకు గట్టి నమ్మకము గలదు. కావుననే నేను కొన్ని పెద్ద మొత్తములకు సాధారణమైన పాలసీలును, ఎండోమెంటులును తీసికొని యున్నాను.”

—సర్ సి. పి. రామస్వామి అయ్యర్.

## ఇన్సూరెన్సు: ఋణము

ప్రతి వ్యాపారసంస్థయు ఋణముచేయబడిన మూలధనముతోనే సాగింపబడుచున్నది. ఇట్లు అప్పిచ్చుట, అప్పు తీసుకొనుటలవలననే, ఆర్థికవ్యాపారము విరివిగ కొనసాగింపబడుచున్నది. ఎవడును తాకట్టులేనిది అప్పివ్వడు. సాధారణముగ భవనములును, యంత్రములును తాకట్టుంచబడును. అగ్ని యితర ప్రమాదములవలన ఇవి నశింపవచ్చును. ఇవి యిన్సూరు చేయబడియున్నచో నష్టముండదు. ఋణమిచ్చి, తీసుకోవడము, బ్యాంకులు అప్పును కల్గించడము యివన్నియు స్థిరత్వము, నమ్మకమగు వసతు లున్నప్పుడే వీలగును. ఈ స్థిరత్వము యిన్సూరెన్సు యిచ్చుచున్నది. ఏ సంవత్సరమున కెంత విలువయని తెలుసుకొనుటకు వసతిగల భీమాపాలసీనికూడ అప్పిచ్చువారు తాకట్టుగ తీసుకొందురు.

పై మాసమున “ఇన్సూరన్సు : మార్పుకోలు; ఇన్సూరెన్సు : ఇతరదేశములతో వ్యాపారము” అను విషయములనుగూర్చి చర్చింపబడును.

—ఆలూరు రామచంద్రయ్య, బి ఏ.

# మణిమాల

## సన్ పత్రిక శతవార్షిక సంచిక.

డాక్టరు సుధీంద్రుడు అమెరికాలో శతవార్షిక సంచికను ప్రకటించిన 'సన్' పత్రిక విషయమై మనకు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికద్వారా తెలియపరుస్తున్నాడు. ఆ 'సన్' పత్రిక చరిత్ర మనముకూడా నేర్చుకోతగినదిగా ఉంది 'ఆ దేశములో పెన్నీ కొకపత్రిక చొప్పున అమ్మబడిన మొదటిపత్రిక 'సన్'. అప్పటికి న్యూయార్కులో మూడణాలకు తక్కువ అమ్మే పత్రిక లేదు. అనగా పత్రికలు జనసామాన్యానికి అందుబాటులోలేవు. జనసామాన్యానికి కావలసిన విషయాలూ అందులో లేవు. మూడణాల పత్రికలలో విషయాలు రాజకీయవేత్తలకుమాత్రం అర్థమయ్యే విషయాలు. ఒక్కొక్క రాజకీయపక్షానికి ఒక్కొక్కపత్రిక ఉండేది. పక్షాశయాలు ప్రజాశయాలను దిగత్రొక్కేవి. జనసామాన్యము, సామాన్యప్రపంచము ఈ పత్రికల దృక్పథంలో ఉండేవికావు. ఈ పరిస్థితులలో అందరికోసం, అన్నివిషయాలు ప్రకటించి కొద్ది ఖరీదులో అందించే పత్రిక 'న్యూయార్కు సన్' అనే పేరుతో బెంజమిన్ డే అనే ఆయన 1833-వ సంవత్సరము సెప్టెంబరు నెలలో ప్రకటించాడు. అప్పటికి వార్తా సంగ్రహణానికి ఇప్పుడున్న వీళ్ళు లేవు. అయినప్పటికి ఆయన మనుష్యులను పంపి గుర్రాలమీద, పడవలమీద రైళ్ళమీద నిజమైనవార్తలు త్వరలో తెప్పించేవాడు. అదేవిధంగా ఖండాంతరవార్తలుకూడ తాను ముందు తెప్పించేవాడు వీధులలో పత్రికలను అమ్మే బాలురను నియమించిన మొదటివాడు ఆయనమే. క్రమేణ సన్ యొక్క చందాదారులసంఖ్య పెరిగి నేటికి మూడు లక్షలు అయింది. 1868 లో ఈ పత్రికను డానా అనే ఆయన కొన్నాడు. ఆయన ఈ పత్రికను నిరుపమానమైన తెలివితేటలతో నిర్వహించాడు. 'డానా అంటే సన్, సన్ అంటే డానా' అనే అభిప్రాయం కలిగించాడు. ఆయన నిర్వహణంక్రింద 'సన్'లో అసంగతి నీవుచూస్తే అది అంతే అయి ఉండాలి'' అనుకునేంత పేరు సంపాదించాడు నేటికీ ఆపేరు ఆపత్రికకు ఉన్నది. నేడు అది ఒక గొప్ప రిపబ్లికుయొక్క గొప్ప పత్రిక. పెన్నీ అంటే షుమారు అణా (18 పెన్నీలమారకం వచ్చింతర్వాత అంతకు తగ్గింది) అణా అంటే ఆ దేశాలలో చాలాస్వల్పం. సన్ పత్రికను చూచి మనదేశపు పత్రికలు చాలా నేర్చుకోవలసి ఉంటవి. అందరికీఅందుబాటులో ఉండే పత్రికలు ఇక్కడచాలా తక్కువ. ఒక ఫ్రీప్రెస్సువారుమాత్రము రోజుపత్రిక అర్థణాకు సప్లై చేస్తున్నారు. ఈ ఆర్థికపరిస్థితుల ననుసరించి దినపత్రికలేగాని, వారపత్రికలేగాని, మాసపత్రికలేగాని సాధ్యమైనంత తక్కువ ఖరీదులో వీలైనంత ఎక్కువవిషయం ఇవ్వదగ్గవిగా ఉండాలె. ధరలు అందుబాటులో ఉంటేనన్నా ఎక్కువమందికొని ప్రోత్సాహం కలిగించి పత్రికలను ఉన్నతస్థితికి తీసుకురాగలరేమో ఆంధ్రులు చూడవలసి ఉంటుంది.

—కాశ్యపి.

## కోరల పున్నమ.

ఆంధ్రభూమిని ప్రాచీనకాలమునుండియు మార్గశిర పూర్ణిమరోజున 'రొట్టెలుకొరికి కుక్కలకు వేయుట' అను ఆచారమొకటి పరంపరగా వచ్చుచున్నది. సకల వైజ్ఞానికరహస్యముల గుర్తెరింగిన భారతసంతతి యిట్లాచరించుటలో ఏదైన గొప్ప విషమును, మంచి ఫలమును ఉండియే తీరవలయును. చూడగా ఈ దినములలో పూర్ణతృప్తిగా భోజనమొనరింపరాదనియు కొంత తక్కువగనే భుజించవలయుననియు మిగిలినను యితర జంతువుల కొసగుటే శ్రేయస్కరముగాని మనమే భుజించకూడదనియు గోచరించుచున్నది ఈ పున్నమకు యముడు పండ్లుకొరుకుతూ యుంటాడు, కోరలు దురదగాయుంటాయట వాటినిండా విషం ఉంటుందట, ఆ విషం పొయ్యేటందుకు యిట్లారొట్టెలు కొరికేయ్యాలి అనే జనశ్రుతికూడా బలపరుస్తూయున్నది.

ఇట్టి జనశ్రుతి గతానుగతికముగా వచ్చినదేనా లేక శాస్త్రీయమైన ఆధారమేమైనకలదా? యన్ని విమర్శించిన 'కార్తీకమాసమందలి తుది ఎనిమిదిరోజులు మార్గశిరమందలి మొదటి ఎనిమిదిరోజులు యమదంష్ట్రలని ఆరోగ్యశాస్త్రవేత్తలు సెలవిచ్చిరి. ఇట్టిపదునారురోజులను యమదంష్ట్రలని పేర్కొనుటచేతనే ఈ కాలమున మరణమునకును, వ్యాధులపాల్పడుటకును ఎక్కువ అవకాశములున్నవని స్పష్టమగుచున్నది. కావుననే 'స్వల్పభుక్తో హి జీవతి' (శార్ఙ్గధర) అని తన్నివారణోపాయమునుగూడ మనపెద్దలు సెలవిచ్చియే ఉన్నారు అయితే యమునికోరల్లో ఉండేవిషం మనం రొట్టెలుకొరికిచేస్తే పోతుందా అని సందేహం కలగటంకూడా న్యాయమే. అది నిజంగా యమునికోరల్లో విషం ఉంటటంకాదు. అదో రూపకం. యీ కాలంలో మన పండ్లలోనే విషంఉంటుంది, కండూతికూడా ఉంటుంది తినాలనే ఆలోచన తినుటకవకాశముకూడా ఎక్కువగానే ఉంటుంది కావుననే మనకండూతి తీరేటట్లు మనంతింటే యముడి కండూతి తీరేటట్లు మనవధపడుతాడు. మనకోరల్లో విషం ఎక్కువైన కొద్దీ యముడి కోరలవిషంకూడా ఎక్కువై మన మరణానికి కారణమౌతుంది కాబట్టే కొంచెంకొంచెంగానే పండ్లకండూతి బాగాతీరేటట్లు నమలి. తింటం తక్కువగానే తినాలి. ఎక్కువుంటే పారవెయ్యాలికాని తినగూడదు. అప్పుడు కుక్కలు వగైరాలు తింటాయి. ఈ అదన్నాన్నే ఆచరణరూపకంగా చూపటానికి యీ పద్ధతి ఆచరణలోకి తెచ్చారుకాని మరేమిలేదు. ఈ యమదంష్ట్రలు శరద్హేమంతఋతువుల సంధికాలముకూడను. అందుచేతను గూడ ప్రాధాన్యతను గమనించవలసినదే. ఈ కాలమున శరత్తునందలి పిత్తప్రాధాన్యతతగ్గి తన్నిగ్రహణార్థమాచరించిన ఆహారవిహారాదికముచే గల్గు వాతకఫచయముల హరించునటులగదా? యుండవలయును యీసంధికాలచర్య. కావుననే అట్టి కఫవాతవికృతిచేగల్గు అజీర్ణ, అగ్నిమాంద్య, అతిసార, జ్వరాదిరోగములు కలుగకుండుటకై యిందు కఫహరమగు లంఘనము (అల్పభోజన ఉపవాసాదికమును) మున్నగువానిని బోధించిరి. అజీర్ణ సంబంధమయిన రోగాలుకూడా యిప్పుడే యెక్కువగా వస్తూయున్నయి. పైగా పొద్దులేనికాలం, మాగుడుకాలం ఒంటిపూటతింటమే మంచిదని జనుల అనుభవంకూడాను. కావుననే యిట్టి అపాయమునుండి తరించుటకు, ఆరోగ్యశాస్త్రమున బోధించుటేకాక ప్రతిమతమువారును మతవిధులను పేరులతో యించుమించుగా ఈ కాలమున వ్రతాచరణమను పేరుతో ఉపవాసముల విధించిరి. హైందవమతమున కార్తీకమాసము శైవులకు నక్తవ్రతములు, వైష్ణవులకు విష్ణుపూజ, కార్తికదీపవ్రతము మున్నగునవి. మహమ్మదీయమతమున యిప్పుడే యించుమించుగా ఒకమాసము ఉపవాసము రాత్రిభోజనము విధించబడినది. రంజాన్ నెల క్రైస్తవమతమునకూడ యిట్టి ఉపవాసవ్రతమున్నది. హైందవాచారమున పగలంతయు నిరాహారులైయుండుట ఈ కాలమున ముఖ్యమగు విషయము. ఈ ఉపవాసములచే అజీర్ణాగ్నిమాంద్యాదులు హరింపునొంది అగ్నిదీప్తి, శరీరమున లఘుత్వము, ఇంద్రియప్రసాదముకల్గును ఈకాలమున మఱియొక ముఖ్యమైన ఆచారము దీపపూజ. దీపారాధన చలిని హరించును; అగ్నివృద్ధిని కల్గించును. కావుననే వ్రతముఖ్యాంగములలో నిది యొకటియై యున్నది. దీనినిగూర్చియే కార్తికపురాణమంతయు గానముచేయుచున్నది. ఇట్టి విధులన్నిటిని పూర్తిగా జనసంఘమున ప్రచారముచేసి వ్యాపింపచేయుటకే పురాణశ్రవణాదికముకూడ ఏర్పరుపబడినది. బ్రాహ్మణభోజనాదికముగూడ ఇతరులకు తనకున్నదానిలో కొంత యిచ్చి తృప్తిచేయుటకొరకే విధింపబడినది. పూజాదికము మున్నగునవి అన్నియు పరిశ్రమకొఱకేగాని వేరుగాదు. ఇట్లు యీకాలమంతయు ప్రధానమేయైనను, యింతటి దీర్ఘకాలము యమదంష్ట్రలేయైనను, ఆదర్శకర్మాచరణమును మనమునందుంచుకొనుటకు ననువగునటుల ఈపూర్ణిమకు ప్రాముఖ్యమిచ్చిరి. ఇంతియేకాక యిది యీకాలమున కంత్యదివసమగుటగూడ ప్రాధాన్యమును చెందుటకు తగియున్నది.

—వి. వి. యస్. ఆరాధ్య.

# పాలకోడేటి వేంకటకృష్ణారావు పంతులుగారు

## (ఎం. బి. బి. యస్., యఫ్. ఐ. యం)

అక్టోబరు మాసమున తణుకునందు జయప్రదముగ జరిగిన పంద్రెండవ ఆంధ్రరాష్ట్రీయ ఆయుర్వేద వైద్య సమ్మేళనమునకు అధ్యక్షతవహించిన శ్రీయుత పాలకోడేటి వేంకటకృష్ణారావు పంతులుగారు నేటి ఆంధ్ర వైద్యశిఖామణులలో నొకరైయున్నారు.

శ్రీవారు పశ్చిమగోదావరిజిల్లా కొవ్వూరు తాలూకా దేవరపల్లియందు 1889-వ సంవత్సరమున జననమునొందిరి. తణుకునందలి బోర్డు ఉన్నతపాఠశాలయందు పంతులుగారు ప్రవేశపరీక్షనిచ్చి రాజమహేంద్రవరమునందలి ప్రభుత్వకళాశాలయందు జేరి 1909 వ సంవత్సరమున ప్రాథమిక శాస్త్రపరీక్షయందు జయముగాంచిరి. ఆసంవత్సరముననే అనగా ఎఫ్. ఏ పరీక్షలో నెగ్గిన 1909 లోనే వైద్యకళాశాలలోచేరి వైద్యవిద్యాభ్యాసమునకు దొరకొనిరి. 1913-వ సంవత్సరమున బి. ఏ. ఫిజియాలజీబ్రాంచిలో రాజధానిలో మొదటివారుగ జయమునందిరి.



అనంతరము మదరాసునందలి రాయపేటలోని గవర్నమెంటు ఆసుపత్రియందు హౌనరరీ సర్జనుగా నియమింపబడిరి. 1915-వ సంవత్సరమున అచటనే ప్రభుత్వమువారి జనరలు ఆసుపత్రియందు హౌనరరీ ఫిజిషియనులుగ నియమింపబడిరి. 1916-వ సంవత్సరమున వైద్యకళాశాలయందు ఫిజియాలజీలో జూనియరు సెకండ్లు అసిస్టెంటు ప్రొఫెసరు ఉద్యోగమును పొందిరి. 1918-వ సంవత్సరమున ఆకళాశాలయందే ఫిజియాలజీలో జూనియరు ఫస్టు అసిస్టెంటు ప్రొఫెసరు ఉన్నతపదవి నందిరి.

1924-వ సంవత్సరమున శ్రీ పంతులుగారు నూతనముగా స్థాపింపబడిన ప్రభుత్వమువారి ఇండియను మెడికలుస్కూలునందు శారీరారోగ్యశాస్త్రములందు ప్రధానాధ్యాపకులుగ నియమితులైరి. 1926-వ సంవత్సరమునుండియు శ్రీవారు గవర్నమెంటు ఇండియను మెడికలుస్కూలునకంటియున్న భారతవైద్యశాలయందు స్థానిక శస్త్రచికిత్సకులు (ఆర్. యం. వో)గా ఉన్నారు. 1930-వ సంవత్సరమున ఆయుర్వేదమునందలి అత్యున్నతపరీక్షయగు యఫ్. ఐ. యమ్. పరీక్షయందు జయముగాంచిరి.

ఇట్లు వీరు అల్లోపతిక్ వైద్యవిధానమునందును, ఆయుర్వేదవైద్యవిధానమునందును గొప్ప పరీక్షలనిచ్చి రెండు విధానములలోను బౌతులను గనుగొనియున్నారు. అధ్యాపకులు, చికిత్సకులునై శ్రీవారు ఉభయవైద్యములయందును మంచి శాస్త్రజ్ఞానముతో గూడిన అనుభవమును ఆర్జించియున్నారు. అట్టివారిని ఆంధ్రరాష్ట్రీయ ఆయుర్వేద వైద్యసమ్మేళనమువారు ఈ వత్సరమున తమ అధ్యక్షమహాశయులుగ వరించి తమ ఉచితజ్ఞతను ప్రకటించిరి.

శ్రీ వేంకటకృష్ణారావుపంతులుగారికి వైద్యశాస్త్రమునందును, చికిత్సావిధానమునందునుగల పాండిత్యము వారి అధ్యక్షోపన్యాసమునందు ప్రస్ఫుటమగుచున్నది. త్రిదోషసిద్ధాంతమును ఆయుర్వేదవైద్య ప్రశస్తిని బాగుగ వివరించుటతోడు శ్రీవారు ఆయుర్వేదవిద్యాభివృద్ధికి నేడు గావింపవలసిన విశేషకృషిని లెస్సగ చెప్పి చక్కని మార్గములను కొన్నిటిని సూచించిరి.

# సంపాదకీయ సమాలోచన

**శాసనసభాప్రవేశము:—**

శాసనసభాప్రవేశము ముఖ్యావసరమని మహారాష్ట్రములోను, మద్రాసు రాష్ట్రములోను నాయకులు కొందరు సభలుచేసి క్రొత్తపార్టీలను లేవదీయుచున్నారు. వీరి హడావుడి అంతయు గమనించినచో కాంగ్రెసు నిర్వచించిన ప్రణాళికను వీరు అనుసరించలేరని తేటతెల్లమగును. జైలుకు పట్టుమని వెళ్ళలేనివాళ్ళే ఈ పార్టీసభ్యులు. చొరవచేసుకుని ఎవరరైన వెళ్ళినను ఏవో కొన్ని వీళ్ళు చేసుకువెళ్ళినవాళ్ళే. జైలుకు వెళ్లుట మొదలగు కార్యకలాపమునందు వీళ్ళనోటికి తగినంతపని లేదు. పైగా వీళ్ళకు తగినంత పేరులేదు. అదే వీరిని ఈపనికి ప్రోత్సహించి ఉండునని అనుకొనవలసియున్నది. ఈ వాదమునకు మహారాష్ట్రము, చెన్నపట్టణమే పట్టుగొమ్మలు. చూడండి. మహారాష్ట్ర దేశస్థులకు గాంధిమార్గము మొదటినుండియు నచ్చియుండలేదు. అప్పుడప్పుడు ముక్కుచు మూలుగుచు కాంగ్రెసులో చేరిరేగాని వారిలో ఆదినుండి రెస్పాన్సివు కోఆపరేషను పార్టీ అనిఒకటి ఉండనే ఉన్నది. వాళ్ల దేశస్థుడైన తిలకు ఆరోజులనుబట్టి వాళ్ళకు ఒకపద్ధతి చెప్పియున్నాడు. వాళ్ళ ఉద్దేశములో ఆ పద్ధతియేఎల్లకాలము నడవవలెను. అందుకు భిన్నముగా నడిచేపద్ధతి గాంధీకాదు భగవంతుడు చెప్పినను వాళ్లు వినరు. వాళ్ళ రాష్ట్రాభిమానము నిజముగా మెచ్చుకొనతగినదే. ఇక మద్రాసురాష్ట్రములో - తమిళప్రాధన్యమైన మదరాసురాష్ట్రములో - పనిచెయ్యడమనిన కొంచెము వెనకంజే. మాట్లాడమనినచో ప్లాటుఫారములను ఊపివేయగలరు. ఈ కబుర్ల పోగులకు శాసనోల్లంఘనమనినను, జైలుకు పోవడమనినను ఎట్లు సరిపడును? పోనీ మానివెయ్యరాదా అనిన మానివేసినచో పేరో? ఏమిచెయ్యకపోయినను పేరురావలెను. అటువంటివారికి పేరు ఏమియుచెయ్యవద్దు మీరు చాల గొప్పవారని ఏకగ్రీవముగా అందుమనినచో నొకవిధముగా రుచించునేమో! ఈ తమిళముతాకుతోడు అక్కడక్కడ సాంబారు అలవాటయిన ఆంధ్రులుకూడ కనబడుచున్నారు. శాసనసభాప్రవేశము ఉపయోగమూ, నిరుపయోగమూ అనునదికూడ కొంచెము విచారింతము ఇదివరలో శాసనసభాప్రవేశము అనిన ఏమో ఎఱుగని కాంగ్రెసు అయినచో ఆలాభాలున్నవి, ఈలాభాలున్నవని బుకాయింపవచ్చును. ప్రస్తుతము శాసనసభాప్రవేశమునుగురించి మాట్లాడుచున్న నాయకులకు తలదన్నినవాళ్ళే ఈ ఉద్యమమును వెనుక మొదలుపెట్టారు. అందరిని తలదన్నిన పటేలుప్రభువు అంతవాడు ప్రెసిడెంటుకూడ అయినాడు. అయితే పర్యవసానమేమిటి? చాలమంది స్వరాజ్యపార్టీ తరఫునవచ్చినవారు మెల్లగాజారి ప్రభుత్వపు మెరలకులోబడి పార్టీకి నామర్దా తెచ్చినారు. కొందరుజారి ఉద్యోగమునకు ఆశపడినారు. మిగిలినవారు జగద్విఖ్యాతముగా ప్రభుత్వముతో పోట్లాడిపోట్లాడి ఇహ అక్కడచేయగలపనిలేదని తిరిగి వచ్చినారు. స్థితి అట్టిది కాగా శాసనసభలలోకి వెళ్ళవలెను, వెళ్ళ

వలెను అనువారు "ఇందుకుగాను వెళ్ళు చున్నాము. ఇదివరలో శాసనసభలు మాని వేసివచ్చినవారు ఈ తప్పుచేసిరి" అని చెప్ప రేమి? అదియుగాక వీరిప్పుడు ఏశాసనసభ లలో ప్రవేశించెదరు? క్రొత్త వైటుపేపరు సంస్కరణముల క్రిందరాగల శాసనసభల లోనికి వెళ్లుటకు ఇప్పటినించి హంగామా ఎందుకు? వైటుపేపరువద్దు. ఆ సంస్కరణ ములు మాకు పనికిరావని ఘోషించి వాని క్రింద అమలులోనికి రాగల శాసనసభలకు మేము వెళ్లెదము అనినచో లోకజ్ఞానముగల వాళ్లందఱును వీళ్ల కింతఆత్మగౌరవము లేదే మా అని అంటారని ఆలోచనైనను వీరికి లేకపోవుటకు ఆశ్చర్యమగుచున్నది.

## ఊడిపడే నాయకుడు :—

పెద్దన్న షౌకతాలీగారు ఈమధ్య ఒక జ్యోతిషంచెప్పారు ఎవరో ఒక నాయకుడు త్వరలో ఊడిపడతాడని. దాన్నిగురించి విమ ర్శిస్తూ "పయొనీరు" పత్రిక ఈఅర్థంవచ్చేట్టు వ్రాసింది: "నూతన నాయకుడుతప్పక అవ సరమే. ఆయన ఎవరయేది చెప్పలేము, కను చూపుమేరయందు అలాంటివ్యక్తి కనపడడం లేదు. అలాంటివ్యక్తి వచ్చేటప్పుడు అకస్మా త్తుగా ఆవిర్భవిస్తాడనేది నిశ్చయమే కావచ్చు గాని చూచాయగా విచారించడం తప్పు కాదు. పెద్దన్న, వెనక కొన్నాళ్లు తమ్ముడు వెనకా, ఇప్పుడు స్వయంగానూ హంగుచే శాడుగాని అనేకపాత్రలు ధరించినవ్యక్తి ఇక మహమ్మదీయులలో చెప్పుకోతగ్గవారు లేరు వాళ్లయందు ఒకరిమాట ఒకరికి కాదు. ఇహ హిందువులమాట! కొన్నాళ్లు ఒకరి వేదాం తంతోనూ, కొన్నాళ్లు మరొకరి వేదాంతం తోనూ సతమతమవుతూ ఉత్సాహానిరుత్సా హాలమధ్య ఊగులాడుతున్నారు వీళ్లు. గాం ధికి మహాత్మత్వమునకు సంబంధించిన కొంత సరంజాం లేకపోతే ఆయనకూడా కొన్ని తరాలు తంటాలు పడవలసిందే వీరిని వశం చేసుకోవడానికి. జవహరిలాల్ మాట అంద రూ వినడానికి తగిన సావకాశము కనపడదు. హిందూమహాసభయందు ఉన్నవారియందు తనసంకుచితాభిప్రాయాలు దాటి బయట పడగలవాడు లేడు. పోనీ రాష్ట్రాలు వెదుకుదా మా ఎవరూ కనబడడము లేదు. దాసుగారు చనిపోయినతర్వాత బెంగాలు ముండమో సింది నాయకుల విషయంలో. చెన్నపట్టణపు వారు వాగ్వాదపరులుమాత్రమే. బొంబా యివారు ధనార్జనలో కాలంవినియోగిస్తు న్నారు. ఇతర రాష్ట్రాలలోనూ పరిస్థితులు అనుకూలంగా లేవు. అరవింద ఘోషుగారు తమ ఆధ్యాత్మికచింతన మానివేసి వస్తారన డానికి వీలులేదు సుభాషబోసుగారినిగురిం చి, మాట్లాడ నవసరమే లేదు. ఆయన అవ కాశం వచ్చినపుడైనా విజృంభించలేదు. మాటలుమాని కార్యరంగములో దిగ గలు గువారు మితవాదులయందు ఎవరైనా ఉ న్నారా? వృథాప్రశ్న. పరిస్థితులు ఈలాఉన్న ప్పటికి ఎవరైనా నూతననాయకుడు వస్తాడనే అనుకుంటాము. వస్తేమాత్రం ఆయన, బూ జుపట్టిన సూత్రాలనూ, మామూలు పంథా లనూ విడనాడగలడని, ఐక్యజీవనపు సువార్త వ్యాపింపచేస్తాడని ఆశిద్దాము." పై మాటలు వ్రాసినవారికి దేశంలో గాంధిగారిమార్గం నచ్చలేదని, మిగిలినవారిలో దేశాన్ని నడప గలవారు లేరని తోస్తున్నదని విశదమవుతు న్నది. పోనీ భారతదేశక్షేమానికి సతతం పాటుపడే అర్ధాంగ్లపత్రికా సంపాదకులలో ఎవరో ఒకరుగాని, చర్చిల్ మొదలయిన కన్స ర్వేటివుడై హార్డులయందు ఒకరుగాని

భారతదేశక్షేమమే పరమావధిగా బెట్టుకుని మొన్న పెద్ద ఉత్తరం వ్రాసిన సైనికోద్యోగులయందు ఒకరుగాని ఎందుకు కాగూడదూ ఆ ఊడిపడే నాయకుడు?

దంపుడు బియ్యపు సంఘములు:—

బియ్యపుమరలువచ్చి రోకళ్ళకు రోకలి కట్టుకొని జీవించుచున్న పలువురికూటిలో దుమ్ముకొట్టుటయేగాక పోషకపదార్థములను గోల్పోవు తెలబియ్యమునిచ్చి ప్రజారోగ్యమునకు భంగము కల్గించినవి. యంత్రములను ఆరాధించుటవలని హానిని మహాత్ముడు బోధించినపిమ్మట ఈ బియ్యపు మరలవలని హానిని ప్రజలు నెమ్మదిగా గ్రహింప నారంభించిరి విటమినులనుగూర్చిన ప్రచారము హెచ్చినకొలదియు మరబియ్యముపై ప్రజలకు విముఖత ఏర్పడజొచ్చెను. దంపుడు బియ్యమునకు కొంత డిమాండు ఏర్పడినది. గుంటూరు, మదరాసు పట్టణములందు దంపుడుబియ్యపు సంఘములు స్థాపింపబడి దేశభక్త కొండా వేంకటప్పయ్యపంతులు, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు గార్ల ఆశీర్వచనములంది కార్యక్రమమునకు గడంగినవి. కాంతలకరములందు కవ్వము, కదురు, రోకలి ఆడినంతకాలము భారతమాత పాడిపంటల మహాలక్ష్మియై వర్థిల్లినది. వారు వాని నెపుడు విడనాడిరో అపుడే దేశమాతకు దరిద్రదశ ఆరంభమైనది. తొల్లింటి యౌన్నత్యమును తిరిగి పొందుటకు భారత కాంతలు తమ కరములందు తిరిగి కవ్వము, కదురు, రోకలి గీలింపవలయును. కద్దరు, దంపుడుబియ్యముల కొనుగోలు తిరిగి కాంతలు కవ్వము, కదురు, రోకలి కరముల గీలించు యుద్యమమునకు ప్రాణములీయగలదు.

మదరాసుశాసనసభ: ఆంధ్రరాష్ట్రతీర్మానము

వెనుకటి సభలో వాయిదాపడిన ఆంధ్రరాష్ట్రతీర్మానము ఈసారి సభయందు ఆమోదింపబడినది. ఆమోదింపబడినంతమాత్రమున లాభమేమి? వెనుక నొకసారి ఇట్టి తీర్మానము ఆమోదింపబడియున్నదికదా? దానివలన ఏమి ఫలము కలిగినది? ఇప్పుడును అట్టిఫలమే కలుగునా? ఈ తీర్మానము నందుకొని ఆంధ్రులు తగినంత ఆందోళనము చేసి ప్రభుత్వమునకు ఒత్తిడిని కలిగింపనిచో దీనివలని విశేషలాభమును బడయజాలరు. ఈ విషయమైన ఓటింగుసమయమున తటస్థులుగానున్న ఆంధ్రసోదరులు కొందరుగలరు. వ్యతిరేకింపక వారు తటస్థులుగ నుండుటచేతనే అసలీతీర్మానము అంగీకరింపబడుటకు అవకాశము కలిగినది. శ్రీ పాములపాటి వేంకటకృష్ణయ్యచౌదరిగారు ఈ తీర్మానమునకు అనుకూలముగ ఓట్లు సంపాదించుటలో చూపిన చాకచక్యము బహుధా ప్రశంసనీయమై యున్నది. తీర్మానము మొత్తముమీద చాల కష్టముపైననే నెగ్గినదనుట సులభముగ నిర్ణయింపనగును ఇంతటి కష్టముపైన నెగ్గించుకొనగలిగిన ఈ తీర్మానమును ఫలోదయాంతముగ చేయుటకు ఆంధ్రులు విశేషకృషి చేయవలసియున్నది ఇపుడైన ఆంధ్రసభను నాయకులు కూడసత్తురా?


'ఐరావతి' దీపావళి సంచిక:—

బర్మారాష్ట్రమున వలస నెలకొనియున్న ఒకటిన్నర లక్షల ఆంధ్రుల క్షేమాభివృద్ధులకై రంగూనుపురమునుండి ఆఱువత్సరములుగ ప్రచురింపబడుచున్న తెనుగువారపత్రికయగు 'ఐరావతి' 14-10-33 తేదీని వెలువడిన దీపావళిసంచికను వందనపూర్వకముగనందుకొంటిమి. సంచిక చిత్రపటశోభితమై రంగు

రంగుల సిరాలతో ముద్రితమై ప్రకాశకుల ఉత్సాహాతిశయమును ప్రదర్శించుచున్నది. 'ఏదభ్రష్టులైన భూపాలురు', 'గోలకొండ వజ్రము' మున్నగు వ్యాసము లీసంచికకు విలువ తెచ్చునవి. బర్మాలోని ఆంధ్రనాయకులలో నొకరగు శ్రీయుత పరిమి సోమరాజు గారి జీవితము సచిత్రముగ ప్రచురితము.

### ఆంధ్రభూమి : కృష్ణాపత్రిక :—

పత్రికాలోకమున ఏర్పడియున్న మర్యాదననుసరించి మేము 'ఆంధ్రభూమి'ని ప్రారంభమునుండియు కృష్ణాపత్రిక కార్యాలయమునకు పంపుచున్నాము. కాని కృష్ణాపత్రిక సంపాదకులు 'ఆంధ్రభూమి'కి పరటాగా వారి పత్రిక నిచ్చునీతిని ఇంతవఱకు పాటింపలేదు. ఒకవేళ వారికి ఈ పత్రిక సంచికలు అందుటలేదేమో, లేనిచో ఆంధ్రపత్రికాలోకమున చిరప్రతిష్ఠ నార్జించిన కృష్ణాపత్రిక వారిట్టి వ్యతిక్రమము జరుగనిత్తురా అని తొలుత అనుమానించితిమి. కాని సెప్టెంబరు 23-వ తేదీనాటి కృష్ణాపత్రిక చూచుటతోడనే ఆంధ్రభూమి సంచికలు కొన్నియైన వారికి చేరియుండవలయుననుట ధ్రువమైనది. ఆగష్టు మాసపు ఆంధ్రభూమియందు 'ఆరోగ్యవిజ్ఞానము' అను శీర్షికక్రింద ౨౧౭-వ పుటయందు ప్రచురింపబడిన 'చంటిబిడ్డల దేహపరిశ్రమకనువైన పద్ధతి' అను వ్యాసశకలము సెప్టెంబరు 23-వ తేదీనాటి కృష్ణాపత్రికయందు 'ఆయురారోగ్యములు' అను శీర్షికక్రిందఎత్తి ముద్రింపబడియున్నది. అది ఆంధ్రభూమినుండి గ్రహింపబడినట్లు మాత్రము అచట సూచింపబడలేదు. ఇతరపత్రికలనుండి చేకొనిన విషయములను అట్లు చేకొంటిమని సూచించుట పత్రికాలోకమున ఆచారసిద్ధమైననీతి. ఆంధ్రభూమినుండి అపుడపుడు విషయములను గ్రహించుచున్న ఆంధ్రపత్రిక, సమదర్శిని, ఐరావతి, దేశసేవ మున్నగు పత్రికలు ఈ పత్రిక నామమును పేర్కొనుచునేయున్నవి. ఇతర పత్రికలనుండి విషయములను గ్రహించుచున్నప్పుడు మేమును అట్లే గావించుచున్నాము. ఆంధ్రపత్రికలందు వయస్సుచేతను, గౌరవముచేతను తొలుతటి స్థానము నందియున్న కృష్ణాపత్రిక వారు ఇట్లు కావింపకుండుటకు కారణము పొరపాటైయుండునని ఎంచి ఈ విషయమై వారికి లేఖ వ్రాసియుంటిమి. దానికి బదులు కానము. పైగా, జూలైమాసపు ఆంధ్రభూమియందు 'ఆరోగ్య విజ్ఞానము' అను శీర్షిక క్రింద ౧౫౩-వ పుటయందు ప్రచురింపబడిన 'పరుండునపుడు గమనింపదగు మెలకువలు' అనుదానిని నడుమ నడుమ కొన్నివాక్యములను కత్తిరించి 'నిదుర: పండుకొనుపద్ధతి' అను తలపేరుతో ఎత్తి తమ పత్రికయందు ముద్రించుకొనిరి. 'ప్రకృతి' పత్రిక వారు దీనిని తమ నవంబరు మాసపు సంచికయందు ౩౩-వ పుటయందు ముద్రించి కృష్ణాపత్రికనుండి గ్రహించితిమని సూచించిరి. పత్రికలు పాటింపవలసిన నీతిని, నియమములను ఇతర తెలుగుపత్రికలకు ఉపదేశింపజాలు వయస్సును, అనుభవమును పొందిన కృష్ణాపత్రిక ఈ అక్రమమును బుద్ధిపూర్వకముగగాక పొరపాటుచేతనే గావించియుండునని మేము ఇంత జరిగినమీదగూడ తలంచుచున్నాము. కాని ఉత్తరము వ్రాసినను పొరపాటును సవరించుకొనకుండుట; పత్రికను అందుకొనుచు, అందుండి వ్యాసములను గ్రహించుచు పరటాగా తమ పత్రికను పంపకుండుట కృష్ణాపత్రికాకార్యాలయము వారిప్రతిష్ఠకు తగియుండలేదని సవినయముగా మనవి చేయుచున్నాము.



అక్టోబరు, ౧౯౩౩.

౨౬:—గుడివాడ. కేతవరపు లక్ష్మీనరసింహారావు, బి.ఏ. చెరుకువాడ వెంకటనరసింహంపంతులు, కమలాదేవి ఛటోపాధ్యాయిని గార్ల ఎరస్టు.

౨౭:—విశాఖపట్టణము. ఆంధ్రకవుల ఛాయాచిత్ర ప్రదర్శనము. శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు ప్రారంభించిరి.

:—తెనాలి. ఆంధ్రరాష్ట్రీయ ఆయుర్వేదసభ, అధ్యక్షులు పి. వి. కృష్ణారావుపంతులుగారు.

:—తెనాలి. యం. జగన్నశాస్త్రిగారి యింటిని సోదాచేసి 'పల్లెటూరి గ్రంథమండలి'కి చెందిన గ్రంథములను స్వాధీనముచేసికొనిరి.

:—గుంటూరు. 7-వ గుంటూరు మండలమహిళామణులసభ, అధ్యక్షురాలు శ్రీమతి తుర్లపాటి రాజేశ్వరమ్మగారు.

౩౦:—బందరు. డాక్టరు పట్టాభిసీతారామయ్యగారు చేతిలో జాతీయపతాకమునుదాల్చి సీమగుడ్డల దుకాణము ఎదుట విక్రయనిరోధము ప్రారంభింపగ పోలీసువారు ఎరస్టుచేసిరి. కేసు విచారణ. 6 మాసములు కఠినశిక్ష. రు 500 జరిమానా. ఎ తరగతి. వేలూరు చెరసాలకు గొనిపోవబడిరి.

నవంబరు, ౧౯౩౩.

౧:—గుడివాడ. దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారికి 9 నెలలశిక్ష.

౩:—శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుగారు తిరిగి న్యాయవాదవృత్తి స్వీకరించు ప్రకటన.

:—కైకలూరు. సారాదుకాణమునద్ద పికెటింగు చేయుచుండగా, మాగంటి వెంకటకృష్ణయ్యగారి అరెస్టు.

౮:—ఏలూరు:—సప్తమ ఆంధ్రరాష్ట్రీయమహాసభ. శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డి అధ్యక్షురాలు.

౧౧:—మదరాసు. శాసనసభలో ఆంధ్రరాష్ట్రతీర్మానము ఆమోదింపబడెను.

౧౨:—గుడివాడ. అయినంపూడి శ్రీనివాసులుగారు తిరిగి ఎరస్టు చేయబడుట.

౧౩:—నందివాడ. గ్రామములలో కాంగ్రెసు ప్రచారము చేయుచున్నారను కారణమున లోగడ అరెస్టు చేయబడిన శ్రీయుత పూనూరి వెంకారెడ్డిగారు గుడివాడ సబుజైలునుండి విడుదల చేయబడిరి

:—ఆంధ్రవిశ్వవిద్యాలయము సిండికేటువారు ఢిల్లీలో 1931 మార్చిమాసమున జరుగు వివిధవిశ్వవిద్యాలయప్రతినిధుల సంఘమునకు ప్రతినిధులుగా ఎల్. సుబ్బారావు (కాకినాడ), ఫుల్లారెడ్డి గార్లను ఎన్నుకొనిరి.

౧౫:—బెజవాడ. శ్రీయుత అయ్యదేవర కాళేశ్వరరావుపంతులుగారికి క్రిమినల్ ప్రొసీజరుకోడ్డు సెక్షను 108 క్రింద నోటీసు ఇచ్చుట.

౧౬:—బెజవాడ. మ్యునిసిపల్ కౌన్సిలు కోర్టులోని కేసులో తీర్పు. శ్రీమతి జి. రంగనాయకమ్మగారు మున్నగువారు అబ్దుల్ ఖాదరుసాహెబు గారిపైని పెట్టిన కేసులలో ముద్దాయికి 2 నెలలు కఠినశిక్ష. రు 50 జరిమానా విధించబడెను.

౧౭:—రాజమండ్రి. ౨వ ఆంధ్రహోమియోపతికు కన్ఫరెన్సు.

:—కైకలూరు. రిమాండునుండి మాగంటి వెంకటకృష్ణయ్యగారి విడుదల.

౨౭:—పాలకొల్లు. పురపాలకసంఘమురద్దు. శ్రీయుత డి. బి. సి. వెంకటరావుగారు స్పెషలు ఆఫీసరుగా నియమింపబడిరి.

## నకలు మందులను చూచి మోసపోకుడు!!!



శ్రీ సేతుహిమాచలపర్యంతము

నలువది సంవత్సరముల ఖ్యాతి

గాంచిన

# అమృతాంజనము.

అన్ని నొప్పులకు దివ్యాంజనము.

మదరాసు సిటీకి, మైసూరు రాష్ట్రమునకును
సోల్ ఏజెంటు:

ఎం. బి. ఫరీక్షు,

చైనాబజారురోడ్డు, మదరాసు.

అమృతాంజనము డిపో

మదరాసు.

బొంబాయి. కలకత్తా.

[టెలిగ్రాము : లివర్ క్యూరు] [టెలిఫోను నెం. 8139]

ఈ ట్రేడుమార్కును గుర్తింపుడు.



# డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి
## ప్రసిద్ధిచెందిన
# లివర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్.

అద్వితీయము !

అసమానము !

నకిలుమందులను విసర్జింపుడు.

"చికిత్సావిధానమున ఒక క్రొత్తమందు."


"మృత్యుముఖమునుండి వేలకొలది శిశువులను రక్షించినది."

"రోగనిరోధమునకు కూడ సాటిలేని మందు."

## పిల్లలకు

కడుపులో బల్ల, గడ్డ, గుల్మం, వాయువు మొదలగు లివర్ అండు స్ప్లీను (యకృత్ ప్లీహ) అన్నివిధములైన వ్యాధులను లోకప్రఖ్యాతిచెందిన డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి దివ్యౌషధమును ఉపయోగింపుడు. పిల్లలను లివర్ అండ్ స్ప్లీను వ్యాధులు రానీయకుండా చేయుటయే కాక ఆకలి, జీర్ణశక్తులను వృద్ధిపరచి మలబద్ధము లేకుండా కాలవిరేచనము సరిగా అవుటకును, రక్తమును శుభ్రపరచుటకును వాడతగిన ఔషధరాజము.

| హెడ్ ఆఫీసు : | బ్రాంచి ఆఫీసు : |
|---|---|
| 8, శాలై వీథి, మైలాపూర్, | 125, హారిజాన్ రోడ్డు. |
| మదరాసు. | కలకత్తా. |



# If your Children
*suffer from*
**LIVER & SPLEEN COMPLAINTS**
*start giving them to-day*

**JAMMI VENKATARAMANAYYA'S**

**FAMOUS LIVER & SPLEEN SPECIFICS**

8, SALAI STREET,
MYLAPORE,
MADRAS.